PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuram

సంపుటి : 45 సంచిక : 120 | విజయవాడ, సోమవారం 1 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 1 December 2025 | Rs

గురజాడ స్ఫూర్తిని కొనసాగించాలి

- సదస్సులో వక్తలు పిలుపు

2

టీమిండియా ఘన విజయం

8

ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాలు

- ఉగాదికి మరో 5 లక్షల ఇళ్లు
- టిడిపి నేతలతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- అనర్హులకు పెన్షన్లు అందుతున్నాయని వ్యాఖ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పార్టీ నేతలకు సూచించారు. యూనిట్ వ్యవస్థ పార్టీకి బలంగా ఉందని తెలిపారు. టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ముఖ్యనేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పొలిటికల్ గవర్నెన్స్ అనేది ప్రభుత్వ విధానమన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన ఎలాంటి ఆటంకమూ లేకుండా పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల అనర్హులకు పింఛన్లు అందుతున్నాయని అన్నారు. అర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని తెలిపారు.

పింఛన్ల కోసమే ఇప్పటి వరకు రూ.50,763 కోట్లు ఖర్చు చేశామని, దేశంలోనే ఇది అతిపెద్ద డిబిటి కార్యక్రమం అని చెప్పారు. ప్రజలకు సంతృప్తి ఇస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో 17 నెలలుగా తాను స్వయంగా పాల్గొని అందిస్తున్నానని తెలిపారు. సోమవారం జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించటంతో పాటు ప్రజలతో నేతలు మమేకం కావాలని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించి చెబితే కూటమిని కాదని పక్క పార్టీలకు ప్రజలు ఓటు వేయరని తెలిపారు. కార్యకర్తల మనోభీష్టం మేరకే నాయకత్వం ముందుకెళ్లాలని కోరారు. పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవిస్తున్నామని చెప్పారు. అందరితో సమన్వయం చేసుకుని పార్టీ శ్రేణులు ప్రజల్లోనే ఉండాలని తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించి డిసెంబర్ క్యాలెండర్ రూపొందించామన్నారు.

ఉగాది నాటికి మరో 5 లక్షల ఇళ్లను ప్రజలకు అందిస్తామని తెలిపారు. ప్రతి అర్హుడైన పేదవాడికీ సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నెల 3న రైతు సేవా కేంద్రాల్లో వర్కుషాప్‌ల ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం, 5న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాలు ఉన్నాయని వెల్లడించారు. వీటిల్లో పార్టీ నాయకత్వం, కార్యకర్తలు హాజరుకావాలని చెప్పారు. త్వరలోనే ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఉమ్మడి కుటుంబాలకు మరింత లబ్ధి చేకూర్చే విధానం అమలు చేస్తామన్నారు. గత పాలకుల విధ్వంసంతో రాష్ట్రానికి చాలా ఇబ్బందులొచ్చాయని విమర్శించారు. రాజకీయ కక్షతో నీరు-చెట్టు, ఎన్‌ఆర్ఇజిఎస్ బిల్లులను కూడా నిలిపివేశారని, కేంద్రంతో మాట్లాడి వీటిని మంజూరు చేయించామన్నారు. ఇళ్ల పథకంలో గత పాలకులు నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. గత పాలకుల విధ్వంసంపై ప్రజల్లో ఇంకా చర్చ జరగాలని తెలిపారు.

GYANESH KUMAR

ఎస్ఐఆర్ గడువు వారం పొడిగింపు

- ఫిబ్రవరి 14న తుది జాబితా
- ఇసి ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

వివాదాస్పద ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) మరో నిర్ణయం తీసుకున్నది. దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (యుటిలు)లో జరుపుతోన్న ఎస్ఐఆర్ గడువును వారం పొడిగించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. ఎస్ఐఆర్ గడువు పొడిగింపు నేపథ్యంలో ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో డిసెంబర్ 9న విడుదల చేయాల్సిన ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 16న విడుదల చేస్తారు. ఫిబ్రవరి 14న తుది జాబితా ప్రచురించనున్నట్లు ఈసీ పేర్కొన్నది.

బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా చేపట్టిన ఎస్ఐఆర్ రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. ఇప్పుడు దేశవ్యాప్తంగా మరో 12 రాష్ట్రాలు, యూటీలలో సర్‌ను నిర్వహిస్తుండటం కూడా తీవ్ర విమర్శలు, వ్యతిరేకతకు దారి తీసింది. పలు రాష్ట్రాల్లో ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ విధుల్లో ఉన్న ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్స్ (బిఎల్ఒలు) తీవ్ర పని ఒత్తిడి, వేధింపుల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గుజరాత్ వంటి రాష్ట్రాల్లో బిఎల్ఒలు నిరసనలూ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఇటు ఓటర్లకూ తీవ్ర ఇబ్బందికరంగానే మారింది. 2002 నాటి సమాచారాన్ని పొందటం వారికి కష్టంగా మారింది. అటు బిఎల్ఒలు, ఇటు ప్రజలూ సర్ కారణంగా ఆందోళనకు, గందరగోళానికి గురవుతున్నారు.

అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్; కిరణ్ రిజిజు, జెపి నడ్డా, అర్జున్ మేఘువాల్, కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ

అఖిలపక్ష సమావేశంలో మోడీ సర్కార్ మౌనం

- లేబర్ కోడ్లు, ఎస్ఐఆర్, జాతీయ భద్రతపై పార్లమెంటులో చర్చకు ప్రతిపక్షాల పట్టు
- సభ్యుల డిమాండ్లపై నోరు మెదపని అధికారపక్ష నేతలు
- నేటి నుంచి శీతాకాల సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 1 నుంచి 19 వరకు సమావేశాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పార్లమెంట్ హౌస్‌లో కేంద్ర రక్షణ మంత్రి, బిజెపి అగ్ర నాయకులు రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. పలువురు కేంద్ర మంత్రులతో పాటు 36 పార్టీలకు చెందిన 50 మంది నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రతిపక్ష కాంగ్రెస్, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకె తదితర పక్షాలకు చెందిన ప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రధానంగా ప్రస్తావించి పార్లమెంటులో చర్చించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రధానంగా శ్రమజీవుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని, ఏకపక్షంగా అమల్జేస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆపేయాలని, దేశ రాజధాని న్యూఢిల్లీలో ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రవాద దాడి నేపథ్యంలో జాతీయ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ అంశాలన్నింటిపైనా పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర చర్చ చేపట్టాల్సిన ఆవశ్యకతను ప్రతిపక్షాల ప్రతినిధులు ఉద్ఘాటించారు. అయితే కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన బిజెపి నాయకులు ఈ అంశాలపై నోరు మెదపకుండా ప్రతిపక్షాల నేతలు చెప్పినంతసేపూ ఆలకించి మిన్నకుండిపోయారు. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో.. 'సభ సజావుగా సాగేందుకు సహకరించండి' అనే సాధారణ సాంప్రదాయ విజ్ఞప్తులు మినహా ప్రతిపక్షాలు ప్రస్తావించిన ప్రధాన అంశాలన్నింటిపైనా అధికార పక్ష నేతలందరూ మౌనముద్ర దాల్చారు. దీనిపై ప్రతిపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షం ఐక్యగళం 7

రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్, బిజెపి దుష్ప్రచారం

- చైతన్యంతో పరిరక్షించుకోవాలి
- జెడి శీలం, పరకాల ప్రభాకర్

2

విత్తన చట్టంతో కార్పొరేట్లకు మేలు

- రౌండ్ టేబుల్‌లో వక్తలు

3

కుంభమేళా కోసం వేలాది చెట్లు నరికివేత

- నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్ తీరుపై సర్వత్రా ఆగ్రహం

7

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి

- హోంమంత్రికి వి శ్రీనివాసరావు లేఖ
- అండదండలిచ్చిన వారందరినీ అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గంజాయి, మత్తుమందులను అడ్డుకుని నెల్లూరులో ప్రజలకు అండగా నిలిచిన కె పెంచలయ్యను చంపినవారిని, వారికి అండదండలిచ్చి ప్రోత్సహించిన వారందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఆయన కుటుంబాన్ని పరామర్శించి వారికి అన్ని విధాలా పునరావాస చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి అనితను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు హోంమంత్రికి ఆదివారం లేఖ రాశారు. నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో పెంచలయ్య తన కళారూపాలతో, చైతన్యపరుస్తూ గంజాయి, మత్తుమందులతో కుటుంబాలు నాశనం కారాదని పట్టుదలతో పోలీసులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి గంజాయి అంతం చేయాలని చురుకుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో గంజాయి ముఠా కక్షగట్టి ఆయనను వెంటాడి, వేటాడి అత్యంత దారుణంగా, క్రూరంగా, కన్నబిడ్డల ముందే కత్తులతో నరికి చంపడం రాష్ట్రంలో తీవ్ర ఆందోళన, ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు.

హంతకులు కత్తులు, రాడ్లు, మారణాయుధాలతో స్వైరవిహారం చేసి, బైక్‌పై వెళ్తున్న అతడిని తరిమి తరిమి చంపడం వెనుక గంజాయి మాఫియా ఉందనేది స్పష్టమని తెలిపారు. కొంతకాలంగా గంజాయి ముఠాను నడుపుతూ వారితో చోరీలు, నేరాలు, గంజాయి, మత్తుమందుల అమ్మకాలు చేయిస్తున్న ఒక మహిళ కారణమని పోలీసులు ఇప్పటికే ప్రకటించారని, ఆమెను తక్షణం అరెస్టు చేయాలని, ఎవరు అధికారంలో ఉంటే వారి అండదండలు ఆమెకు పుష్కలంగా ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. గంజాయి మీద ఉక్కుపాదం మోపుతున్నట్లు మీరు పదే పదే ప్రకటిస్తూ వచ్చారని, కానీ గంజాయి ముఠా చేసిన ఈ హత్యపై హోంమంత్రిగా కనీసం స్పందించలేదని వివరించారు. మాటమాత్రంగానూ ఖండించలేదని, ఇలా అయితే గంజాయిపై పోరాడే వారికి మీరు ఎలా భరోసా ఇవ్వగలరని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆ గంజాయి మాఫియాకు బలైన యువకుడి కుటుంబాన్ని సందర్శించి, భరోసా కల్పించాలని కోరారు.

పెంచలయ్య భార్య దుర్గకు రూ.50 లక్షల సాయం, ఆరు ఎకరాల భూమి, ఉద్యోగం ఇవ్వాలి

పెంచలయ్యది అత్యంత నిరుపేద మిగతా 7లో

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మార్కాపురం (ప్రకాశం జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు గ్రామానికి చెందిన మందా సత్యనారాయణరెడ్డి (45)కి ఎకరం పొలం ఉండగా, మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి సాగు చేశారు. గత ఏడాది పంటలకు గిట్టుబాటు ధర లేక, కూలి ఖర్చులు కూడా రాలేదు. పెట్టుబడులన్నీ అప్పులుగా మిగిలిపోయాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడతాయని, గిట్టుబాటు ధర లభిస్తే గత ఏడాది అప్పులైనా తీర్చుకోవచ్చని అనుకుంటే మొంథా తుపానుతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో 20 లక్షలు ఉన్న అప్పు తీర్చలేక... అప్పు ఇచ్చిన వారి ఒత్తిళ్లతో నవంబరు 26న కోలభీమునిపాడులో పురుగు మందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు వైద్యం కోసం మార్కాపురం తరలించగా అప్పటికే పరిస్థితి విషమించింది. దీంతో ఒంగోలు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సత్యనారాయణరెడ్డి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మార్కాపురం రూరల్ ఎస్ఐ పి.అంకమరావు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి, నెల్లూరుకు దిత్వా ముప్పు

- నేడు అతి భారీ వర్షాలు
- విద్యాసంస్థలకు సెలవు
- రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుపాను కొనసాగుతోంది. ఉత్తర తమిళనాడు - పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా కదులుతూ ఆదివారం రాత్రికి తీవ్ర వాయుగుండంగా బలహీన పడిందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ప్రస్తుతం కారైకాల్‌కి 120 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 90 కిలోమీటర్లు, చెన్నైకు 150 కిలోమీటర్లు దూరంలో కేంద్రీకృతమైంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన 6 గంటల్లో 5 కిలోమీటర్ల వేగంతో తుపాను కదులుతోందని, దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం నాడు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతి భారీ వర్షాలు, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

కావలిలో 62.5 మిల్లీమీటర్ల వర్షపాతం

తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షపాతాలు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లా కావలిలో 62.5 మిల్లీమీటర్లు, నావూరులో 48, బుచ్చిరెడ్డిపాలెంలో 47, జలదంకిలో 36.2, తిరుపతి జిల్లా చిట్టమూరులో 30.7 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతాలు నమోదయ్యాయి.

తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవు

తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్లు సెలవు ప్రకటించారు. తిరుపతి జిల్లాలో ముసురు వాన కురుస్తోంది. తిరుమలలో మంచుదుప్పటి ముసురు వేసింది, చలికి యాత్రికులు గజగజలాడు తున్నారు. తిరుపతి జిల్లాలోని తీరప్రాంతాల వద్ద అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలోని విద్యాసంస్థలకు సోమవారం కలెక్టరు వెంకటేశ్వర్ సెలవు ప్రకటించారు.

నెల్లూరు జిల్లాలో చలి గాలులు

నెల్లూరు జిల్లాలో చలి గాలులు వీస్తున్నాయి. ఆదివారం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షపు జల్లులు పడ్డాయి. సోమవారం భారీ వర్షం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జెసి ఎం వెంకటేశ్వర్లు సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కూడా రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

అవసరమైతే పునరావాసాలకు ప్రజలు

దిత్వా తుపానుపై సమీక్షలో హోంమంత్రి అనిత

దిత్వా తుపాను నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని హోంమంత్రి వంగలపూడి అనిత మిగతా 7లో

బస్తాకు రూ.490 కోత

- 75 కిలోల ధాన్యానికిచ్చేది రూ.1300 మాత్రమే
- అధిక తేమ శాతం పేరుతో కొనుగోలు కేంద్రాల్లో తిరస్కరణ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పచ్చలతాడిపర్రు వద్ద కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం

గుంటూరు జిల్లా పచ్చలతాడిపర్రుకు చెందిన రైతు పి.వెంకట్రావు తన ధాన్యం అమ్మకం కోసం శ్యాంపిల్స్ తీసుకొని పొన్నూరులోని కొనుగోలు కేంద్రానికి వెళ్లారు. తేమ శాతం 28 ఉందని, ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని అధికారులు తేల్చి చెప్పారు. వెల్లలూరుకు చెందిన రైతు ప్రభాకరరావుకు, కసుకుర్రు గ్రామానికి చెందిన సుబ్రమణ్యానికి కూడా ఇదే అనుభవం ఎదురైంది. దీంతో, ఈ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు 75 కిలోల బస్తాను రూ.1300 చొప్పున అమ్ముకోవాల్సి వచ్చింది. బస్తా ఒక్కంటికీ రూ.492 చొప్పున నష్టపోయారు. జిల్లాలోని ఇతర రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు.

జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగు తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందనే పేరుతో కొనుగోలు కేంద్రాల్లో తిరస్కరిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు ధరలో భారీ కోత విధిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.62 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 3.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 70 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 209 రైతు సేవా కేంద్రాల పరిధిలో 47 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇటీవల వచ్చిన మొంథా తుపాను వరిపై తీవ్ర ప్రభావం చూపింది. దిత్వా తుపాను నేపథ్యంలో పొలంలో ఉన్న ధాన్యం వెంటనే విక్రయించకపోతే తడిసిపోతుందనే భయంతో రైతులు ఉన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే తేమ ఎక్కువగా ఉందనే పేరుతో తిరస్కరిస్తున్నారు. దీంతో, వ్యాపారులకు అయినకాడికి విక్రయించుకుంటు న్నారు. ఆదివారం పొన్నూరులో వర్షం జల్లులు ప్రారంభం కావడంతో పొలాల్లో ఉన్న ధాన్యాన్ని లారీలకు ఎత్తడం కన్పించింది. నాలుగు రోజులుగా తుపాను హెచ్చరికలతో వరి కోతలను యంత్రాల ద్వారా చేసి వెంటనే నూర్పిడి చేయించి అక్కడికక్కడే విక్రయించేస్తున్నారు. మిషన్ల ద్వారా నూర్పిడి చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే అక్కడి అధికారులు, మిల్లర్లు విధిస్తున్న ఆంక్షలు తమను ఇబ్బంది పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా తేమ 17 శాతం మించితే ధాన్యం కొనుగోలుకు అధికారులు తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచు కురుస్తుండడం, వాతావరణం ఎక్కువగా మేఘావృత్తమైఉండడం వల్ల ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ధాన్యం ఆరబెట్టుకునేందుకు వసతులు లేని రైతులు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. తగిన స్థలాలు లేక ప్రధానంగా రోడ్డుపై పోయాల్సి వస్తోందని పలువురు రైతులు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం 'ఎ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389 ధర ప్రకటించింది. దీని ప్రకారం 75 కిలోల బస్తా రూ.1,792కు కొనుగోలు చేయాలి. సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,369 ప్రకటించింది. దీని ప్రకారం 75 కిలోల బస్తా రూ.1776కు కొనుగోలు చేయాలి. రెండు రోజుల క్రితం వరకు బస్తా రూ.1400కు కొనుగోలు చేయగా, తుపాను హెచ్చరికలతో వ్యాపారులు ధరను రూ.1300కు తగ్గించేశారు.

కాలిఫోర్నియాలో కాల్పుల కలకలం

- నలుగురు మృతి.. 14 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా..

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి వెర్రితలలేస్తోంది. పదేపదే కాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌లో శనివారం రాత్రి కాల్పులు జరిగాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం..ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. మరో 14 మంది గాయపడ్డారు. ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకలో గుర్తు తెలియని దుండగులు కాల్పులకు పాల్పడినట్లు శాన్ జోక్విన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు వివరించింది.

క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపింది. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వివరించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

సోనియా, రాహుల్‌లపై కొత్త ఎఫ్ఐఆర్

- నేషనల్ హెరాల్డ్ కేసులో నేరపూరిత కుట్ర అభియోగాలు
- మరో నలుగురిపై కూడా..

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు మరో నలుగురిపై కొత్త ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఇచ్చిన సమాచారంతో వారిపై నేరపూరిత కుట్ర అభియోగాలు మోపినట్టు ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యు) పోలీసులు తెలిపారు.

సోనియా గాంధీ, రాహుల్ గాంధీ (ఫైల్)

ఈ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబె, శ్యామ్ పిట్రోడాతో పాటు యంగ్ ఇండియా సంస్థ కూడా కుట్ర, మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఇడి ఆరోపిస్తోంది. వీరందరూ కుట్రపూరితంగా కేవలం రూ.50 లక్షలు చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్)కు చెందిన రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులపై అధికారాన్ని పొందారని వెల్లడించింది. అయితే కేసులో నిందితులుగా ఉన్న మోతీలాల్ వోరా 2020లో, ఆస్కార్ ఫెర్నాండెజ్ 2021లో మరణించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురిస్తున్న ఎజెఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించి దాని ఆస్తుల్ని ఆధీనంలోకి తీసుకోగా.. రాహుల్, సోనియాకు మెజార్టీ వాటా ఉన్న యంగ్ ఇండియా రూ.50 లక్షలు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెల్లించి ఎజెఎల్‌ను సొంతం చేసుకొన్నట్టు ఇడి అభియోగపత్రంలో వివరించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకున్నది.

గురజాడ స్ఫూర్తిని కొనసాగించాలి

సదస్సులో వక్తలు పిలుపు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్, కోట, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మహాకవి, నవయుగ వైతాళికుడు గురజాడ సంఘ సంస్కరణ ఉద్యమ స్ఫూర్తిని, సాహిత్య రచనల సందేశాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం గురజాడ వెంకట అప్పారావు 110వ వర్ధంతి సందర్భంగా విజయనగరంలో సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ రచనలు-ప్రాసంగికత పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గురజాడ అప్పారావు జంక్షన్లో గురజాడ విగ్రహానికి ప్రముఖ సాహితీవేత్త, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రముఖ సామాజికవేత్త పి.ఎ.దేవి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి జడ్‌పి సమావేశ మందిరం వరకు నిర్వహించిన గురజాడ గౌరవ యాత్రను విశ్లేషకులు పిఎ దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత జడ్‌పి సమావేశ మందిరంలో గురజాడ సాహితీగోష్టి నిర్వహించారు. 'గురజాడ యుగస్వరం ఎందుకని' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

'గురజాడ ప్రవచించిన దేశభక్తి' అనే అంశంపై సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలకపల్లి రవి మాట్లాడారు. గురజాడ గొప్ప దార్శనికుడని, దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన నిజమైన దేశభక్తుడు గురజాడ అని కొనియాడారు. గురజాడ రాసిన దేశభక్తి గీతాన్ని ప్రపంచం మొత్తం పాడాలన్నారు. గురజాడ అంటే భయం వల్లే ఆయన

గురజాడ గౌరవయాత్రలో పాల్గొన్న సాహితీవేత్తలు, కవులు, రచయితలు

జయంతి, వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు పాలకులు వెనుకాడుతున్నారని తెలిపారు. ప్రముఖ రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ గురజాడ దేశభక్తిని ప్రజల్లోకి ఎంతలోతుగా తీసుకెళ్తే అంత మెరుగైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. 'ప్రముఖులు స్మారక భవనాలు, చిహ్నాలు పరిరక్షణ- ఆవశ్యకత' అంశంపై జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి జి.మురళీధర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఇంటాక్ మాజీ కన్వీనర్ ఈమని రాణీశర్మ ప్రసంగించారు. గురజాడ నివాసాన్ని, జ్ఞాపకాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్.చలం మాట్లాడుతూ గురజాడను, గిడుగును పాలకులు నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారన్నారు.

'గురజాడ స్త్రీ పాత్రల ఔన్నత్యం'పై ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు రమాగీతాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ విశ్లేషకులు పిఎ దేవి మాట్లాడారు. గురజాడ రచనల్లోని ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుందన్నారు. సమాచార హక్కు కమిషనర్ రెహానా మాట్లాడుతూ మధురవాణి పాత్ర స్త్రీ ధైర్యాన్ని ఔన్నత్యాన్ని చూపిందని వివరించారు. 'కన్యాశుల్కం సామాజిక ప్రయోజనం' అంశంపై సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కెఎస్.లక్ష్మణరావు ప్రసంగించారు. గురజాడ స్వగృహాన్ని స్మార్ట్ కేంద్రంగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. అందుకు జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని కోరారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గురజాడ వారసులు వెంకటప్రసాద్, ఇందిర, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

గురజాడ పేరిట సాంస్కృతిక విశ్వవిద్యాలయం

గురజాడ పేరిట సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తెలకపల్లి రవి కోరారు. గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సభ ఆదివారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజల భాష కోసం పోరాడిన గొప్ప భాషావేత్త గురజాడ అని కొనియాడారు.

గురజాడ తన సాహిత్యంతో సమాజ పోకడలను మార్చడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం బాధ్యులు వివిఎస్.పద్మనాభరాజు, విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు, ప్రముఖ రంగస్థల దర్శకులు బొట్టా వేణుగోపాలరావు, నాగా ఎడిటింగ్ స్టూడియో ఫౌండర్ నాగ చైతన్య, గురజాడ సాంస్కృతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు పివి.రమణ, దండు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర హక్కుల కోసం పోరాటం

- పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో వైసిపి ఎంపిలకు జగన్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర హక్కుల కోసం పార్లమెంటులో పోరాడాలని, మొంథా తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకునేలా కేంద్రాన్ని పార్లమెంటులో కోరాలని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ ఆ పార్టీ ఎంపిలకు సూచించారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభం నేపథ్యంలో వైసిపి ఎంపిలతో జగన్ ఆదివారం సమావేశం నిర్వహించారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ప్రధాన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంపై పార్లమెంటులో సమస్యను లేవనెత్తాలని తెలిపారు. కోస్తా జిల్లాల్లో లక్షల ఎకరాల పంటను నాశనం చేసిన మొంథా తుపాను విధ్వంసంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం, కేంద్రం ఇప్పటి వరకూ పరిహారం అందించలేదని పేర్కొన్నారు. దీంతో రైతులు ఆర్థిక బాధలు భరించలేకపోతున్నారని వివరించారు. కనీస మద్దతు ధరను నిర్ధారించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆర్‌బికెలు, ప్రత్యక్ష సేకరణ ద్వారా ఎంఎస్‌పికి హామీ ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం అటువంటి పనిచేయడం లేదని వివరించారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కంది, అరటి, మిర్చి, మామిడి వంటి ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరలు లేవని పేర్కొన్నారు. వీటిపై పార్లమెంటులో లేవనెత్తాలని ఎంపిలకు తెలిపారు. వైసిపి ప్రభుత్వం పంటలబీమా ఇచ్చిందని, ఇప్పటి ప్రభుత్వం తిరస్కరించడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు రక్షణ లేకుండా పోయిందని వివరించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించడం లేదని, ప్రభుత్వం ఇ-క్రాప్ లెక్కింపును నిలిపేసిందని, దీంతో పరిహారానికి రైతులు అనర్హులుగా రికార్డుల్లో చూపిస్తున్నారని, దీనిపైనా నిలదీయాలని తెలిపారు. 18.63 లక్షల ఉపాధి హామీ జాబ్‌కార్డులను తొలగించారని, దీంతో ఉపాధి కష్టమైందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటుకు అప్పగించడానికి జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని సూచించారు. వేర్వేరు విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నించడం అంటే పూర్తిగా ప్రైవేటీకరణకు ఆమోదం తెలపడమేనని, దీనిపై పార్లమెంటులో వ్యతిరేకించాలని సూచించారు. ప్లాంటు కోసం భూమిచ్చిన వారి త్యాగాలను మరువకూడదని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దుచేసి మైన్స్ కేటాయించేలా పార్లమెంటులో నిలదీయాలని ఎంపిలకు సూచించారు.

పెంచలయ్య హత్యపై రాష్ట్రమంతటా ప్రజాగ్రహం

ప్రజాశక్తి - యంత్రాంగం

కర్నూలు కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న సిపిఎం ప్రజాసంఘాల నాయకులు

నెల్లూరు జిల్లాలో ప్రజా కళాకారులు, సిపిఎం నాయకులు పెంచలయ్య హత్యను ఖండిస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. హత్యకు పాల్పడిన గంజాయి గుండాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి మాఫియా రాజ్యమేలుతోందని, టిడిపి కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. నెల్లూరులో డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా యువతను ఏకం చేసి పోరాడిన పెంచలయ్యను రెండు రోజుల క్రితం పట్టపగలు నడి రోడ్డుపై గంజాయి గ్యాంగ్ అతి కిరాతకంగా నరికి చంపిందన్నారు. నిందితులను అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసుల పైనే దాడి చేయడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. విజయవాడ 50వ డివిజన్ మహంతిపురంలో సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు పాల్గొని మాట్లాడారు. బాపట్ల జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో పెంచలయ్య చిత్రపటంతో పాత బస్టాండు సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాలతో ప్రజలను చైతన్యపరుస్తున్న యువ కళాకారుడు పెంచలయ్యను హత్య చేయడం హేయమైన చర్యని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. చిత్తూరులో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరసింహ, సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగారాజు పాల్గొన్నారు. ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం మండల కేంద్రంలో, కర్నూలు కలెక్టరేట్ ఎదుట, నంద్యాల జిల్లా కేంద్రంలో శ్రీనివాస సెంటర్ నుండి గాంధీ చౌక్ వరకు, ఆత్మకూరులో, శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం, పలాస, కొత్తూరులోనూ కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు.

అరవ కామాక్షి అరెస్టు

నెల్లూరు : 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, అరవ కామాక్షిని పోలీసులు అరెస్టు చేశారు. నవాబుపేట పోలీస్ స్టేషన్లో సిఐ వేణుగోపాల్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోలీసు శాఖకు లభించిన పక్కా సమాచారం మేరకు కిన్నెర ప్రసాద్ లే అవుట్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. 25 కేజీల గంజాయిని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న అరవ కామాక్షిని పోలీసులు అరెస్టు చేశారు. గంజాయిని సీజ్ చేశారు. నిందితురాలిని పోలీసులు విచారించారని, కల్లూరుపల్లి ప్రాంతంలోని ఆర్‌డిటి కాలనీలో ప్రజానాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్య హత్య కేసులో కీలక సూత్రధారి అని గుర్తించామని సిఐ చెప్పారు.

'కామాక్షి' గంజాయి సామ్రాజ్యం

- రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్న వైనం

ప్రజాశక్తి ప్రతినిధి - నెల్లూరు

ప్రజాకళాకారులు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య హత్యకు ప్రధాన సూత్రధారి అరవ కామాక్షి నెల్లూరు నగరంలో గంజాయి సామ్రాజ్యానికి డాన్‌గా వ్యవహరిస్తోంది. నేర సామ్రాజ్యం విస్తరణకు ప్రధాన రాజకీయ పార్టీలను ఆమె వేదిక చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో మరింత రెచ్చిపోయింది. నగరంలో పలు పోలీస్ స్టేషన్లలో ఆమెపై కేసులు ఉన్నాయి. ఆమె భర్త, తమ్ముడు, బంధువులు అంతా ఇదే వ్యాపారం చేస్తున్నారు. పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా రాజకీయ పార్టీల అండతో కామాక్షి తన కార్యకలాపాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఆర్‌డిటి కాలనీలో ఆమె తల్లి, తమ్ముడు, బంధువులు ఉన్నారు. ఇక్కడా గంజాయి సంస్కృతిని పెంచడంతో పెంచలయ్య ఎదుర్కొన్నారు. అక్కడి యూత్‌ను సంఘంగా ఏర్పాటు చేశారు. తమ వ్యాపారానికి అడ్డు వస్తున్నాడనే కక్షతోనే ఆయనను అత్యంత కిరాతంగా కామాక్షి హత్య చేయిచింది. నెల్లూరు నగరంలో సమాధు తోట (బొడిగాడితోట) ప్రాంతంలో ఉంటున్న ఆమె ఆ ప్రాంతంలోని, ఇతర ప్రాంతాల్లోని కొందరి పేద యువకులను ఆశ చూపించి వారితో గంజాయి విక్రయం, దొంగతనాలు చేయిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా డివైఎస్ఐ నెల్లూరు నగరంలో ఆందోళన నిర్వహించింది. కేరళ ఎంపి కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆ తర్వాత పోలీసులతో కలిసి పెంచలయ్య ఆ ప్రాంతంలో సంఘం ఏర్పాటు చేసి, గంజాయిని విక్రయించనీయకుండా చేశారు. కామాక్షిని కాలనీకి రాకుండా అడ్డుకున్నారు.

పెంచలయ్య హత్యతో తెరమీదకు!

పెంచలయ్య హత్యతో కామాక్షి నేర సామ్రాజ్యం తెరమీదకు వచ్చింది. నెల్లూరు నగరంతోపాటు, జిల్లా వ్యాప్తంగా గంజాయి సామ్రాజ్యాన్ని విస్తరించినట్టు, చెన్నెయ్, బెంగళూరు ప్రాంతాలకు

ఇక్కడి నుంచి గంజాయి సరఫరా చేస్తున్నట్టు, ఇందులో కామాక్షి కీలకంగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కేవలం యువకులే కాకుండా కాలేజీ, స్కూల్ పిల్లలను గంజాయికి బానిసలుగా మార్చినట్లు పోలీసులలో విచారణలో తేలింది. కామాక్షి రాజకీయ పలుకుబడి పెంచుకొని తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించింది. 2024 ఎన్నికలు, అంతకు ముందు వైసిపికి సన్నిహితంగా మెలిగింది. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించింది. వైసిపి కారణంగానే పోలీసులు ఆమె జోలికి వెళ్లలేదనే ప్రచారం ఉంది. పెంచలయ్య హత్య సూత్రధారి కామాక్షేనని తెలయడంతో పోలీసులు ఆమె మూలలను వెతికి బయటకు తీస్తున్నారు. సత్యనారాయణపురం, పెన్నా ప్రాంతంలో ఇటీవల రూ.80 లక్షలతో నూతన గృహ నిర్మించినట్లు గుర్తించారు. ప్రధాన రాజకీయ పార్టీలకు చందాలు ఇచ్చిందనే ప్రచారం ఉంది.

వైసిపి, టిడిపి పరస్పర ఆరోపణలు

పెంచలయ్య హత్య తర్వాత గంజాయి విషయంలో వైసిపి, టిడిపి ఇరకాటంలో పడ్డాయి. కామాక్షి వైసిపికి చెందిన వారని టిడిపి నేత, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధారాలతో బయటపెట్టారు. టిడిపికి చెందిన వ్యక్తిగా వైసిపి నేతలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి ఆరోపించారు. పెంచలయ్య హత్య నేపథ్యంలో మాదక ద్రవ్యాలపై ప్రజా ఉద్యమం రానుంది. కామాక్షితోపాటు ఈ కేసుతో ప్రమేయం ఉన్న అందరినీ శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి- నెల్లూరు

కె పెంచలయ్య హత్య కేసులో మొత్తం 14 మంది నిందితుల్లో ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. ఈ నెల 28న కె.పెంచలయ్య తన చిన్న కుమారుడిని పాఠశాల నుంచి ఇంటికి తీసుకొస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన కొంతమంది ఆయనను స్కూటర్‌తో ఢీకొట్టి కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ దురాఘతానికి పాల్పడిన నాగుల జానకిరాం అలియాస్ ఝూన్ (24), దరా విష్ణువర్ధన్ (22), అరవ సతీష్ (19), మిందాల లోహిత్ (22), ఈగ వినయ్ (21), కల్లూరు సతీష్ (18), అరవ జోసెఫ్ (40)ను ఆమంచర్ల ప్రాంతంలో పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు వినియోగించిన మారణాయుధాలను, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఆర్‌డిటి కాలనీలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఉండేది. వాటిని నియంత్రించేందుకు కె.పెంచలయ్య, పోలీసులు కృషి చేశారు. ఇది ఓర్వలేక పెంచలయ్యను హత్య చేశారు. ఇందులో జెమ్స్ కీలక పాత్ర పోషించాడు. ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారి అరవ కామాక్షి అని డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో వేదాయపాళెం సిఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెంచలయ్యను గంజాయి మాఫియా హత్య చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది.

పే స్లిప్‌లో ఉద్యోగుల బకాయిలు

- మంత్రి పయ్యావులకు ఎపిజెఎసి అమరావతి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల బకాయిలు ఏ ఉద్యోగికి ఎంత రావాలో వారి పే స్లిప్‌లలో స్పష్టంగా తెలపాలని, ఉద్యోగ విరమణ పొందిన వారి మెడికల్ బిల్లులు ప్రాధాన్యతా క్రమంలో చెల్లించాలని ప్రభుత్వానికి ఎపిజెఎసి అమరావతి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి, ఎపి కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఫణి పేర్రాజు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఆదివారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సిఎం ఆదేశాల మేరకు మహిళా ఉద్యోగినులు రిటైర్డు అయ్యే వరకు చైల్డ్ కేర్ లీవ్ వాడుకునేలా ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని కోరారు. ప్రధానంగా చనిపోయిన ఉద్యోగుల బెనిఫిట్స్, రిటైర్డు అయిన ఉద్యోగుల బెనిఫిట్స్, అత్యవసర వైద్య ఖర్చులు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, పిల్లల వివాహం వంటి అత్యవసర అవసరాలుగా ఉన్న ఈ క్లెయిమ్స్‌ను ప్రాధాన్యతా క్రమంలో క్లియర్ చేయించాలని విజ్ఞప్తి చేశారు.

విత్తన చట్టంతో కార్పొరేట్లకు మేలు

- రౌండ్ టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విత్తన చట్టం-2025 ముసాయిదా కార్పొరేట్ శక్తులకు మేలు, రైతాంగానికి నష్టం చేసేదిగా ఉందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. విజయవాడలోని ఎంబివికెలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం సంయుక్త ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ఈ బిల్లు రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయాన్ని కేంద్రం తన ఆధీనంలో తెచ్చుకోవడానికి ఉద్దేశించిందని పేర్కొన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం రైతు, కౌలు రైతు సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ముసాయిదాపై కేంద్ర ప్రభుత్వానికి అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు తీర్మానాన్ని ప్రవేశపెడుతూ.. అమెరికా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు సిద్ధమవడానికి మన ప్రభుత్వం ఈ ముసాయిదా బిల్లును తీసుకొస్తుందన్నారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ ద్వారా జన్యుమార్పిడి విత్తనాలను దేశం దిగుమతి చేసుకోవాలని అమెరికా కోరుతున్న దానికి కేంద్ర ప్రభుత్వం తలూపుతుందని విమర్శించారు. ఈ బిల్లు ద్వారా



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వై కేశవరావు, చిత్రంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, వి కృష్ణయ్య తదితరులు

నష్టపోయిన రైతులు కోర్టుకు వెళ్లడానికి వీలు లేకుండా కట్టడి చేస్తుందని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త బి శరత్‌బాబు మాట్లాడుతూ.. ఈ బిల్లు రైతుల హక్కులను పూర్తిగా సర్వనాశనం చేస్తుందని తెలిపారు. విత్తన ఖరీదు ఎంత ఉంటే, అంతే నష్టపరిహారం ఇస్తామని బిల్లులో పొందుపరిచారని చెప్పారు. పంట సాగు చేసేందుకు ఎరువులు, పురుగు మందులకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టినప్పటికీ వందల్లోనే విత్తన కంపెనీలు రైతులకు నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటాయని పేర్కొన్నారు. జన్యు మార్పిడి విత్తనాలు వేస్తే ప్రతి సంవత్సరం విత్తన సంస్థల వద్ద విత్తనాలు కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని, తద్వారా విత్తనాల కోసం కార్పొరేట్ కంపెనీల మీద రైతులు పూర్తిగా ఆధారపడే స్థితికి తీసుకెళ్తాయని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త వేణుగోపాల్ మాట్లాడుతూ.. రానున్న కాలంలో ఈ చట్టంతో రైతాంగానికి మరింత నష్టం కలుగుతుందని చెప్పారు. నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ.. అమెరికాలో తయారు చేసిన విత్తనాలు దేశంలో ఎక్కువగా అమ్ముకోవడానికి ఈ చట్టం దారులు తెరుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు తదితరులు ప్రసంగించారు. వివిధ సంఘాల నాయకులు మర్రాపు సూర్యనారాయణ, వి నరసింహారావు, జొన్నా శివశంకర్, కె అజయ్ కుమార్, కె సురేష్ బాబు, కె గణేష్ కుమార్, బొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డి.మత్స్యలేశం తీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు చేపల వేట చేస్తూ సముద్రంలో దారి తప్పి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం తీరానికి ఆదివారం చేరుకున్నారు. వారి బోటును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆకలితో ఉన్న వారికి స్థానిక మత్స్యకారులు భోజనం పెట్టారు. మెరైన్ సిఐ ప్రసాదరావు, ఎచ్చెర్ల పోలీసులు, మత్స్యశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని వీరిని కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దిత్వా తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో వీరు అదుపు తప్పి వచ్చారా? వేరే కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో వారిని బంగ్లాదేశ్‌లోని బోలబార్సిల్ జిల్లా చర్‌కోలాచద్ గ్రామానికి చెందిన సయివ్, జహంగీర్, సభీర్, కోకన్, మఖ్‌సూద్, మాలిక్, మహ్మద్ ఫరూఖ్, మాక్‌సుద్, నాసిర్, హెలెల్, ఫరూఖ్, అలామ్, సమెన్‌గా గుర్తించారు. వీరు నవంబరు పదో తేదీన చేపల వేటకు వెళ్లి తప్పిపోయినట్లు గుర్తించారు. సముద్రంలో బోటు దారి తప్పి, 20 రోజుల తర్వాత డి.మత్స్యలేశం సముద్ర తీరానికి చేరుకున్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగంపై ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి దుష్ప్రచారం

- చైతన్యంతో పరిరక్షించుకోవాలి
- మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్

సదస్సులో మాట్లాడుతున్న జెడి శీలం, వేదికపై పరకాల ప్రభాకర్ తదితరులు

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

భారత రాజ్యాంగం పట్ల బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం అన్నారు. ప్రాథమిక విద్యలోనే పాఠ్య పుస్తకాల్లో రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖలోని అంబేద్కర్ భవన్‌లో 'భారతదేశ రాజకీయాలు - రాజ్యాంగ నైతికత, అంబేద్కర్ ఆలోచనలు' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో రాజ్యాంగాన్ని పాఠంగా చేర్చాలన్న విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. యువత ప్రధానంగా రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకొని దేశంలో జరుగుతున్న పరిణామాల పట్ల వాస్తవాలను గ్రహించాలన్నారు. రాజ్యాంగం మతానికి వ్యతిరేకమని చెప్పి, ఆ విషయాన్ని ప్రజల్లోకెక్కించి రాజ్యాంగంపై హిందూ మతోన్మాద శక్తులు దుష్ప్రచారం చేస్తున్నాయని వివరించారు. రాజ్యాంగంలోని సెక్యులర్ అనే పదాన్ని తొలగించేందుకు కుట్ర పన్నారన్నారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, రచయిత పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేసి రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. అదిప్పుడు ప్రమాదంలో పడిందని, దాని పరిరక్షణకు కార్యాచరణతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై సభలు, సమావేశాలు, సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యం కలిగించాల్సిన అవసరముందన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ ఓటు హక్కు కల్పించారని తెలిపారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కల్యాణ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎఎంఎస్ ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్, ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు, ఎయు న్యాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కె.పల్లవి, డాక్టర్ అర్జున, గార సత్యనారాయణ, టి.చిరంజీవి పాల్గొన్నారు.

'సర్జికల్ బ్లేడ్' ఘటనలో బాధ్యుల సస్పెన్షన్

- వైద్యారోగ్య శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ జిల్లా, తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఓ యువకుడికి శస్త్రచికిత్స సమయంలో సర్జికల్ బ్లేడ్‌ను శరీరంలో ఉంచి కుట్లు వేసిన ఘటనకు కారకులైన వారిని సస్పెండ్ చేసినట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు ఆర్థోపెడిక్ వైద్యుడు సత్యసాగర్, స్టాఫ్ నర్సు పద్మావతిని వైద్యారోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి, శస్త్రచికిత్స ద్వారా స్టీలురాడ్డు వేయించుకోగా, నొప్పి ఎక్కువగా ఉందని రావడంతో వైద్యుడు సత్యసాగర్ స్క్రూను నవంబరు 27న తొలగించారు. అదే సమయంలో సర్జికల్ బ్లేడును లోపల ఉంచి కుట్లు వేశారు. దీంతో యువకుడికి మళ్లీ నొప్పి ఎక్కువైంది. దీంతో ఎక్స్‌రే తీయగా లోపల సర్జికల్ బ్లేడ్ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంటు ఇచ్చిన వివరణపై సంతృప్తి చెందని ఉన్నతాధికారులు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారితో విచారణ నిర్వహించి ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్నారని తెలిపింది.

ఆప్టా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా ప్రకాష్‌రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నూతన కమిటీ ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాకి ప్రకాష్‌రావు, ఎమ్‌జి మహాడి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎస్‌జిటిలకు ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, పిఎస్ ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులు కేవలం సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాత్రమే ఇవ్వాలని, 1 నుంచి 10 వరకు తరగతులు జరుపుతున్న ఉన్నత పాఠశాలల నుంచి ప్రాథమిక పాఠశాలలను విడదీయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొంది.

హామీలు నెరవేర్చాం : మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకిచ్చిన హామీలతో పాటు, ఇతర అనేక హామీలను కూటమి ప్రభుత్వం 17 నెలల కాలంలో నెరవేర్చిందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములు కట్టబెడుతున్నారని వైసిపి నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సిఎం జగన్‌లా భూ దోపిడీకి పాల్పడటం లేదన్నారు. పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం తప్పా? అని ప్రశ్నించారు. రాయితీలు ఇస్తేనే రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు జగన్ చేసిందేమీ లేదన్నారు. రైతు భరోసా పథకంలో ఏడాదికి రూ.12,500 ఇస్తామని చెప్పి కేవలం రూ.7,500 రైతులకు ఇచ్చి మోసం చేశారన్నారు.

కొలకలూరి ఇనాక్‌కి గురజాడ విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి - విజయనగరం కోట

గురజాడ సాంకేతిక సమాఖ్య అందించే ప్రతిష్టాత్మక మహాకవి గురజాడ వెంకట అప్పారావు విశిష్ట పురస్కారం ప్రముఖ సాహితీవేత్త, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు ఈ ఏడాది లభించింది. ఆదివారం విజయనగరంలోని పివిజి రాజు క్షత్రియ కళాక్షేత్రంలో ఆ సమాఖ్య ఆధ్వర్యంలో గురజాడ 110వ వర్ధంతి సందర్భంగా గురజాడ సాహితీ చైతన్య ఉత్సవ సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారాన్ని హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్ ప్రదానం చేశారు. అనంతరం మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ సాహితీలోకానికి గురజాడ ధ్రువతారని, ఆయన రచనల్లో దేశభక్తి కనిపిస్తుందని అన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ అన్న గురజాడ రచనలతో వ్యక్తిత్వ వికాసం, మానవతా దృక్పథం అలవడిందని తెలిపారు. 'కన్యాశుల్కం' ద్వారా సాంఘిక దురాచారాలను ఎలుగెత్తి చాటారన్నారు. సమాజాన్ని అనేక దృక్కోణాల్లో చూసి, సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేశారని కొనియాడారు. పురస్కార గ్రహీత కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ గురజాడ పురస్కారం పొందడం అద్భుతమైన వరమంటూ ఆనందం వ్యక్తంచేశారు. స్త్రీలకు సమానత్వం కోరుకున్న వ్యక్తి గురజాడ అన్నారు. మహిళలపై దురాచారాలను వెలుగు చూపేందుకు ఆయన రచనలు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా గురజాడ కుటుంబ సభ్యులను వెంకట ప్రసాద్, ఇందిర, లలిత, శ్రీకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్, గురజాడ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షులు పి.వి.నరసింహరాజు, అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అవార్డ్ : కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్

రైతులు దశలవారీ పోరాటాలకు సిద్ధం కండి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
- మునక ప్రాంత రైతాంగ పోరాట కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాశినాయన (వైఎస్ఆర్ జిల్లా)

పోరుమామిళ్ల చెరువు నీటి కారణంగా ముంపునకు గురవుతున్న పది గ్రామాలకు పరిహారం ఇవ్వకపోతే ఆందోళన తప్పదని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పోరుమామిళ్ల మండలం టేకూరుపేట ఆంజనేయ స్వామి గుడి వద్ద పోరుమామిళ్ల చెరువు కింద ఉండే చెర్లోపల్లి రెవెన్యూ గ్రామాల రైతు బాధితుల సదస్సు ఎన్. బైవర ప్రసాద్, కల్లూరి రాజారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పోరుమామిళ్ల చెరువు నీటి కారణంగా ముంపునకు గురవుతున్న పది గ్రామాలకు సంబంధించిన 1,239 ఎకరాల పంట పొలాలను కృష్ణా జలాల ముంపు నుంచి కాపాడాలని కోరారు. అలా సాధ్యం కాని పక్షంలో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోరుమామిళ్ల చెరువు కింద పోరుమామిళ్ల మండలంలోని టేకూరు, టెకూరుపేట, తిరంగలాపురం, సూరుసిద్దిపల్లె, దాసరి పల్లె తిమ్మారెడ్డి పల్లె, కవల కుంట్ల, తోకల పల్లె, కొర్రపాటి పల్లె తదితర గ్రామాల పంట భూములు బ్రహ్మ సాగర్ జలాశయం నుంచి వచ్చిన నీటితో అక్టోబర్ చివరలో మునిగిపోయాయని తెలిపారు. వరి, మొక్కజొన్న, సొద్ద, చిక్కుడు, కాకర, బీర, చౌల కాయలు వంటి పంటలు పూర్తిగా నాశనమయ్యాయని పేర్కొన్నారు. ఒక్కొక్క రైతు ఎకరానికి సగటున రూ. 30 వేల నుండి రూ. 40 వేలు ఈ పంటలపై పెట్టుబడిగా పెట్టారన్నారు. బద్వేల్ చెరువు, దిగువన ఉన్న ఇతర చెరువులకు నీళ్లు ఇచ్చేందుకు తెలుగు గంగ అధికారులు పోరుమామిళ్ల చెరువులో సామర్థ్యానికి మించి నీరు నిల్వ చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామానికి ఐదారుగురు రైతులు మాత్రమే నష్టపోయారని జాబితా రూపొందించడం సరైంది కాదని ఆయన తెలిపారు. బాధిత రైతులకు ఎకరాలకు రూ. 15 లక్షలు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు.

అనంతరం చెర్లోపల్లె రెవెన్యూ మునక ప్రాంత పోరాట రైతాంగ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బైరవ ప్రసాద్ ఎన్నికయ్యారు. వీరితో పాటు గ్రామానికి ఇద్దరు చొప్పున 30 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

అమరావతి కరకట్టపై కొత్త బ్రిడ్జి

- రెండు లైన్లుగా ఏర్పాటుకు నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నగరంలో ఉండవల్లి పరిధిలోని కొండవీటివాగు స్లూయిస్ వద్ద రెండు లైన్లతో వంతెన నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం రూ.55.58 కోట్లను కేటాయించింది. ఈ మేరకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లను ఆహ్వానించింది. 12 నెలల కాలపరిమితితో దీన్ని పూర్తి చేయాలని, మరో 12 నెలలు నిర్మాణ సంస్థ నిర్వహించాలని అందులో పేర్కొంది. ప్రస్తుతం కొండవీటివాగు వద్ద కరకట్టకు ఉన్న స్లూయిస్ వద్ద సింగిల్ లైను మాత్రమే ఉంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ఉన్నతాధికారులందరూ నిత్యం ఈ వంతెన మీద నుంచే ప్రయాణించాల్సి వస్తోంది. సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. దీంతో స్లూయిస్ వద్ద రెండు లైన్ల బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19లోనే ఇక్కడ వంతెన నిర్మించాలని నిర్ణయించినా అప్పట్లో ప్రభుత్వాలు మారడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. ఇప్పుడు కొత్తగా రెండు లైన్ల వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. ప్యాకేజీ నెంబరు 53లో భాగంగా రెగ్యులేటర్ వద్ద కొత్తగా కొండవీటివాగు, గుంటూరు ఛానెల్‌కు షిప్‌లాక్, రెగ్యులేటర్ నిర్మించనున్నారు. కృష్ణా పశ్చిమ కెనాల్‌కు ఉన్నట్లు ఆధునిక రహదారి ఏర్పాటు చేయనున్నారు.

హెచ్‌ఐవి నియంత్రణలో ప్రథమం : మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హెచ్‌ఐవి కేసుల నియంత్రణలో రాష్ట్రమే ప్రథమ స్థానంలో ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) నిర్దేశించిన 80 శాతం లక్ష్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ (ఎపి శాక్స్) 76.96 శాతం సాధించిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ జనాభాలో పరీక్ష వచ్చిన వారిలో హెచ్‌ఐవి పాజిటివిటీ రేటు 2015-16లో 2.34 శాతం ఉండగా, 2024-25 నాటికి 0.58 శాతానికి తగ్గిందని వెల్లడించారు. కండోమ్ వంటి సురక్షిత విధానాలపై తీసుకొచ్చిన అవగాహన చర్యల వల్ల పాజిటివిటీ తగ్గుతూ వస్తుందని పేర్కొన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మరణాలు కూడా 88.72 శాతం తగ్గినట్లు న్యాకో ఇటీవల జారీచేసిన వార్షిక అంచనాల్లో పేర్కొందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న హెచ్‌ఐవి కేసుల్లో రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో 42,008 మంది ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నారని పేర్కొన్నారు.

శ్మశానాలు ఎలా?

- అమరావతిలో కొత్త సమస్య
- ఎమ్మెల్యేకు పురమాయించిన సిఎం
- గ్రామాల వారీ పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఇటీవల సమావేశంలో ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం అవుతున్న సమయంలో సెంటిమెంట్ అంశం ముందుకొచ్చింది. ఇప్పుడున్న గ్రామాల్లో అంతిమ సంస్కారాలకు అవసరమైన శ్మశానవాటికలపై కొద్దికాలంగా చర్చ జరుగుతోంది. ఇటీవల ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని రైతులు ముందుకు తీసుకొచ్చారు. రాజధాని ఒకే నగరంగా మారుతున్న నేపథ్యంలో ఒకటీ లేదా రెండుచోట్ల శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికోసం ఇప్పటికే శాఖమూరు పరిధిలో అధునాతన పద్ధతుల్లో శ్మశానవాటిక నిర్మించారు. అయితే రెండు రోజుల క్రితం సిఎం వద్ద జరిగిన సమావేశంలో రైతులు గ్రామాల వారీ శ్మశానవాటికలు కావాలని తెలిపారు. కొన్ని గ్రామాల్లో రహదారుల పనుల పేరుతో వాటికి వెళ్లే రహదారులు తవ్వేశారని, దీనివల్ల ఇబ్బంది అవుతోందని పేర్కొన్నారు. ఎంతటివారైనా చివరకు తన స్వగ్రామంలోనే అంతిమ సంస్కారాలు నిర్వహించాలని కోరుకుంటారని, కనుక ఆ విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సిఎం స్పందించారు. వెంటనే గ్రామాల వారీ ఎక్కడెక్కడ శ్మశానాలు ఏర్పాటు చేయాలి, అన్ని మతాలకూ ఒకేచోట పెట్టాలా లేక వేర్వేరుగా ఏర్పాటు చేయాలా అనే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామాల వారీ ప్రజల అభిప్రాయం తీసుకుని నివేదిక తయారు చేయాలని, దీని ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. త్రీమెన్ కమిటీలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. ప్రస్తుతం గ్రామాల వారీ ఉన్నాయని, తరువాత లేఅవుట్లు అభివృద్ధి చేస్తామని, వాటిల్లో వేర్వేరు గ్రామాల ప్రజలు ఉంటారని, అందువల్ల రాజధానిని యూనిట్‌గా తీసుకుని ఒకటి లేదా రెండుచోట్ల ఏర్పాటు చేస్తే అవసరమైతే మరొకటి పెట్టొచ్చని, గ్రామాల వారీ శ్మశానాలు అంటే సమస్య వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అయినా రైతుల అభిప్రాయాలు తీసుకోవాలని సిఎం సూచించిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఇచ్చే నివేదిక ఆధారంగా ఏం చేయాలనే అంశం పరిశీలిస్తామని చెబుతున్నారు.

మూడు, నాలుగు గ్రామాలకు ఒకచోట

రైతులు మాత్రం నాలుగు గ్రామాలకు కలిపి హిందువులకు ఒకచోట ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిసింది. కృష్ణానది ఒడ్డున గ్రామాలకు రెండుచోట్ల ఏర్పాటు చేయాలని సూచించాలని నిర్ణయించారు. అలాగే తుళ్లూరులో ఇప్పటికే హిందూ శ్మశానవాటిక ఉంది. అక్కడే మరో మూడు గ్రామాలకూ కలిపి ఏర్పాటు చేయాలని సూచించినట్లు సమాచారం. శాఖమూరు పరిధిలో మోడల్ శ్మశానవాటిక కట్టిన నేపథ్యంలో మిగిలిన వాటిని కూడా అదే పద్ధతిలో నిర్మించాలని నిర్ణయించారు. పెనుమాక, ఎర్రబాలెం, ఉండవల్లి, నవులూరు గ్రామాలకు ఒకచోట, నిడమర్రు, నీరుకొండ, కురగల్లు, ఐనవోలుకు మరోచోట హిందూ శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వచ్చినట్లు సమాచారం. అలాగే దళితులకు ఏ గ్రామానికి ఆ గ్రామం ఇవ్వాలని సూచించారు. వారి సంప్రదాయం ప్రకారం భూమి అవసరం ఎక్కువగా ఉంటుందని, అందువల్లే ప్రత్యేకంగా ఇవ్వాలని సిఎం చెప్పినట్లు తెలిసింది.

బహిరంగ ప్రకటన

(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 102 యొక్క సబ్ సెక్షన్ (1) క్రింద)

శ్రీమతి డి అపర్ణ రుణదాతలకు హెచ్చరిక కోసం

క్ర.సం.	సంబంధిత వివరాలు	
1	వ్యక్తి/వ్యక్తిగత హామీదారు పేరు	శ్రీమతి డి అపర్ణ భర్త డి శ్రీదర్ రెడ్డి
2	వ్యక్తి/వ్యక్తిగత హామీదారు చిరునామా	ఎస్-3, బంజారా స్ప్రింగ్స్, మిత్రుల నగర్, రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ.
3	ఐబిసి, 2016లోని సెక్షన్ 95 క్రింద చేసిన దివాలా తీర్మాన దరఖాస్తు తేదీ (మధ్యంతర మారటోరియం ప్రారంభ తేది నుండి)	27/11/2025
4	వ్యక్తిగత హామీదారుకు వ్యతిరేకముగా దివాలా ప్రక్రియ ప్రారంభ ఉత్తర్వు వివరములు	మంగళగిరిలోని గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ ఉత్తర్వులు ప్రకారం CP(IB)/8/95/AMR/2024 తేది: 27.11.2025న
5	క్లెయిమ్‌లు దాఖలు చేయుటకు ఆఖరి తేది	22/12/2025
6	తీర్మాన నిపుణులుగా వ్యవహరిస్తున్న దివాలా నిపుణుల పేరు మరియు రిజిస్ట్రేషన్ నెం.	మన్నవ దివాకర శర్మ రిజిస్ట్రేషన్ నెం. IBBI/IPA-001/IP-P01192/2018-2019/11917
7	బోర్డు వద్ద నమోదైన విధముగా తీర్మాన నిపుణుల చిరునామా మరియు ఇ-మెయిల్	5-4-11, 2/3, బ్రోడిపేట్, గుంటూరు-522002, ఆంధ్రప్రదేశ్ ఇ-మెయిల్ ఐడి: mdsarma2003@yahoo.com
8	తీర్మాన నిపుణులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుటకు చిరునామా మరియు ఇ-మెయిల్	5-4-11, 2/3, బ్రోడిపేట్, గుంటూరు-522002, ఆంధ్రప్రదేశ్ ఇ-మెయిల్ ఐడి: pgdaparna@gmail.com
9	సంబంధిత ఫారముల లభ్యత	ఫారము బి (రుణదాత ద్వారా రుజువుతో కూడిన క్లెయిమ్0 https://www.ibbi.gov.in/ home/ downloads వెబ్ లింక్ అందుబాటులో ఉంది.

ఈ నోటీసు ద్వారా తెలియజేయడమేమనగా గౌరవనీయులైన జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ వారు వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించిందని ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. **శ్రీమతి డి అపర్ణ భర్త డి శ్రీధర్ రెడ్డి 27.11.2025**న **ఎవిఎస్ఆర్ ఇంజనీరింగ్ & ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (U45200AP2005PLC048258)**కు విస్తరించిన వ్యక్తిగత హామీకోసం కెనరా బ్యాంక్ దాఖలు చేసిన IBC 2016 యొక్క సెక్షన్ 95గా పేర్కొన్నారు. **శ్రీమతి డి. అపర్ణ భర్త డి శ్రీధర్ రెడ్డి** యొక్క క్రెడిటార్లు ఎంట్రీ నెం. 8లో తెలిపిన చిరునామాలో రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు రుజువుతో తమ క్లెయిమ్‌లను **22.12.2025**న లేదా ఆలోగా దాఖలు చేయవలసిందిగా కోరబడుతున్నారు. క్రెడిటార్లు ఎలక్ట్రానిక్ సాధనాల ద్వారా లేదా కొరియర్ ద్వారా లేదా స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా అందజేయడం ద్వారా తమ క్లెయిములను దాఖలు చేయవచ్చును.
గమనిక: తప్పుడు సమాచారం లేదా అసంబద్ధ నిరూపణలతో దాఖలు చేసినచో క్లెయిములు ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ కోడ్-2016 యొక్క ఏదైన ఇతర వర్తించే చట్టాల ననుసరించి జరిమానాలు విధించబడును.

సం/- మన్నవ దివాకర శర్మ
కార్పొరేట్ రుణగ్రహీతకు వ్యక్తిగత హామీదారు కోసం రిజల్యూషన్ ప్రొఫెషనల్
తేది: 01.12.2025
రిజిస్ట్రేషన్ నెం.: IBBI/IPA-001/IP-P01192/2018-2019/11917
ప్రదేశం: గుంటూరు
AFA 31.12.2025 వరకు చెల్లుతుంది

భారత భౌగోళిక లక్షణాలు వైజ్ఞానికం

అన్ని పోటీ పరీక్షల ప్రత్యేకం

-జంపాన సుధాకర్
డైరెక్టర్, ప్రతిభ కోచింగ్ సెంటర్,
విజయవాడ.
సెల్ : 6303080574

ప్రపంచ దేశాలను పరిశీలిస్తే మిగతా దేశాల కంటే భిన్నంగా మన భారతదేశం ఉంటుంది. సముద్రాలు, నదులు, ఉపనదులు, పర్వతాలు, ఎడారులు, మైదానాలు ఇలా అనేక ప్రత్యేకతలు కనిపిస్తుంటాయి.

భూగోళంలో ప్రత్యేక లక్షణాలతో భారత భూభాగం ఉంది. మన దేశ ఉపరితల భౌగోళిక స్వరూపం లక్షల సంవత్సరాల సుదీర్ఘ భూచలన చర్యల ఫలితంగా ఏర్పడింది. ఈ ఉపరితలం దేశం మొత్తం మీద ఒకేలా, సమానంగా ఉండదు. పర్వతాలు, మైదానాలు, పీఠభూములు, ఎడారి ప్రాంతం, తీరప్రాంతం, దీవులు మొదలైన ప్రపంచంలోని అన్ని రకాల భౌగోళిక స్వరూపాలు, లక్షణాలతో కూడి ఉంటుంది. ప్రపంచంలోని అన్ని రకాల భూస్వరూపాలు, వాతావరణ పరిస్థితులు కలగలిసి ఒకేచోట ఉన్న ద్వీపకల్పం భారతదేశం. ఈ ఉపఖండానికి ఉత్తరాన హిమాలయాలు పెట్టని కోటగా, జీవ నదీవ్యవస్థలకు ఆధారంగా నిలవగా, ఆ పర్వతాలకు దిగువన ఏర్పడిన సారవంతమైన మైదానాలు దేశ జనాభాలో అధిక శాతానికి జీవనాధారాన్ని అందిస్తున్నాయి.

భారతదేశానికి ఉత్తరాన ఉండటంతో ఉత్తర పర్వతాలు అని, చాలా ఎత్తుగా మంచు కప్పుతో ఉండటంతో ఉన్నత హిమాలయాలని అంటారు. ఇవి నవీన ముడుత పర్వతాలు. పడమర నుంచి తూర్పునకు సుమారు 2400 కి.మీ.లు విస్తరించి ఉన్నాయి. పలక విరూపక సిద్ధాంతం ప్రకారం భారత భూభాగ పలక, యూరోపియన్ పలకలోకి చొచ్చుకుపోవడంతో మధ్యలోని భాగం ముడతలుగా ఏర్పడి పర్వతాలుగా మారాయి. భౌగోళిక లక్షణాల ఆధారంగా ఇవి ఉన్నత, మధ్య, బాహ్య హిమాలయాలని మూడు రకాలుగా ఉన్నాయి. హిమాలయాలను ఎత్తు, రేఖాంశాల పరంగానే కాకుండా ప్రాంతీయంగా పలు రకాలుగా వ్యవహరిస్తారు.

- సింధూ నది నుంచి సట్లెజ్ నది వరకు ఉన్న హిమాలయాలను పంజాబ్ హిమాలయాలు అంటారు. ఇందులో జమ్మూ-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ కూడా ఉంటాయి. ఇక్కడి కశ్మీర్ లోయలోని హిమానీనదాల నిక్షేపాలతో ఏర్పడిన కరేవా నేలలు కుంకుమపువ్వు సాగుకు అనుకూలం. ఇక్కడే ద్రాస్ సెక్టార్ ఉంది.
- కుమయూన్ హిమాలయాలు సట్లెజ్-ఖాళీ నదుల మధ్య ప్రాంతంలో ఉన్నాయి. నందాదేవి, కామెట్, బద్రీనాథ్, కేదార్‌నాథ్‌లు ఈ ప్రాంతంలోని ముఖ్య శిఖరాలు. గంగా, యమునా నదుల జన్మస్థానం ఇక్కడే ఉంది. నైనిటాల్, బీమ్‌టాల్ వంటివి ముఖ్యమైన సరస్సులు.

- నేపాల్ హిమాలయాలు ఖాళీ-తీస్తా నదుల మధ్యగా విస్తరించిన ప్రాంతం. హిమాలయాల్లో ఎత్తయిన ఎవరెస్ట్, కాంచనజంగా, మకాలు, అన్నపూర్ణ లాంటి శిఖరాలు ఇక్కడ ఉన్నాయి. ఖాట్మండ్ లోయ హిమాద్రి, మహాభారత్ పర్వత పంక్తుల మధ్యన ఉంది.
- అస్సాం హిమాలయాలు తీస్తా - బ్రహ్మపుత్ర నదుల మధ్యప్రాంతంలో ఉంది. సిక్కిం, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ ఇందులో భాగంగా ఉన్నాయి. నామ్చాబార్వా, కులకంగ్రి, చోమోలహ్రి ఇక్కడి ముఖ్యమైన శిఖరాలు. ఈ ప్రాంతంలో పోడు వ్యవసాయం ఉంది.
- ఉత్తర మైదానాలు హిమాలయ పర్వతాలకు దక్షిణంగా, ద్వీపకల్ప పీఠభూమికి ఉత్తరంగా విశాలంగా ఉన్నాయి. సింధూ, గంగా, బ్రహ్మపుత్ర నదులు వాటి ఉపనదుల ద్వారా నిక్షేపించిన ఒండ్రు మట్టి ప్రాంతం. దీనినే గంగా-సింధూ మైదానంగా కూడా పిలుస్తుంటారు. సముద్ర మట్టానికి 200 మీ.ఎత్తులో ఉన్న సమతల మైదానం. ఇక్కడి భూ ఉపరితల స్వరూపం, లక్షణాలు, నేల నిర్మాణం ఆధారంగా ఈ మైదానాన్ని పలు రకాలుగా విభజించారు.

మైదానాలు వ్యవసాయానికి అనుకూలం

భంగర్ అనేవి పురాతన ఒండ్రు మట్టితో నిండి, వరద మైదానాల కంటే కొంచెం ఎత్తులో టెర్రస్‌లను ఏర్పరుస్తుంది. ఇవి సారవంతమైన నేలలు. ముదురు రంగులో ఉంటాయి. ఉత్తర భారత మైదానాల్లో అధిక విస్తీర్ణంలో ఉన్నాయి. ఖాదర్ కొత్త ఒండ్రు మట్టితో ఏర్పడిన నదీ మైదానాలు. ఏటా నది వరదలో కొట్టుకొచ్చే ఒండ్రుమట్టితో ఏర్పడతాయి. నదీతీరాలకు దగ్గరగా ఉంటాయి. ఇవి వ్యవసాయానికి బాగా అనుకూలం. బాబర్ శివాలిక్ కొండల పర్వత పాదాల వద్ద తూర్పు-పడమరగా ఏర్పడిన ప్రాంతం. నదీ ప్రవాహంలో కొట్టుకొచ్చిన గులకరాళ్లు ఈ ప్రాంతంలో నిక్షేపితమవుతాయి. సుమారు 8 నుంచి 16 కి.మీ. వెడల్పుతో ఉంటాయి. హిమాలయాల నుంచి వచ్చే నదులు ఇక్కడ గులకరాళ్ల మధ్య అదశ్యమవుతాయి. టెరాయ్ అనేది చిత్తడి ప్రాంతం. బాబర్ ప్రాంతంలో అదృశ్యమైన నదులు ఇక్కడ పునఃప్రత్యక్షమవుతాయి. ఇది 15-30 కి.మీ.ల వెడల్పుతో ఉంటుంది. వరి, గోధుమ, చెరకు బాగా పండుతాయి. ఈ ప్రాంతం తూర్పు భాగంలో వర్షపాతం ఎక్కువ.

- రాజస్థాన్ మైదానాలు దేశానికి పశ్చిమంలో ఉన్న ప్రాంతం. థార్ ఎడారి కూడా ఇక్కడే ఉంది. సాంబార్, దిద్వానా, దేగానా, కుచమన్, పచ్‌పద్రా లాంటి ఉప్పునీటి సరస్సులున్నాయి. ఈ ప్రాంతం తూర్పుభాగాన రాళ్లతో ఉండి, పశ్చిమ భాగాన 'దరియన్' అనే పేరున్న ఇసుక దిబ్బలు ఉంటాయి. ఆరావళీ పర్వతాల నుంచి ప్రవహించే చిన్ననీటి ప్రవాహాల ద్వారా కొంత వ్యవసాయం జరుగుతుంది. వీటిని 'రోహి' అంటారు.
- పంజాబ్, హరియాణా మైదానాలు ఉత్తర మైదానాల్లో పశ్చిమ దిక్కుగా ఉంటాయి. సింధూ, దాని ఉపనదుల ఒండ్రుమట్టి మేట వేయగా ఇక్కడ మైదానాలు ఏర్పడి వ్యవసాయానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది. రెండు నదుల మధ్య సారవంతమైన నేలలను 'దోబ్స్' అని, పల్లపు ప్రాంతంలో ఉండే వరద మైదానాలను 'బెట్స్' అని అంటారు.

- గంగా మైదానం గంగా నదితోపాటు దాని ఉపనదులైన గోమతి, ఘాఘ్ర, గండక్, కోసి, యమున మొదలైన హిమాలయ నదుల నుంచి వచ్చిన మట్టి మేటతో అల్లూవియల్ నేలలు ఏర్పడ్డాయి.
- బ్రహ్మపుత్రా మైదానాలు ఉత్తర మైదాన తూర్పు అంచున ఉంది. ఎక్కువగా అస్సాంలో ఉంటుంది. ఇందులోనే బ్రహ్మపుత్ర, దాని ఉప నదుల ద్వారా కొట్టుకొచ్చిన ఇసుక, మట్టి నిక్షేపంతో రివరైన్ ద్వీపాలు, ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. ఇక్కడి 'మజులీ' ప్రపంచంలోనే అతిపెద్ద నదీ ఆధారిత ద్వీపం. ఇది బ్రహ్మపుత్ర నది మధ్యలో 352 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంటుంది.
- ఉన్నత హిమాలయాల ఉత్తర భాగాన ఉంటాయి. కారకోరం, లద్దాఖ్, జస్కర్, కైలాష్ పర్వత శ్రేణులు, మానస సరోవరం ఈ ప్రాంతంలో భాగమే. ఈ శ్రేణిలోని ఉన్నత శిఖరాలు కె2 (8,611 మీ.), బ్రాడ్‌పీక్ (8,047 మీ.), గషెర్‌బ్రమ్ (8,035 మీ.), రాకపోషి (7,788 మీ.), హర్మోష్ (7,397 మీ.) 1951 సెన్సస్ కమిషన్ అంచనా ప్రకారం దేశ మొత్తం భూభాగంలో 10.7 శాతం పర్వత ప్రాంతం, 18.6 శాతం కొండ ప్రాంతం, 27.7 శాతం పీఠభూమి, 43.3 శాతం మైదాన ప్రాంతంలో ఉంది.

ప్రశ్నలు

1. మనదేశ విశిష్టత, ప్రఖ్యాతిని వివరించేది?
(ఎ) జాతీయగీతం (బి) జాతీయగేయం
(సి) జాతీయ చిహ్నం (డి) పైవన్నీ

2. ఆంధ్రప్రదేశ్ గురించి సరికానిది
(ఎ) విస్తీర్ణంలో 7వది (బి) జనాభాలో 10వది
(సి) అడవుల పరంగా 9వది (డి) పైవన్నీ సరైనవే

3. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఓ భారీ ప్రాజెక్టు పేరుతో ఏర్పడబోయే జిల్లా పేరేమిటి?
(ఎ) పులిచింతల (బి) ప్రకాశం బ్యారేజ్
(సి) పోలవరం (డి) గోదావరి-కృష్ణానది ప్రాజెక్ట్

4. రాష్ట్ర జలవనరులశాఖామంత్రి పేరేమిటి?
(ఎ) నిమ్మల రామానాయుడు 2) అచ్చెన్నాయుడు
3) దేవినేని ఉమామహేశ్వరరావు 4) అంబటి రాంబాబు

5. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్ పేరు ?
(ఎ) రవి చౌదరి (బి) రమేష్ గుప్తా
(సి) రమేష్‌నాయుడు (డి) రవి మందలపు

6. రాతిపొరతో కూడిన ఎర్ర నేలలున్న ప్రాంతం
(ఎ) ఎడారి (బి) పీఠభూమి (సి) కొండ (ప్రాంతం)(డి) పైవన్నీ

7. గిరిజనులు జీవనాధారానికి పండించే పంటలు
(ఎ) చిక్కుడు, సొరకాయ (బి) మిర్చి
(సి) మొక్కజొన్న (డి) పైవన్నీ

8. అగ్ని పర్వత మూలానికి చెందిన దక్కన్ పీఠభూమి భారత్‌లోనే ఈ రకమైన పీఠభూమి
(ఎ). ప్రాచీన (బి)మధ్యయుగ
(సి) నవీన (డి) 1 మరియు 2

9. అనేక సుందర దృశ్యాలతో ప్రధాన పర్యాటక ఆకర్షణలుగా నిలిచి ఉన్నవి ఏమిటి?
(ఎ) పర్వతాలు (బి) పీఠభూములు
(సి) మైదానాలు (డి) పైవన్నీ

10. తూర్పు కనుమలు సగటు ఎత్తు ఎంత?
(ఎ) 1000 మీ (బి) 900మీ
(సి) 1400 మీ (డి) 1800 మీ

11. చెంచులు నివశించే జిల్లా
(ఎ) కర్నూలు (బి) గుంటూరు
(సి) ప్రకాశం (డి) పైవన్నీ

12. రాయలసీమలోని నేలలు
(ఎ) నల్లరేగడి (2) లేటరైట్
(3) ఎర్రనేలలు, ఇసుకనేలలు (డి) పైవన్నీ

13. అనంతపురంలో నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతం
(ఎ) రాయదుర్గం (బి) కళ్యాణదుర్గం
(సి) మడకశిర (డి) 1, 2

14. గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిలాలు ఏ పంటలకు ప్రసిద్ధి
(ఎ) వరి, చెరకు 2) చెరకు, మిర్చి
3) పసుపు 4) పైవన్నీ

15. క్రింది వానిలో సరికానిది
(ఎ) డెల్టా మైదానాలు ఆహారధాన్యాలకు గిడ్డంగులు
(బి) భారతదేశపు ధాన్యాగారంగా మైదానాలను పిలుస్తారు
(సి) చౌడు నేలల్లో ఎక్కువగా సున్నం, క్షారలవణాలుంటాయి.
(డి) పైవన్నీ సరైనవే

16. క్రింది వాటిలో సరియైనది.
(ఎ) నదుల అధ్యయనం - పోటమాలజీ
(బి) ప్రపంచ నీటి దినోత్సవం మార్చి-22
(సి) ప్రపంచ నదుల దినోత్సవం సెప్టెంబరు-28
(డి) పైవన్నీ సరైనవే

17. క్రింది వాటిలో సరియైనది
(ఎ) 77 శాతం నదులు బంగాళాఖాతం, 23 శాతం నదులు అరేబియా
(బి) నీటి పరిమాణంలో 90 శాతం బంగాళాఖాతం, 10 శాతం అరేబియాలో కలుస్తుంది.
(సి) అంతర్భూభాగ నదులకు ఉదా. ఘగ్గర్; లూని, బాని
(డి) పైవన్నీ సరైనవే

18. కాశ్మీర్‌లో సింధూనదిలో కలిసే ఉపనదులు
(ఎ) జస్కర్ (బి) నుబ్రా, ష్యోక్
(సి) హుంజా (డి) పైవన్నీ

19. అటాక్ వద్ద పర్వతాలనుండి బహిర్గతమయిన నది
(ఎ) గంగ (బి) సింధు
(సి) బ్రహ్మపుత్ర (డి) కావేరి

20. మూడింట ఒక వంతు భారతలో ప్రవహించే నది
(ఎ) నైలు (బి)బ్రహ్మపుత్ర
(సి) గంగ (డి) సింధు

21. క్రింది వాటిలో సరికానిది
(ఎ) భగీరథిగా పిలవబడే నది గంగ
(బి) గంగానది కుడి ఒడ్డున అలహాబాద్ వద్ద యమున నది గంగానదిలో కలుస్తుంది.
(సి) గంగానది చివరి ప్రదేశం ఫరక్కా
(డి) అన్నీ సరైనవే

22. సుందర్బన్ డెల్టా గూర్చి సరికానిది
(ఎ) ఇక్కడ సుందరి వృక్షం బాగా పెరుగుతుంది.
(బి) ప్రపంచంలోనే అతి పెద్ద డెల్టా.
(సి) రాయల్ బెంగాల్ టైగర్ యొక్క నివాసం
(డి) అన్నీ సరైనవే

23. క్రింది వాటిలో సరియైనది
(ఎ) సింధు-గంగా నదుల మధ్య జల విభాజక క్షేత్రం - అంబాలా
2) అంబాలా నుండి సుందర్బన్ మైదానం 1800 3.2.
3) గంగా మైదానంలో 6 కి.మీ. కేవలం ఒక మీటరు వాలుకలదు.
4) అన్నీ సరైనవే

24. బ్రహ్మ పుత్ర నది గురించి సరికానిది?
(ఎ) నామ్ బర్వా వద్ద 'యు' ఆకారంలో మలుపు తీసుకుంటుంది.
(బి) అరుణాచల్ ప్రదేశ్‌లో దిహంగ్ అని అస్సాంలో కలిసే నదులు దిబాంగ్, లోహిత్
(సి) అస్సాం-బంగ్లాదేశ్‌లో దీని వలన వినాశనం ఎక్కువగా జరుగుతుంది.
4) పైవన్నీ సరైనవే.

25. ద్వీపకల్ప భూభాగంలో ప్రధాన జల విభాజక క్షేత్రం
(ఎ) తూర్పు కనుమలు (బి) పశ్చిమ కనుమలు
(సి) వింధ్య పర్వతాలు (డి) పైవన్నీ

26. ఉప్పు కయ్యాలను ఏర్పాటు చేసేవి
(ఎ) నర్మద (బి) తపతి
(సి) గోదావరి (డి) 1 మరియు 2

27. ధూధర్ జలపాతం ఏర్పాటు చేసిన నది
(ఎ) గంగ (బి) సింధు
(సి) నర్మద (డి) తపతి

28. నర్మదా నది పరిరక్షణ మిషన్ నమామి దేవి నర్మదే అనే పథకం ప్రారంభించిన రాష్ట్రం
(ఎ) మహారాష్ట్ర (బి) గుజరాత్
(సి) రాజస్థాన్ (డి) మధ్యప్రదేశ్

29. అరేబియా సముద్రంలో కలిసే నదులు
(ఎ) నర్మద, తపతి, సబర్మతి (బి) మహి, తపతి
(సి) భరతపుజ, పెరియార్ (డి) పైవన్నీ

30. గోదావరి నది యొక్క పెద్ద ఉపనదులు
(ఎ) మంజీర (బి) పెన్‌గంగ
(సి) వెన్‌గంగ (డి) పై మూడు

జవాబులు :

(1) ఎ (2) డి (3) సి (4) ఎ (5) డి (6) సి (7) డి (8) ఎ (9) బి (10) బి (11) డి (12) డి (13) డి (14) డి (15) డి (16) డి (17) డి (18) బి (19) బి (20)డి (21) డి (22) డి (23) డి (24) డి (25) బి (26) డి (27) సి (28) డి (29) డి (30) డి

"మానవుడు శాస్త్ర జ్ఞానాన్ని తప్ప
మరే జ్ఞానాన్ని కోరనవసరం లేని
పరిస్థితి ఏర్పడుతుంది. దానికి
విరుద్ధంగా ఉన్న అన్ని అపోహలను,
నమ్మకాలను పూర్వపక్షం చేయడం పురోగామి
సాహిత్య లక్షణం."
– కొడవటిగంటి కుటుంబరావు

ఆమె మాట

మొదట ఆమె
వసంతంలా వెలుగుతూ
ఏదో అంది
అతడి చెవి వద్దకు చేరకుండానే అదృశ్యమైంది

ఆమె మరొకసారి పెదవి విప్పింది
అతడి ముఖం
విసుగ్గా ముడుచుకుంది

గంటలు రోజులుగా
రోజులు నెలలుగా
నెలలు సంవత్సరాలుగా
తర్జుమా అయ్యాయి

చీకటి చీర చుట్టుకున్న ఆమె
ఒకనాడు
మనసులో మోయలేని
బరువైన మూటను
అతడి ముందు విప్పింది
అతడు తేలిక చూపును విసిరి
బయటకు నడిచాడు

కాలం వేగంగా
ముందుకు కదిలింది
అతడిని మాత్రం
కాస్తైనా కదిలించలేక
చేతులెత్తేసింది

మొత్తంగా
పగిలి పిగిలిన ఆమె
సంధ్య వాకిలి వద్ద నిలబడి
ఏదో అనబోయింది
ఈసారి కొడుకు
తండ్రిని అనుసరించాడు!

– పద్మావతి రాంభక్త, 9966307777

నేల తడవని వాన

నోసట్న చిటికెడు మట్టిని బండారుగా పూసుకొని
విత్తుల్ని కళ్ళకద్దుకొని
'లాభం' అంటూ విత్తుతారు
మొలకలు చూసి ఆనందిస్తారు
ఎండి ఉప్పుదేలిన చెమటను పట్టించుకోరు
రైతంటే పంట

చెరువునిండితే మొరవవుతారు
మొరవ వరదయితే
పంటపొలమే చెరువైతే
దిష్టిబొమ్మకూడా దుఃఖిస్తుంది
పంటెండిపోతే
పాల ధర పడిపోతే
కొడవలితో వేళ్ళు తెగ్గోసుకున్న బాధ
గిట్టుబాటొక చెదిరిన స్వప్నమైతే
దళారులు లాభాన్ని లెక్కపెట్టుకుంటూ
వీరేమో కల్లంలో చివరి గింజను ఏరుకుంటూ
నేల తడవని వానలాంటి సాయంతో
రైతు రాజు కాడు
సాంకేతికత వెలుగులో విత్తనం మొలకెత్తదు
కష్టమొస్తే చెట్టునమ్ముకుంటారు
ఓ పశువునమ్ముకుంటారు
రైతాంగం దండగ అయిందనే
కొన్నేళ్ళుగా వీరి ఫిర్యాదు

రైతులు పదేపదే వాపోతుంటే
కొందరు ముఖం చిట్లించొచ్చు
కాని గిన్నెకు గింజకు మధ్య బతుకు కలవరం
రైతు భుజం మీద బస్తా
ముల్లు మీద పాదమున్నా నడక సాగుతుంది
నష్టం, పదేపదే వచ్చివాలే జోరీగలా విసిగిస్తున్నా
టవల్తో విసురుకుంటూ
నిట్టూర్పుతోనే దీపం మలుపుతారు
అయినా వేడి అన్నంలో పూజ వాసన తెలిసినవారు
పొద్దుపొడవంగానే దుక్కిదున్నుతుంటారు.
సూర్యుడు వీరి భుజాల మీదుగా అస్తమిస్తుంటాడు.

– శాంతయోగి యోగానంద, 96522 71520

పురిటి మంచం

ఈ మధ్య నడిరోడ్ల మీద
ఏ ద్విచక్ర వాహన
విర్రవీగుడుతనాన్ని చూసినా
మూడు చక్రాల బండిపాలవ్వడానికి
ఉవ్విళ్ళూరుతున్నట్టనిపిస్తోంది

సరిహద్దుల్లో సైనిక రక్షణల్లే
ఆపదల్లో ప్రాణాల్ని కాపాడే హెల్మెట్‌ని
చిన్నచూపు చూసినవాళ్ళంతా
పెద్దల ఖాతాల్లో జమైపోవడాన్ని
కళ్ళారా చూస్తున్నా
అప్పటికప్పటి క్షణకాల
వైరాగ్యాలే తప్ప ఎల్లకాల మేల్కొల్పులు
ఎండ మావులుగానే మిగులుతున్నాయి!

గడపదాటి బయటకెళ్లి
తిరిగి లోగడప దాటే
అదృష్టాన్ని పొందని వాళ్ళు
రోజు రోజుకి అధికమవుతున్న
ఈ రోజుల్లో
ఎదురులు చుట్టాలు,
ప్రార్థనలు, పూజలు
ప్రమాద నివారణ మార్గాలు కావని
వాళ్ళు దగ్గర పెట్టుకుంటే
ఇళ్ల క్షేమంగా చేరతామనే
సర్వమత హిత జాగ్రత్త జపాన్ని
తపిస్తూ ఆచరిస్తుంటే
ఈ రక్తసిక్త రోడ్లన్నీ
సుఖ ప్రసవం పొంది
తల్లీ బిడ్డా క్షేమకరంగా ఉన్న
పురిటిమంచాల్లా ఉంటాయి
జనవనాలతో మరింత పచ్చగా వికసిస్తాయి!

– మోకా రత్నరాజు, 99890 14767

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

విశ్వతత్వ వీక్షణం - సిక్కోలు పుస్తక మహోత్సవం

అనుభవం

సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు ఆహ్వానం మేరకు ఒకరోజు శ్రీకాకుళంలోని అన్ని సాహిత్య సంస్థలు, ఉపాధ్యాయ సంస్థలు, రంగస్థలం నాటక సమాఖ్య, జనవిజ్ఞాన వేదిక వంటి అనేక సంస్థలు ఒక చోటికి చేరి సమావేశమయ్యాం. ఆ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పుస్తక ప్రదర్శనను దిగ్విజయంగా నడిపిస్తున్న లక్ష్మయ్య కూడా విచ్చేశారు. శ్రీకాకుళంలో మొట్టమొదటిసారిగా 100 ప్రచురణ సంస్థల పుస్తకాలని ప్రదర్శనకు ఉంచడానికి, పది రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగడానికి ఆ సమావేశంలో ప్రతిపాదన జరిగింది. ఆరోజు మొదలు పుస్తక మహోత్సవం ఆరంభమై, పూర్తి కావటం వరకూ (నవంబర్ 11 నుంచి 20 వరకు) ప్రణాళికాబద్ధమైన దృష్టితో దిగ్విజయంగా పూర్తి చేయడంలో కృతకృత్యులయ్యాం. వైజ్ఞానిక కమిటీ, విద్యా కమిటీ, సాహిత్య కమిటీ, ఆర్థిక వనరుల సేకరణ కమిటీ, సాంస్కృతిక కమిటీ, పాత్రికేయ కమిటీ, పారిశుద్ధ్య కమిటీ మొదలైన కమిటీలను ఏర్పాటు చేసి వారందరినీ కలుపుకుంటూ ముందుకు తీసుకెళ్లడానికి సమన్వయ కమిటీ ఒకటి ఏర్పడింది. వైద్యం, సాహిత్యం తప్ప ఇతర ప్రస్తావనలకు తావులేని సౌమ్యులు డాక్టర్ కనుగుల సుధీర్‌ని ఈ సిక్కోలు పుస్తక మహోత్సవానికి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా అందరూ అంగీకరించారు. ప్రముఖ కథా నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు, ఆచార్య విష్ణుమూర్తి, కంచరాన భుజంగరావు, బాడన శ్యామలరావు, సుధాకర్, నాగమణి, పి.ఎస్.నాగరాజు మొదలైన వారితో సమన్వయ కమిటీ ఏర్పాటైంది. కేతవరపు శ్రీనివాసు సమన్వయకర్తగా మొత్తం కార్యక్రమాన్ని తన భుజానికి ఎత్తుకున్నారు. పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి తొలి అడుగుగా దానికి సంబంధించిన చక్కని గేయాలు చాలామంది రాశారు. వెనుకముందుల నడకలో మొదటగా రాసిన గేయం నాదే కావటంతో దాన్ని బాణీ కట్టి, అందమైన దృశ్యమాలికలను జోడించి ప్రచారానికి పూనుకున్నారు. ఇంకా కరపత్రాలు, గోడ పత్రికలు, సాంకేతిక పరికరాల ద్వారా గణనీయమైన స్థాయిలో ప్రచారం చేశాం. నేను, కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు, బాడాన శ్యామలరావు సిక్కోలు పుస్తక మహోత్సవంలో ఏర్పాటు చేయబడే పుస్తక ప్రదర్శనశాల నమూనాని పరిశీలించడానికి అంతకుముందే పుస్తక మహోత్సవం ప్రారంభించిన అనకాపల్లి వెళ్లాం. శ్రీకాకుళంలో ఎటువంటి మార్పులతో ఏర్పాటు చేయాలో ఒక ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చాం. పుస్తక ప్రదర్శనశాల వైశాల్యం, వేదికల ఏర్పాటుపై స్పష్టమైన అభిప్రాయానికి వచ్చాం. ఒకవైపు జన విజ్ఞాన వేదిక వారి కార్యక్రమాలు, మరొకవైపు వేదికపై ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు సాహిత్య కార్యక్రమాలను ఏర్పాటు చేసి, వినూత్న అంశాలతో సాహిత్య అభిమానులకి చక్కని మేధో మధనాన్ని అందించగలిగాం.

కళింగాంధ్ర గేయం, వచన సాహిత్యం, కవిత్వం, నాటకం, యాస–భాషా, చరిత్ర, దళిత మహిళా ఆదివాసీ ఆవరణాలు ఏ విధంగా పరిఢవిల్లాయో ప్రముఖుల ద్వారా ఈతరం వాళ్లకి తెలియచెప్పే ప్రయత్నంలో కంచరాన భుజంగరావు అత్యధిక సాహితీవేత్తలని వేదికపై నిలబెట్టే విధంగా పదిరోజుల కార్యక్రమ నిర్వహణకి ప్రాణం పోసారు. లండ సాంబమూర్తి, పాయల మురళి, బాల సుధాకర్ మౌళి, కంచరాన భుజంగరావు, ఎల్.ఎన్.కొల్లి, వినోద్ కుత్తుం వంటి ఎందరో యువకవుల పుస్తక పరిచయ సభలు, పుస్తక ఆవిష్కరణలు జరిగాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దాదాపు 200 మంది కవులు ఈ పుస్తక మహోత్సవంలో కవితా పఠనం చేయడం సాహిత్య వేదికకి అదనపు అందాన్ని చేకూర్చింది, ఒక అద్వితీయమైన అనుభూతిని మిగిల్చింది.

ప్రతిరోజు రాత్రి ఏడున్నర నుండి 9:30 వరకు సాంస్కృతిక కార్యక్రమాల్లో వైవిధ్యం ఉండేలా చక్కని ప్రణాళికతో సంప్రదాయ, జానపద నృత్యాలు, నాటకం, ఏకపాత్రాభినయం, సంప్రదాయ, సినీ పాటలు, జానపద గేయాలు... ఇలా అన్ని వర్గాలకు సమపాళ్ళలో ప్రాతినిధ్యం కల్పిస్తూ సాంస్కృతిక కమిటీ సమన్వయకర్త సుధాకర్ ఆకర్షణీయమైన సందడిని కలిగిస్తూ, ప్రేక్షకులను ఉర్రూతలూగించే కార్యక్రమాల కూర్పు చేశారు. నాలుగేళ్ళ పిల్లల నుండి 70 వసంతాలు పూర్తి చేసుకున్న వారి వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయడంలో విజయవంతులమయ్యాం. జన విజ్ఞాన వేదిక నాయకులు గొంటి గిరిధర్ కార్యక్రమాల నిర్వహణలో ముఖ్య పాత్ర పోషించారు. సైన్స్ ప్రయోగాలు, గాజు పెంకులపై నడక, మేకులపై కూర్చోవడం, టెలిస్కోప్ ద్వారా శనిగ్రహం వీక్షణం వంటి అంశాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకున్నాయి. బాయన్న మాస్టారు ప్రత్యేకంగా వినూత్నమైన కార్యక్రమాల్ని నిర్వహించి విద్యార్థులను ఆశ్చర్యపరిచారు.

100 ప్రచురణ సంస్థల వైవిధ్యమైన పుస్తకాలు శ్రీకాకుళం జిల్లా వాసుల్ని విశేషంగా హాజరయ్యేలా చేశాయి. చిన్నపిల్లల బొమ్మల పుస్తకాల మొదలుకొని విజ్ఞానాన్ని అందించే శాస్త్ర పుస్తకాల వరకు, కళింగాంధ్ర సాహిత్యం మొదలుకొని ప్రపంచ సాహిత్యం, చరిత్రలను మన కళ్ళ ముందు ఉంచే ఎన్నో గ్రంథాలు ఈ పుస్తక మహోత్సవంలో దర్శనమిచ్చాయి. ఇంత నిర్దిష్టమైన ప్రణాళికతో ఏ జిల్లాలోనూ పుస్తక మహోత్సవ నిర్వహణ జరగలేదని లక్ష్మయ్య చెప్పడమే ఈ పుస్తక మహోత్సవం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలియజేస్తుంది.

ఈ పుస్తక మహోత్సవం ప్రారంభం అవ్వడానికి ముందు ఎలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామా? అనే సందిగ్ధత నుంచి కార్యక్రమం పూర్తయిన తర్వాత శ్రీకాకుళం జిల్లా ప్రజలు మళ్లీ ఎప్పుడు ఈ పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేస్తారనే అడిగే స్థాయికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించగలగడం శ్రీకాకుళం సాహిత్య సంస్థల, ఉపాధ్యాయ సంఘాల, ఇతర సంస్థల నిబద్ధ సహాయ సహకారాలకి నిలువుటద్దం. అన్ని తరగతులు, అన్ని భావాలకు చెందిన వారు, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పుస్తక మహోత్సవాన్ని తమ ఇంటి శుభకార్యంగా భావించి ఉరకలెత్తే ఉత్సాహంతో ముందుకు నడవడమే ఈ పుస్తక మహోత్సవం విజయానికి ప్రధానమైన కారణం. ప్రముఖ పత్రికలన్నీ పది రోజుల కార్యక్రమాల్ని విశేషంగా ప్రచారం చేయడం ఈ విజయానికి మరొక బలమైన కారణం.

చివరిరోజు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు పూర్తయిన తరువాత డప్పు శ్రీను డప్పు మోతలతో ఉర్రూతలూగించే ముగింపు లభించింది. పుస్తక మహోత్సవం దిగ్విజయమైన ఆనందాన్ని అట్టాడ అప్పలనాయుడు, కేతవరపు శ్రీనివాసు, పూజారి దివాకర్, నెట్టిమి రమణ మొదలైన నిర్వాహక వర్గం అంతా డప్పుమోతలకు అనుగుణంగా చిందేస్తూ ప్రకటించడం మర్చిపోలేని మధురానుభూతి. కొత్త స్నేహాల నిర్మాణానికి, పాత స్నేహాల దఢత్వానికి, పేరొందిన కవులు, రచయితల అనుభవాల సారాన్ని ప్రోది చేయడానికి ఈ సంగమం కృషి చేసింది. విజ్ఞాన, సాహిత్య, సాంస్కృతిక వైవిధ్యాలని ఒకే వేదికపైకి తెచ్చిన విశ్వతత్వ వీక్షణం ఈ సిక్కోలు పుస్తక మహోత్సవం.

– డా. కె.ఉదయ్ కిరణ్
85007 07850

భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ - 2026

సమకాలీన సామాజిక సమస్యలు, మానవీయ విలువలు, వైవిధ్యమైన అంశాలతో కూడిన కథానికలకు ఆహ్వానం. బహుమతుల వివరాలు : ప్రథమ బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 8 వేలు, తృతీయ బహుమతి రూ.6 వేలు. ఐదు కథలకు ప్రోత్సాహక బహుమతులు రూ.2 వేలు చొప్పున అందించటం జరుగుతుంది. కథానిక డిటిపిలో ఎ4 సైజ్‌లో నాలుగు పేజీలకు మించరాదు. కథానికలు సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించేవిగా ఉండాలి. హాస్యాన్ని మేళవించగలిగితే మంచిది. కథానిక తమ స్వీయ రచనేనని, ఎక్కడా ప్రచురితం కాలేదని, పరిశీలనలో కూడా లేదని హామీ పత్రం జత చేయాలి. కథానిక ప్రతులలో రచయిత పేరు ఉండకూడదు. ఒక్కరు ఒక్క కథానికను మాత్రమే పంపాలి. కథానికలు చేరవలసిన చివరి తేది : 01.01.2026. ఈమెయిల్ ఐడి : bcmkantha@gmail.com, వాట్సాప్ : 99590 20513. చిరునామా : సమన్వయకర్త, 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ – 2026, ఆనంద నిలయం, ఇం.నెం.1–5–1020/4, బి.ఆర్.రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ –500010. ఫోన్ : 99636 16999.

– ఎంఎల్ కాంతారావు, అధ్యక్షులు
'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ

పాత్రోచితంగా.. జనరంజకంగా...

నాటకంలో ఒక సన్నివేశం

'నటన అంటే హృదయాన్ని అవయవాలతో ప్రదర్శించటం' అన్నారు ఒకానొక సందర్భంలో (17-1-1964) బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి నటనకు మంత్రముగ్ధుడైన నాటకరంగ ప్రముఖుడొకరు. ఒక పాత్రా, నటుడూ పోటీపడటం అనేది ఒక రంగస్థలం మీదనే మనం చూడగలం. ఆయా పాత్ర పోషణలో నటుడు ఉత్కృష్టస్థాయిలో నటనను ప్రదర్శించి ప్రేక్షకుల్ని మైమరిపించటం మనం తరచూ చూస్తుంటాం. ఐతే ఒక పాత్రే, పాత్రధారిని ఆవహించి ప్రేక్షకుల ముందు సజీవంగా నిలబడటం అరుదైన సంఘటన. అవనిగడ్డలో నవంబర్ 19న ప్రదర్శించబడిన 'మహాపురుషుడు మండలి' నాటక ప్రదర్శన ఒక ప్రజానాయకుడి ఔన్నత్యాన్ని కళ్లకు కట్టించి ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడిగా మండలి వెంకట కృష్ణారావు చేసిన ప్రజాసేవ ఈ కాలంలో నమ్మలేనంత నిజంగా దిగ్భ్రమ కలిగిస్తుంది.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని 16 ఏళ్ల వయసులోనే అందిపుచ్చుకుని అవనిగడ్డ లాంటి మారుమూల ప్రాంతంలో పాఠశాలపై మువ్వన్నెల పతాకాన్ని ఎగరవేసిన ధీశాలిగా మండలిని చూపిస్తూ నాటకం ప్రారంభమవుతుంది. డిజిటల్ సాంకేతిక సహకారంతో మండలి జీవితపు ఔన్నత్యాన్ని రంగస్థలం మీద, గాంధేయవాదిగా, నిరాడంబరునిగా, సమాజ సేవాతత్పరునిగా, నిస్వార్థ ప్రజాసేవకునిగా, మానవతామూర్తిగా ప్రేక్షకుల మనస్సుల్లో ముద్రవేయగలిగింది నాటక ప్రదర్శన.గాంధీజీ తాత్వికతను ఒంటబట్టించుకొన్న మండలి 1952 నుంచి 1956 వరకు జిల్లా కాంగ్రెసు కార్యదర్శిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ముప్పయ్యేళ్ళ పిన్న వయసుకే 1957లో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పార్టీ సంయుక్త కార్యదర్శిగా నియమించబడిన సందర్భంలో... "నాకేదైనా పదవి వుంటే ఆ పదవిని ప్రజాసేవకు అంకితం చేస్తాను. ఏ పదవీ లేకపోతే నన్ను నేను ప్రజలకు అంకితం చేసుకుంటాను" అన్న డైలాగు ఆయన రాజకీయాదర్శానికి అద్దం పట్టింది.

ఏటిమొగ దగ్గరనుంచి హంసలదీవి వరకు కరకట్ట వేయించిన కారణంగా కొన్ని వేల ఎకరాలకు వరద ముప్పు తప్పటం, ఇరిగేషన్ స్కీంల వల్ల 15 వేల ఎకరాల భూమి సాగులోకి తెప్పించటం, దళిత బాలికలకు వసతి కల్పించటానికి భార్య ప్రభావతి తనకు పుట్టింటి వారిచ్చిన 40సెంట్ల భూమిని అప్పగించటం లాంటి ఎన్నో సేవా కార్యక్రమాల గురించి నాటకంలో ప్రస్తావించబడతాయి. 1972లో అవనిగడ్డ నుంచి శాసన సభకు ఎన్నికైన ఆయన ఏవిధంగా ప్రజాభిమానాన్ని చూరగొన్నారో వేదికపై చూపించారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా వున్న పి.వి. నరసింహారావు మంత్రిగా కోరిన శాఖను ఇవ్వటానికి సిద్ధపడినా, బడుగు, బలహీన వర్గాల సేవకు అవకాశముండే సాంఘిక సంక్షేమశాఖను ఎంపిక చేసుకోవటం మండలికి ప్రజాసేవపట్ల వున్న అంకితభావానికి అద్దం పడుతుంది. పేదలకు వేలాది ఇళ్లు కట్టించటం కోసం ప్రణాళికలు వేయడం, విద్యార్థుల వసతి గృహాల నిర్వహణను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనుంచి తప్పించి ప్రభుత్వ నిర్వహణలోకి తేవడం, వ్యవసాయ కూలీలకు ఇళ్ల పట్టాలివ్వడం, కులాంతర, వర్ణాంతర వివాహాలు ప్రోత్సహించడం లాంటి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. 'ప్రజలు నాయకుల పట్ల చూపే అభిమానం వల్ల వాళ్లకు లాభం జరగాలి, నష్టపోకూడదంటూ' ప్రజలు అభిమానంతో తెచ్చే పూలదండలు, బొకేలు, కానుకలను సున్నితంగా తిరస్కరించటం ఆయన నిరాడంబరతను తార్కాణం.

భూపరిమిత చట్టం ప్రకారం మిగులు భూముల్ని పేదలకు పంచటంకోసం ప్రభుత్వపరం చెయ్యమని భూస్వాముల్ని అభ్యర్థించటంతో, తాతలనాటి భూముల్ని వదులుకోబోమని సూటిపోటి మాటలతో ఆయన మనసును నొప్పించటంతో, తమకున్న ఏడెకరాల 15 సెంట్ల భూమిలో ఐదెకరాలు పేద ప్రజలకు పంచి ఇవ్వటం, అప్పటికి తనకున్న ఆస్తుల వివరాలు బహిరంగంగా ప్రకటించటం రంగస్థలంపై ఆదర్శవంతంగా ప్రదర్శితమైంది. "తన దృష్టిలో పదవంటే బాధ్యత మాత్రమే తప్ప, అక్రమ సంపాదనకు, అవినీతికి దారిచూపే దోపిడీ వ్యవస్థకాదంటూ" నిజాయితీకి మారుపేరుగా నిలబడిన నాయకుడు మండలి.

1972 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో శాసనసభకు ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో సమైక్యతా వాదానికి కట్టుబడిన మండలి నిరసనలు, అవమానాలు ఎదురైనా వేర్పాటువాదాన్ని సమర్థించలేదు. క్యాబినెట్ మంత్రిగా వుంటూ, ప్రజల బాధలు, ఇబ్బందులు తెలియాలంటే కారుల్లో కాదు తిరగాల్సిందంటూ బస్సుల్లో ప్రయాణించాడు. ప్రత్యేకాంధ్ర ఉద్యమం చల్లారక జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఏర్పడిన ప్రభుత్వంలో మండలి విద్యా సాంస్కృతిక శాఖామంత్రిగా నియమితులయ్యారు. ఆ సమయంలోనే తెలుగు అధికార భాషగా ప్రకటితమైంది. బాలోత్సవాలు, అఖిల భారత సాంస్కృతికోత్సవాలు నిర్వహించారు. 1975 ఉగాది పర్వదినాన హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు మండలి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టంగుటూరి సూర్యకుమారి శంకరంబాడి వారి 'మా తెలుగుతల్లి మల్లెపూదండ' గీతాన్ని ఆలపించారు. "నేను తెలుగువాణ్ణి అనుకొన్నప్పుడు నా ఒళ్లు పులకరిస్తుంది. నాది తెలుగుగడ్డ అనుకోగానే ఏ దివ్యలోకంలోనో ఉన్న అనుభూతి కలుగుతుంది. తెలుగువారిగా పుట్టడం మన అదృష్టం" అంటూ మండలి చేసిన ప్రారంభోపన్యాసం తెలుగుపట్ల వారికున్న అభిమానాన్ని ఎలుగెత్తి చాటింది.

1977 నవంబరు 19న దివిసీమ తుపాను ఉప్పెన బీభత్సం, ఆస్తి నష్టం, పదివేల మంది ప్రాణాలు కోల్పోవటంతో మండలి వారు పునరావాస పునర్నిర్మాణ కార్యక్రమాలకు నడుం బిగించి దేశ విదేశాల సహాయం కోసం అర్థించి ప్రభుత్వ పాలకుల్ని, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల్ని రప్పించటం, రాజీనామాకు సైతం సిద్ధపడి బాధితులకు అండగా నిలబడటం రంగస్థలంపై కమనీయంగా ప్రదర్శించారు. ఉప్పెన బీభత్సం ప్రధాన ఘట్టంగా విధ్వంస దృశ్యాలు దర్శకుడు సాయి నడిపించిన తీరు ఎంతో హృద్యంగా వుండి ప్రేక్షకుల్ని కంటతడి పెట్టిస్తుంది. డిజిటల్ సాంకేతికతతో ఉప్పెన భయానక దృశ్యాల్ని చూస్తుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. తన వూరుకి, రోడ్డు వేయించకపోతే ముఖమే చూపించనన్న భూషయ్య గొల్లపాలెం వూరుకు వూరే సముద్రం పాలై కనుమరుగైందని తెలిసి, మండలి పసివాడిలా ఏడ్వటం ప్రేక్షకుల్ని కలచివేస్తుంది. దివిసీమ శవాల దిబ్బగా మారిపోవటాన్ని చూసి మండలి దుఃఖపడ్తున్న సందర్భంలో గంగోత్రి సాయి నటన నాటకానికి హైలెట్‌గా నిలిచింది.

1977లో ఆరోగ్యం బాగా క్షీణించి మెడ్విన్‌లో చేరారు. అప్పట్లో కేంద్రమంత్రిగా వున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుని పిలిపించుకున్నారు. తన చివరి కోరికగా పులిగడ్డ వంతెన పూర్తి చేయించమని చేతులు జోడించారు. వాగ్దానం చేయించుకున్నారు. వారి సంకల్పబలమే పులిగడ్డ వంతెన పూర్తికావటానికి కారణమైంది. అవసాన దశలో కొడుకు మండలిబుద్ధ ప్రసాద్‌ని చేరబిలిచి, "ఇన్నేళ్లు రాజకీయరంగంలో వుండి నీ తండ్రి నీకేమీ ఇవ్వలేదని బాధపడకు. సిరిసంపదలు శాశ్వతం కాదు. రాజకీయమంటే వాటిని సంపాదించే వృత్తి కాదు. ఇదిగో... నీ తండ్రి ఇస్తున్న విలువైన సంపదలు, ఒకటి గాంధీ, రెండు తెలుగుభాష. ఇవి మన వంశపారంపర్య ఆస్తులు. వాటిని నువ్వు కాపాడాలి" అంటూ చేతిలో చేయి వేయించుకోవటం ఉద్వేగభరితమైన సన్నివేశం.

ఒకరికి మూడు నాలుగు పాత్రలై, పాత్రకు తగ్గ వైవిధ్యాన్ని నటనలో చూపిస్తూ నాటకాన్ని అద్భుతంగా నడిపించిన అరవింద ఆర్ట్స్ నట బృందాన్ని, దర్శకుడ్ని అభినందించక తప్పదు. రచయిత డి.విజయభాస్కర్ సన్నివేశాల కూర్పు, సంభాషణలు ఆకట్టుకునేలా రూపొందించారు. అయితే, నాటకం ప్రత్యేకత వాస్తవికత, సహజత్వం. తప్పనిసరి పరిస్థితుల్లో డిజిటల్ సాంకేతికత ఉపయోగపెట్టుకోవడం కొంతవరకు సమర్థనీయమే కావచ్చు కాని.. పూర్తిగా నాటకాన్ని ఆధునికత పేరిట అస్వాభావికం చేయటం సముచితం కాదు. ప్రదర్శనలు జరుగుతున్న కొద్దీ మార్పులు చేర్పులతో నాటకం మరింత రసవత్తరంగా తయారవుతుందన్నది జగమెరిగిన సత్యమే! వెంకట కృష్ణారావు గారి జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిమంతంగా వుండాలన్న సదుద్దేశంతో ఆయన శతజయంతి వేడుకగా ఎంతో వ్యయప్రయాసలతో నాటకాన్ని సమర్పించటానికి మండలి బుద్ధప్రసాద్ పూనుకోవటం అభినందనీయం.

– వల్లూరు శివప్రసాద్
92915 30714

డాక్టర్ నాగసూరి రచనలపై 10న సదస్సు

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం– జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్, ఒంగోలు సంయుక్త ఆధ్వర్యంలో 'డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సైన్స్ రచనలపై ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సదస్సు నిర్వహించనున్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య డివిఆర్ మూర్తి, జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొంటాను. అత్యున్నత కళారూపం సైన్స్, ఆధునికతకు చిరునామా సైన్స్, ప్రకృతి – వికృతి, ప్రకృతి – పర్యావరణం, భారతదేశ తొలి వనితా వైద్యులు, జ్యోతిష్మతి, సైన్స్ క్యాలెండర్, సైన్స్ వైతాళికులు, సైన్స్ ధ్రువతారలు తదితర పుస్తకాలపై సమాలోచన ఉంటుంది. పలువురు విశ్లేషకులు ఈ పుస్తకాలపై ప్రసంగిస్తారు

– డాక్టర్ ఎన్.రవికుమార్, జానుడి,
98481 87416

జాతీయ బాల చెలిమి కథల పోటీ ఫలితాలు

చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాల చెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ మార్గదర్శకత్వంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి కథల పోటీని నిర్వహించింది. ఈ పోటీకి రెండు రాష్ట్రాల నుంచి పెద్దలు 214 కథలు, పిల్లలు 714 కథలు, యువతరం 48 కథలు పంపారు. ఎంపికైన కథలను సంకలనాలుగా ప్రచురిస్తాం. కొన్ని కథలు బాల చెలిమి పిల్లల పత్రికలో కూడా ప్రచురించబడతాయి. విజేతలకు సమాన నగదు బహుమతులు త్వరలో అందజేయబడతాయి.

పెద్దల విభాగం : గడువు – ఆకెళ్ల వేంకట సుబ్బలక్ష్మి, అదృశ్య దేవత – ఓట్ర ప్రకాష్ రావు, చందమామపై షికారు – కె.వి. సుమలత, ఆరోగ్యమే మహాయోగం – చెన్నూరి సుదర్శన్, ప్రయాణం నేర్పిన పాఠం – జొన్నలగడ్డ శ్యామల, ప్రార్థించే పెదవుల కన్నా – నంద త్రినాథరావు, స్నేహ మధురిమ – పి.ఎల్.ఎన్.మంగారత్నం, వనదేవత – పుష్పాల కృష్ణమూర్తి, గూడు మార్చిన కాకి – పోరెడ్డి అశోక్, పుష్పవిలాసం – భమిడిపాటి విజయలక్ష్మి, రాజు చేసిన మేలు– బి.వి. పట్నాయక్, చిగురించిన విలువలు– మద్దిరాల శ్రీనివాసులు, వెన్నెల – వి.శాంతి ప్రబోధ, చిన్న విత్తనం – మహావృక్షం – వెంగల నరేష్, ఫలించిన సాయం – సంగనభట్ల చినరామకిష్టయ్య.

యువతరం : చెట్టు ఉపకారం – కట్టోజు నీరజ, బతుకమ్మ – కె.పావని, వ్యవసాయం – గీస శ్రీజ, అమ్మో కోతులు – చిలుకూరి హరినందన, గురుదక్షిణ – పుల్లా మురళీ ఆకాష్.

బడిపిల్లల విభాగం : చేయూత – ఈ.రేణుక, ప్లాస్టిక్ వాడిన రవి – వి. రోహిత్, మూఢ నమ్మకాలు – గంగారపు శృతి, బట్ట సంచి – గుగ్లోత్ పూజ, నిర్లక్ష్యం – జీరు హరిక, హెల్మెట్ – డి. స్నీతిక, అల్లరి కోతి – ధీరెన్ వంగా, పట్టుదల – తనూజ; మట్టి గణపతి – తల్లెల కీర్తి, మతం – పి.ఆశీష్, ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం – భూక్యా వర్షిత, ఊరు చేసిన తప్పు – బొక్కల విశ్వతేజ, మూఢ నమ్మకాల ముప్పు – ఎం.మహాలక్ష్మి; రంగుల కలలు – ఎస్.శ్రీవర్ధన్, పుస్తకం కోసం పోరాటం – సిహెచ్.అభిషేక్, సహకారం – సిహెచ్.బ్రాహ్మణి.

వివరాలకు : 8686664949, 9030626288

– గరిపెల్లి అశోక్
కన్వీనర్, 9849649101

ఆటోమెటిక్‌గా కేసుల లిస్టింగ్

- సుప్రీం కోర్టులో నేటి నుంచి అమలు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టులో కేసుల లిస్టింగ్ విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయనున్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి కేసుల కొత్త లిస్టింగ్ విధానాన్ని సుప్రీం కోర్టు ప్రవేశపెడుతున్నది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కేసులను జాబితా చేయడానికి సవరించిన కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కొత్త విధానం ప్రకారం తాజా కేసులు ఆటోమేటిక్‌గా లిస్టు అయిపోతాయి. బెయిల్ పిటిషన్లకు ప్రాధాన్యత ఇవ్వడం, సీనియర్ న్యాయవాదుల ప్రస్తావనలను పరిమితం చేయడం, కక్షిదారులకు వేగవంతమైన, పారదర్శకమైన, సరైన విచారణను నిర్ధారించడం ఇందులో ప్రధాన అంశాలు. సోమవారం అమలులోకి రానున్న ఈ మార్పులకు సంబంధించిన విధి విధానాలను ఆదివారం నాలుగు సర్క్యులర్ల ద్వారా వెల్లడించారు.

పెంచలయ్య హంతకులను అరెస్టు చేయాలి

- ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సోమరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నెల్లూరులో గంజాయికి వ్యతిరేకంగా పోరాటం చేసిన పెంచలయ్యను బండితో గుద్దించి చిన్న పిల్లల ముందే హత్య చేసిన గంజాయి మాఫియా దుండగులను అరెస్టు చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సోమరాజు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి వ్యాపారాన్ని అడ్డుకున్నాడని నెల్లూరులో పెంచలయ్యను హత్య చేయడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శమని విమర్శించారు. ఈ ఘటనలో ప్రభుత్వం గంజాయి మాఫియాను ప్రోత్సహించినట్లు ఉందన్నారు. అలా కాకపోతే వెంటనే నిందితులను అరెస్టు చేయడంతోపాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

5 నుంచి జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

డిసెంబర్ 5 నుంచి 15 వరకు విశాఖపట్నంలో 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహణకు ఏర్పాట్లు సాగుతున్నాయి. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా దీని బాధ్యతలు చూస్తోంది. ఈ విషయాన్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జాన్ గ్యాలియట్ మీడియాకు తెలిపారు. ఈ క్రమంలోనే నగరంలో ఈ పోటీలను నిర్వహించడానికి ఎంపిక చేసిన ప్రదేశాలను ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గ్యాలియట్, శాప్ అబ్జర్వర్, స్కేటింగ్ కోచ్ పి.థామస్ పరిశీలించారు. విఎంఆర్‌డిఎ పార్కు (ఉడా పార్కు), శివాజీ పార్కు, కైలాసగిరి, బోయపాలెం ప్రాంతాలలో ఈ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. స్పీడ్, రోలర్ హాకీ, రోలర్ ఇన్ లైన్ హాకీ, రోలర్ స్టేట్ బోర్డ్, రోలర్ ఫ్రీ స్టైల్, ఇన్ లైన్ ఫ్రీ స్టైల్ అండ్ స్కూటర్ వంటి పోటీలను నిర్వహిస్తామని చెప్పారు.

చీనీచెట్లు నరికివేత

ప్రజాశక్తి- తాడిమర్రి (శ్రీసత్యసాయి జిల్లా)

ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అలజడి రేగింది. కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవిస్తున్న చిల్లకొండయ్యపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఓ రైతుకు చెందిన చీనీ చెట్ల నరికివేత ఘటన తీవ్ర కలకలం రేపింది. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు కొంక తిరుపాలు సర్వే నంబర్ 24లో తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో ఐదు సంవత్సరాల క్రితం నుంచి సుమారు 300 చీనీ చెట్లను సాగు చేస్తున్నారు. పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా చెట్లను కాపాడుకుంటూ వచ్చారు. పంట చేతికి వస్తున్న సమయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని 59 చీనీ చెట్లను నరికి వేశారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు తిరుపాలు నరికివేతకు గురైన చీనీ చెట్లను చూసి కన్నీటి పర్యవంతమయ్యారు. పంట చేతికి వస్తే చేసిన అప్పులు తీర్చవచ్చని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆయన ఈ ఘటనలో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. చీనీ చెట్ల నరికివేత విషయం తెలుసుకున్న పోలీసులు పొలంలో పర్యటించి బాధిత రైతుతో వివరాలు సేకరించారు. తామంటే గిట్టనివారు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసుల ఎదుట బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి తమకు జరిగిన అన్యాయం గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఘంటసాల బయోపిక్

ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ వార్షికోత్సవ వేడుకల్లో సుమన్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ఘంటసాల బయోపిక్ చిత్రం తీస్తున్నారని, దానిలో తాను కూడా ఒక పాత్ర పోషిస్తున్నట్లు సినీ నటుడు సుమన్ చెప్పారు. అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పేరిట ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ స్థాపించి గత 35 సంవత్సరాలుగా సాంస్కృతిక సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ 35వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం పాల ఫ్యాక్టరీ వద్ద ఉన్న సయ్యద్ అప్పలస్వామి కళాశాల ప్రాంగణంలో తమ్మిన గురుమూర్తి అప్పల నరసమ్మల కళావేదికపై ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు సుమన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సినీ హీరో కృష్ణ అభిమానులు ఆయనపై రూపొందించిన క్యాలెండర్‌ను సుమన్ ఆవిష్కరించారు.

గాంధీ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షులు రాంపిళ్ళ జయప్రకాష్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతో అలరింప చేయడంతోపాటు సమాజాన్ని జాగృతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎస్‌కె.హుస్సేన్, సెక్రటరీ రోహిణి కాంత్ (చిన్ని) తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరుమారి అమ్మన్, శక్తిపీఠం పీఠాధిపతి కరుమారి దాసు, నగర ప్రముఖులు యాబలూరి లోకనాథ శర్మ, ఇరుపిళ్ళ విజయలక్ష్మి, ప్రముఖ వ్యాపారవేత్త జి.బ్రహ్మయ్య, శారదా కళా సమితి అధ్యక్షులు డోకిపర్తి శంకరరావు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్ తమ్మిన సోనియా, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఎన్ఎస్. నాయుడు, ఎస్‌కె.నజీర్, డాక్టర్ టి.రాజు తదితరులు పాల్గొన్నారు.


సుమన్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

గంజాయి మాఫియాపై పోరులో
ప్రజలు భాగస్వాములు కావాలి

- వామపక్షాలు పిలుపు
- 2న నెల్లూరు జిల్లా బంద్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ప్రజానాట్య మండలి కళాకారుడు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్యను గంజాయి మాఫియా, అరాచక శక్తులు హత్య చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో డిసెంబరు రెండున నెల్లూరు జిల్లా బంద్ చేపట్టనున్నట్లు వామపక్ష నాయకులు తెలిపారు. ఆదివారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీలు సంయుక్తంగా విలేకర్ల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శ మూలం రమేష్, సిపిఐ సీనియర్ నాయకులు రామరాజు మాట్లాడారు. తాను నివసిస్తున్న కాలనీలోని యువత గంజాయి, డ్రగ్స్ వినియోగించడం వల్ల వారి బంగారు భవిష్యత్తు దెబ్బతింటోందని తన పాటలతో చైతన్యపరిచిన కళాకారుడిని గంజాయి మాఫియా కత్తులతో పొడిచి హత్య చేయడం దారుణమన్నారు. జిల్లాలో గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, అందుకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. హత్యకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంజాయి రహిత రాష్ట్రం కోసం వామపక్ష పార్టీలు పోరాడనున్నట్లు తెలిపారు. జిల్లా బంద్‌కు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ఇచ్చి సహకరించాలని కోరారు. విలేకర్ల సమావేశంలో లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, సిఐటియు, పౌరహక్కుల సంఘం, సిపిఐ ఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

కామాక్షి వైసిపి నాయకురాలు : శ్రీధర్‌రెడ్డి

కె.పెంచలయ్య హత్య కేసులో ఎ-1గా ఉన్న అరవ కామాక్షి వైసిపి నాయకురాలని నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సిపిఎం నేత పెంచలయ్య హత్య జరిగి మూడు రోజులవుతున్నా వైసిపి నేతలు కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు కూడా రాలేదని, హత్య చేసిన వ్యక్తులు వారితో ఉండేవారు కాబట్టే మొఖం చెల్లక రాలేదని విమర్శించారు. పెంచలయ్య హత్యకు తాను కానీ, తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కానీ, స్థానిక కార్పొరేటర్ ఆరవ శ్రీనివాసులు కారణం అని ఒక్కమాట చెబితే సిపిఎం ఏ నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. రానున్న రోజుల్లో గంజాయిపై ఐక్య ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు అరవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యను ఖండిస్తున్నాం : కాకాణి

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరు గంజాయికి అడ్డాగా మారిందని వైసిపి నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గంజాయి నేపథ్యంలో సిపిఎం నాయకుడు పెంచలయ్య హత్య జరిగిందని, దీన్ని వైసిపి తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. పెంచలయ్యను హత్య చేసినవారు టిడిపికి సంబంధించినవారేనని ఆరోపించారు. ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు టిడిపి యత్నిస్తోందని విమర్శించారు.

'ఇంద్ర' బస్సు ఛార్జీలు 20 శాతం తగ్గింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం-విజయవాడ ఇంద్ర ఎసి బస్సు ఛార్జీలను 20 శాతం మేర తగ్గించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు, సంక్షేమం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ బస్సుల్లో ప్రస్తుత ఛార్జీ రూ.928 ఉండగా, 20 శాతం తగ్గింపుతో రూ.743 అవుతుందని తెలిపారు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు తగ్గింపు ఛార్జీలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు (సర్వీసు నంబరు 2967), విజయవాడ నుంచి ప్రతిరోజూ రాత్రి 7.15 గంటలకు (సర్వీస్ నంబరు 2968) బస్సులు బయలుదేరుతాయని తెలిపారు.

టైటిల్ నిలబెట్టుకున్న త్రీసా- గాయత్రి

- ఫైనల్లో తడబడిన శ్రీకాంత్
- సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ టోర్నీ

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ టోర్నీలో భారత స్టార్లు త్రీసా జాలీ- గాయత్రీ గోపీచంద్ జోడి జయకేతనం ఎగురేసింది. మహిళల డబుల్స్ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగిన ఈ జోడీ.. అదిరే ఆటతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో ఈ జంట కహో ఒసావా- మై తనబే (జపాన్)ను చిత్తు చేసింది. అయితే మరోవైపు పురుషుల విభాగంలో కిడాంబి శ్రీకాంత్‌కు మాత్రం నిరాశే మిగిలింది.

మహిళల డబుల్స్‌లో తమకు తిరుగులేదని చాటుతూ త్రిసా జాలీ- గాయత్రీ గోపీచంద్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఉత్కంఠ భరిత ఫైనల్లో జపాన్ ద్వయం కహో ఒసావా- మై తనబే జోరుకు భారత జంట తొలి సెట్‌లో కోల్పోయింది. కానీ, ఆ తర్వాత గొప్పగా పుంజుకున్న త్రీసా, గాయత్రి అద్భుత ఆటతో వరుసగా రెండు సెట్లను 21-13, 21-15తో గెలుచుకున్నారు. వరుసగా రెండోసారి టైటిల్ సాధించారు.

భారత్‌కే చెందిన మిథున్ మంజునాథన్‌ను ఓడించి ఫైనల్ చేరిన శ్రీకాంత్ విజేతగా నిలవలేకపోయాడు. తనకంటే తక్కువ ర్యాంకర్ అయిన హాంకాంగ్ షట్లర్ జేసన్ గునవాన్ చేతిలో అనూహ్యంగా కంగుతిన్నాడు. తొలి సెట్‌ను 16-21తో కోల్పోయిన శ్రీకాంత్ రెండో సెట్‌లో పైచేయి సాధించాడు. అయితే.. నిర్ణయాత్మక మూడో సెట్‌లో జేసన్‌ను నిలువరించలేక మ్యాచ్‌ను కోల్పోయాడు.

అడవీ మార్గంలో కూర్చున్న విద్యార్థులు

పాఠశాలకు వెళ్లాలంటే..
అడవిని దాటాల్సిందే!

- రోడ్డు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- హుకుంపేట (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా హుకుంటపే మండలం రాప్ప పంచాయతీ మారుమూల అడవి ప్రాంతాల్లో విద్యార్థులు విద్యాభ్యాసం కోసం అవస్థలు పడుతున్నారు. చదువుకునేందుకు రీడబంద నుంచి కోటగుమ్మ వరకు అడవి మార్గాన నడిచి వెళ్లాల్సి వస్తోంది. ప్రతి ఉదయం చదువు కోసం బయలుదేరే చిన్నారులు అడవిదారుల గుండా మట్టి రోడ్లలో, రాళ్ల గుట్టల్లో నడుస్తూ పాఠశాలకు చేరుకుంటున్నారు. హుకుంపేట మండలం రీడబంద గ్రామం సమీపంలోని కోటగుమంలో ఎంపిపి ప్రాథమిక పాఠశాలకు రహదారి లేనందున విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరం కాలిబాటనే వెళుతున్నారు. ఎండలోనూ, వర్షంలోనూ, మట్టి దారులలో వెళుతూ ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు వెళ్లే మార్గమధ్యంలో అవస్థలు పడుతూ ఆగి ఆగి వెళుతున్నారు. అడవి చెట్ల నీడలో కూర్చుంటున్నారు. తక్షణమే రహదారి సదుపాయం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, పలు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఎలుగుల మెట్టపై ఏం జరుగుతోంది?

- తవ్వేస్తారేమోనని సమీప గ్రామాల ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి- పార్వతీపురం

మండలంలోని పెద బొండపల్లి, హెచ్.కారాడ వలస సమీపంలో ఉన్న ఎలుగుల మెట్టపై ఏం జరుగుతుందోనని సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతు న్నారు. గ్రానైట్ కొండ సమీపంలో విద్యుత్ సరఫరాకు లైన్ ఏర్పాటు చేస్తుండడంతో జనం గుండెల్లో రైళ్ల పరుగెడుతు న్నాయి. బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాల విషయంలో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర కంపెనీ యజమానికి అనుకూలంగా వ్యవహరించిన దృష్ట్యా ఎలుగుల మెట్ట గురించి సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ కొండపై తవ్వకాలకు సంబంధించి కంపెనీ ప్రతినిధులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా పెదబొండపల్లి, హెచ్.కారాడవలస గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. గ్రానైట్ తవ్వకాలకు అనుమతి కోసం దరఖాస్తు చేసిన కంపెనీకి అధికార పార్టీ నాయకులు అనుకూలంగా ఉండడంతో గ్రామాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవేళ తవ్వకాలంటూ మొదలు పెడితే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని గ్రామాల ప్రజలు భావిస్తున్నారు.

కార్పొరేషన్ రుణాలు అందేనా?

- రుణాల మంజూరుపై అయోమయం
- ఉమ్మడి జిల్లాలో ఐదు వేల యూనిట్లు ఇస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటనలు
- ఇంటర్వ్యూలు నిర్వహించి చేతులు దులుపుకున్న సర్కార్

రుణాల కోసం దరఖాస్తు చేయడానికి వచ్చిన ప్రజలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- హిందూపురం

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, కాపు, మైనార్టీలకు రుణాలు మంజూరు చేసి అర్హులైన యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తామంటూ టిడిపి కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంవత్సరానికి ముందే నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు ఇంటర్వ్యూలు నిర్వహించి చేతులు దులుపుకుంది. ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదు. కార్పొరేషన్ రుణం మంజూరైతే ఉపాధి దొరుకుతుందని ఎదురుచూస్తున్న వేలాది మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, బిసి, కాపు సామాజిక తరగతులను మోసం చేసిందంటూ కూటమి నేతలు ఎన్నికల్లో విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే మళ్లీ కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో ఒక్క హిందూపురం పురపాలక సంఘంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా 146 యూనిట్లు మంజూరు చేయగా 1355 మంది నిరుద్యోగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి గత ఫిబ్రవరి 20న పురపాలక సంఘ కార్యాలయం ఆవరణంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో బిసి కార్పొరేషన్ కింద దాదాపు 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద దాదాపు 1,387 యూనిట్లు, ఇడబ్ల్యూఎస్ కోటా కింద దాదాపు 215 యూనిట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలు ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. దాదాపు 25 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తేల్చారు. దరఖాస్తుదారులకు పురపాలక సంఘ కార్యాలయాల్లో, మండల పరిషత్ కార్యలయ ఆవరణంలో బ్యాంక్ అధికారులతో కలిసి అధికారులు ఇంటర్వ్యూల ప్రక్రియ పూర్తి చేశారు.కార్పొరేషన్ రుణం వచ్చేసినట్లే అని అంతా అనుకున్నారు. అదే సమయంలో ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. మే 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దాదాపు మూడు వేల దరఖాస్తులు వరకూ వచ్చినట్లు లెక్కలు వేశారు. ఏం జరిగిందో, ఏమో తెలీదు హఠాత్తుగా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం నిలిపివేసింది. ఎందుకు నిలిపివేశారో కారణాలు సైతం చెప్పలేదు. సాంకేతిక కారణాల వల్ల నిలిపివేసినట్లు చెబుతున్నారు. కార్పొరేషన్ రుణాల ప్రక్రియను నిలిపివేసి దాదాపు ఆరు నెలలు కావస్తోంది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకుండా పోయింది. వెంటనే రుణాలు మంజూరు చేయాలని అర్హులైన వారంతా కోరుతున్నారు.

ఇఎస్ఐ ఆస్పత్రిలో మందుల కొరత

- అరకొర సిబ్బందితో కాలయాపన
- కార్మికుల కుటుంబాల అవస్థలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం కార్మిక బీమా ఆస్పతి (ఇఎస్ఐ)లో మందుల కొరత వేధిస్తోంది. ఈ ఆస్పతి పరిధిలో రాజమహేంద్రవరం, సీతంపేట, లాలాచెరువు, ఇన్నీసుపేట, కడియం, ధవళేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, వేంద్ర డిస్పెన్సరీలు ఉన్నాయి. ఈ ఆస్పతిలో రోజూ 120 వరకూ ఒపి నమోదవుతోంది. మందులు లేకపోవడంతో బయట కొనుక్కోవాల్సి వస్తోంది. డాక్టర్లు రాసిన మందుల్లో చాలామటుకు అందుబాటులో ఉండకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. అధునాతన భవనం అందుబాటులోకి వచ్చినా ఆపరేషన్ థియేటర్ పున:ప్రారంభం కాలేదు. సంవత్సరాలు గడుస్తున్నా ఇక్కడ శస్త్ర చికిత్సలు చేయట్లేదు. వంద పడకల స్థాయిలో ఆధునిక భవనం, కొన్ని మౌలిక సదుపాయాలు సమకూరినా అత్యాధునిక వైద్య పరికరాలు

మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు. కనీసం 50 పడకల స్థాయిలో ఉండాల్సిన వైద్య సిబ్బంది కూడా లేరు. ఇప్పటికే అత్యవసర వైద్యం శస్త్ర చికిత్సలకు రెఫరల్ ఆస్పత్రులకు పంపిస్తుండడంతో రోగులకు అవస్థలు తప్పట్లేదు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఇఎస్ఐ చందాదారులుగా ఉన్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కలిపి సుమారు ఏడు లక్షల మందికి ఇక్కడ వైద్యం అందించాలి. వైద్య సిబ్బంది కొరతతో ఆపరేషన్ థియేటర్ పున:ప్రారంభించలేదు. అత్యంత ఖరీదైన శస్త్ర చికిత్సలు జరగట్లేదు. సంవత్సరానికి 600కు పైగా కేసులను ఇక్కడి నుంచి రెఫరల్ ఆస్పత్రులకు పంపుతున్నారు. మందులు ఖాళీ అయి ఆరు నెలలు గడిచినట్టు తెలుస్తోంది. తాజాగా రూ.4 కోట్ల విలువైన 200 పైగా మందుల జాబితాతో ఇండెంట్ రెడీ చేసినట్లు ఇఎస్ఐ వైద్య అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కొద్దిపాటి మందులనే పంపిణీ చేస్తున్నారు. కనీసం కాల్షియం బిళ్లలు సైతం అందుబాటులో లేవు. ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్, పరిపాలన కలిపి 30 మంది ఉన్నారు. కానీ, వంద మందికిపైగా ఉండాలి. నూతన ఆస్పత్రిలో 12 మంది పారిశుధ్య సిబ్బంది, ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే ఉన్నారు. మూడుకుపైగా ఐసియులు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర వైద్య విభాగాలు ఉండడంతో షిఫ్టుల వారీగా పనిచేయాల్సి వస్తోంది. పారిశుధ్య సిబ్బంది 200 మంది వరకూ అవసరం అవుతుంది. కానీ, సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇక్కడి ఆపరేషన్ థియేటర్‌కు సంబంధించి రూ.1.03 కోట్లతో ఆరు రకాల కొత్త పరికరాలు ఆమోదం కోసం సిఫార్సులు చేశారు. వెంటిలేటర్‌తో కూడిన ఎనస్తీషియా యంత్రం, స్కావెంజింగ్ సిస్టం, సీ ఆర్మ్‌తో కూడిన డబుల్ మానిటర్, కంపార్టబుల్ ఒటి టేబుల్ పవర్ డ్రిల్, కలర్ డాప్లర్, ప్రోబ్స్, కంప్యూటర్ సిస్టంతో కూడిన ఆల్ట్రా సౌండ్ యంత్రం సమకూరాల్సి ఉంది.

బెంగాల్‌లో మరో ఘోరం

- మహిళపై సామూహిక అత్యాచారం

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో వరస అత్యాచార ఘటనలు కలవరపెడుతున్నాయి. రాష్ట్ర రాజధానిలోనే సామూహిక అత్యాచార ఘటన జరిగింది. ముగ్గురు వ్యక్తులు ఒక మహిళను కారులోకి లాగి, ఆమెతో బలవంతంగా మద్యం తాగించారు. సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఒకచోట వదిలి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నవంబర్ 28న రాత్రి 9 గంటల సమయంలో 28 ఏళ్ల వివాహిత కొల్‌కతా ప్రగతి మైదాన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని బస్టాండ్ వద్ద యాప్ అగ్రిగేటర్ కారు కోసం వేచి ఉన్నది. ఇదే సమయంలో ఒక కారు అక్కడకు వచ్చింది. ఆ మహిళకు మూడు నెలల నుంచి తెలిసిన వ్యక్తితో సహా ముగ్గురు అందులో ఉన్నారు. ఆమెను బలవంతంగా కారులోకి లాగారు. మత్తు మందు కలిపిన మద్యాన్ని ఆ మహిళతో తాగించారు. ఆ ముగ్గురు వ్యక్తులు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఒక ప్రాంతంలో వదిలేసి కారులో వెళ్లిపోయారు. మహిళ పరిస్థితిని గమనించిన స్థానికులు ఎస్ఎస్‌కెఎం ఆసుపత్రిలో చేర్చారు. హాస్పిటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

kotak®

కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: నం.27-బికెసి, సి-27, జి-బ్లాక్, బంద్రా కుర్లా కాంప్లెక్స్, బంద్రా (ఈస్ట్), ముంబాయి-400051.
ప్రాంతీయ కార్యాలయం:- #6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ ఛాంబర్స్, రాజ్ భవన్ రోడ్డు, సోమాజిగూడ, హైదరాబాద్-500082

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద చట్టబద్ధమైన నోటీసు. దిగువసంతకందారు అయిన కోటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి, బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 అర్థంలో ఉన్న బ్యాంకింగ్ కంపెనీ దీని నమోధిత కార్యాలయం: 27బికెసి, సి 27, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఇ), ముంబై-400051, వద్ద ఉంది. మరియు శాఖా కార్యాలయమును కలిగి ఉండటం మరియు ప్రాంతీయ కార్యాలయం కూడా ఇక్కడ ఉంది #6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ ఛాంబర్స్, రాజ్ భవన్ రోడ్డు, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 (ఇకపై "ది బ్యాంక్/కెఎంబిఎల్" గా సూచిస్తారు), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 కింద నియమించారు దీని ద్వారా మీకు ఈ క్రింది నోటీసును జారీ చేస్తుంది.
సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 రూల్ 3 మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం ఈ నోటీసు జారీ చేయబడింది.

(రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) కస్టమర్ పేరుతో పాటు లోన్ ఖాతా నం.లు.	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం	తనఖా ఆస్తి యొక్క వివరణ
1. లోన్ ఖాతా నం.HF38022531 CRN No. 33439842 1) శ్రీ.అల నాగరాజు (మరణించారు) (మరణించినప్పటి నుండి అతని చట్టపరమైన వారసులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు) తండ్రి శ్రీ. వెంకటేశ్వర రావు, డోర్.నం: 21-10/3-74, 2వ లైన్, శ్రీనగర్, ముత్యాలంపాడు, విజయవాడ-520011. ఇక్కడ కూడా : 1. శ్రీ. అల నాగరాజు, (మరణించారు) (మరణించినప్పటి నుండి అతని చట్టపరమైన వారసులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు) తండ్రి. శ్రీ.వెంకటేశ్వర రావు, హారికా అపార్టుమెంట్లు, ఫ్లాట్ నం 203, 2 వ అంతస్తు, 16 వ లైను తోట వారి వీధి, నందమూరి నగర్, విజయవాడ-520015. ఇక్కడ కూడా: 1. శ్రీ. అల నాగరాజు, (మరణించారు) (మరణించినప్పటి నుండి అతని చట్టపరమైన వారసులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు) C/o మెసర్స్ శివ శక్తి ట్రేడర్స్, గ్రౌండ్ ఫ్లోర్, 29-1-16, శేషాద్రి శాస్త్రి వీధి, గవర్నర్‌పేట్, విజయవాడ-520002. ఇక్కడ కూడా: 1. శ్రీ. అల నాగరాజు, (మరణించారు) (మరణించినప్పటి నుండి అతని చట్టపరమైన వారసులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు) తండ్రి.శ్రీ.వెంకటేశ్వర రావు, పి.నం:-1, చంద్రహాస అపార్టుమెంట్లు, డోర్.నం:-43-106/1-52, ఫ్లాట్ నం.3, 1 వ అంతస్తు, విజయ లక్ష్మి, ఆర్.ఎస్.నం. 12, నందమూరి నగర్, విజయవాడ-520015. (రుణగ్రహీత), 2. శ్రీమతి. అల విజయ లక్ష్మి భర్త శ్రీ.అల నాగరాజు, పి.నం:-1, చంద్రహాస అపార్టుమెంట్లు, డోర్.నం:-43-106/1-52, ఫ్లాట్ నం.3, 1 వ అంతస్తు, విజయ లక్ష్మి, ఆర్.ఎస్.నం. 12, నందమూరి నగర్, విజయవాడ-520015. ఇక్కడ కూడా 2. శ్రీమతి. అల విజయ లక్ష్మి భర్త శ్రీ.అల నాగరాజు, డోర్.నం:-21-10/3-74, 2 వ లైను, శ్రీనగర్, ముత్యాలంపాడు, విజయవాడ-520011. (1/ సహ-రుణగ్రహీత/గ్యారంటర్ యొక్క చట్టపరమైన వారసుడు) 3. శ్రీ.అల సతీష్, తండ్రి.శ్రీ.అల నాగరాజు, పి.నం:-1, చంద్రహాస అపార్టుమెంట్లు, డోర్.నం:-43-106/1-52, ఫ్లాట్ నం.3, 1 వ అంతస్తు, విజయ లక్ష్మి, ఆర్.ఎస్.నం. 12, నందమూరి నగర్, విజయవాడ-520015. ఇక్కడ కూడా:-శ్రీమతి. అల సతీష్, తండ్రి. అల నాగరాజు 21-10/3-74, 2 వ లైను, శ్రీనగర్, ముత్యాలంపాడు, విజయవాడ-520011 (1/సహ-రుణగ్రహీత/గ్యారంటర్ యొక్క చట్టపరమైన వారసుడు)	డిమాండ్ నోటీసు తేది: 14 నవంబర్ 2025 ఎన్‌పిఎ తేది: 11 జనవరి 2023, పూర్తి బకాయి మొత్తం రూ.32,72,846.30/-పిఎస్ (ముప్పై రెండు లక్షల డెభై రెండు వేల ఎనిమిది వందల నలభై ఆరు రూపాయల ముప్పై పైసలు మాత్రమే) 14-నవంబర్-2025 నాటికి.	క్రింది ఆస్తులపై తనఖ విస్తీర్ణత 42.28 చ.గ.లు (35.35 చ.మీ.ల) విభజింపబడని వాటా మొత్తం విస్తీర్ణత 845.7 చ.గ.లు (707.11 చ.మీ.ల) సైట్ ఫ్లాట్ తో పాటు బేరింగ్ ఫ్లాట్ నం 3, 1 వ అంతస్తులో, ప్లింత్ ఏరియా 1035.6 చ.అ.లు., సాధారణ ప్రాంతం తో పాటు, పార్కింగ్ ఏరియా 80 చ.అ.లు అన్ని సౌలభ్య హక్కులతో పాటు ప్లాట్ నం.1, ఆర్.ఎస్ నం 12 నందమూరి నగర్, విజయవాడ గ్రామ భాగం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ జిల్లా-రిజిస్ట్రీ విజయవాడ కృష్ణా జిల్లా, చదునైన సరిహద్దులతో సరిహద్దులుగా ఉంది తనఖా పెట్టిన ఆస్తి తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కామన్ కారిడార్ మరియు మెట్లు, దక్షిణం: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ప్లాట్ నం 4, ప్లాట్ నం 1 యొక్క సరిహద్దులు తూర్పు: ప్లాట్ నం 2, 3 మరియు 4, దక్షిణం: ఇతరుల ఆస్తి, పడమర: క్రాస్ సైట్, ఉత్తరం: 40 అడుగుల వెడల్పు రోడ్డు.

పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు కెఎంబిఎల్ కి చెల్లింపు చేయడంలో విఫలమైతే, కెఎంబిఎల్ చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించే నిబంధనల ప్రకారం పైన పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తులపై చర్యలు తీసుకుంటుంది, ఖర్చులు మరియు పర్యవసానాలకు సంబంధించి పూర్తిగా రుణగ్రహీతల బాధ్యతను నిర్వర్తిస్తుంది. కెఎంబిఎల్ ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, పైన పేర్కొన్న ఆస్తులను అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయడం ఈ చట్టం ప్రకారం నిషేధించబడింది. ఈ చట్టంలోని నిబంధనలను లేదా దాని కింద రూపొందించిన నియమాలను ఉల్లంఘించిన లేదా ఉల్లంఘించడానికి ప్రోత్సహించిన ఏ వ్యక్తి అయినా, చట్టం కింద అందించిన విధంగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానాకు గురవుతారు.

తేది: 01.12.2025 ప్రదేశం: విజయవాడ — **సం/- అధీకృత అధికారి, కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్.**

జీవన సౌరభం
చేయాలన్న పట్టుదల, చేయగలను అన్న నమ్మకం ఉంటే అద్భుతాలు సాధ్యమే..

మీకోసం
దోశల పిండి బాగా పులిసిపోతే అందులో రెండు చెంచాల గోధుమపిండి కలపాలి.

JEEVANA జీవన the family

తేలు బుద్ధి

అడవిలోన ఒక తేలు
ఆకలితో పడుకున్నది
కదలలేక మెదలలేక
కన్నీరును ఒలుకుతుండే

అది చూసిన ఓ కోడి
ఆహారం దొరికిందని
పరుగు పరుగున అచటి కొచ్చి
ముక్కుతోని పొడవ చూసే

ప్రాణ భయంతో తేలు
కోడి బావ కోడి బావ
ఒక్క మాట చెబుతాను
ఆలకించుమని కోరే

నాకు ఆరోగ్యం బాగులేదు
ఆహారం అసలు దొరకలేదు
నాతో స్నేహంగా ఉండి చూడు
హాని చేయబోను ఎవరికెపుడు

తేలు మాట నమ్మి కోడి
తన ఇంటికి తీసుకెళ్లి
ఆహారం తెచ్చి ఇచ్చి
ఆతిథ్యం మంచి గిచ్చి

చెలిమి తోడ వుండమంటూ
సలహాలను మెండు గిచ్చే
తనకు దోస్తు దొరికాడని
సంబరపడి పోయే కోడి

పొద్దు పొద్దు గాలనే
కొక్కోర కో అంటూ లేచి
తన పిల్లలను చూడమంటూ
బయటకు పోయే తల్లి కోడి

బలం పుంజుకున్న తేలు
కపట బుద్ధి దాచుకుంటూ
కత్తెర చేతులు చాచి
కస్సు బుస్సుమని లేచే

అమ్మదోస్తు ఈ తేలని ప్రేమగ
దరి చేరినాయి పిల్ల కోళ్ళు
తన తోక కొండి లేపి మరీ
చిటుకు చిటుకున కుట్టే తేలు

లబో దిబో మంటూ
బుజ్జి బుజ్జి పిల్ల కోళ్ళు
తల్లి చెంతకు పరుగు తీసి
బోరుమంటూ ఏడ్వసాగే

తేలు బుద్ధి తెలుసుకున్న
తల్లికోడి కోపంతో
రయ్యిన ఉరుకురికి వచ్చి
తేలుపైన ఎగిరి దూకే

తన ముక్కుతో తేలును
ముక్కలు ముక్కలుగ చీల్చి
స్నేహ ద్రోహి దేహాన్ని
కసితీరా ఆరగించే

ఎప్పుడైనా ఈ జగాన
బుద్ధిలేని ప్రబుద్ధులతో
జాగ్రత్తగా మెదలమంటూ
తల్లికోడి హితము చెప్పే..!

- డా.కటుకోఝ్వల రమేష్,
99490 83327.



కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలో ఐదు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

యం.డి ఆలియ,
9వ తరగతి,
జడ్పీ స్కూల్ రాంపూర్,
నిజాంపేట మండలం, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అవగాహనతోనే నియంత్రణ

నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలతోపాటుగా మనదేశంలోనూ హెచ్ఐవి నియంత్రణ కృషి, ప్రయాణంలో విజయవంతంగా కొనసాగుతోంది. హెచ్ఐవి సోకిన వారికి జీవితకాల ఎఆర్‌టి మందులతో పాటు ఉచిత వైర్లోడ్ పరీక్షలు చేస్తారు. తద్వారా వ్యాధి సోకిన వారి రోగనిరోధక శక్తిని పెంచడంతో వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి. శరీరంలో వైరస్ స్థాయిని గుర్తించలేనటువంటి స్థాయికి తగ్గించి కొత్తగా వేరొకరికి వ్యాప్తి కూడా నియంత్రణ చేసే చర్యలు కొనసాగుతున్నాయి. హెచ్ఐవి అనేది కలుషిత రక్తమార్పిడి, సురక్షిత శృంగారం ద్వారా, తల్లి నుంచి బిడ్డకు సోకే మార్గాల ద్వారా నియంత్రించబడినప్పటికీ ఇటీవల కాలంలో సూది మందు ద్వారా మాదకద్రవ్యాలు తీసుకునే అలవాటు ఉన్నవారిలో వ్యాప్తి ఎక్కువగా ఉండడం ఆందోళన కల్గించే విషయం. ప్రస్తుతం మన రాష్ట్రంలో సుమారుగా 2.37 లక్షల మంది హెచ్ఐవి సోకిన వారు ఎఆర్‌టి మందులు వాడుతూ ఉండడమే కాక వారిలో 96 శాతం మంది వైరస్ స్థాయిని కూడా అదుపులో ఉంచడం సాధ్యమైంది. అయినప్పటికీ నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పిలుపుమేరకు రాష్ట్రంలో ఇంకా కొత్త హెచ్ఐవి కేసులని గుర్తించాల్సిన లక్ష్యాన్ని మనం చేరుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వివిధ విభాగాల ద్వారా ఎన్నో హెచ్ఐవి పరీక్షలు, చికిత్సకి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తోంది. దీనికి తోడుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్ఐవి సోకిన వారికి ఉచితంగా ఎఆర్టీ మందులు ఉచిత వైరల్ లోడ్ పరీక్ష మాత్రమే కాకుండా అన్ని రకాల సంక్షేమ పథకాలు కూడా వర్తించేలా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా 43 వేల మంది పైచిలుకు హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకి పెన్షన్ కూడా అందిస్తోంది. మరో 40 వేల మంది వరకు అర్హులైన వారికి పెన్షన్ అందేలా చర్యలు కూడా తీసుకుంది. ప్రతి సంవత్సరం డిసెంబర్ ఒకటో తేదీన హెచ్ఐవి వ్యాధితో మరణించిన వారిని గుర్తు చేసుకుంటూ, వ్యాధి సోకిన వారికి భరోసానిస్తూ, కొత్తగా వ్యాధి భారిన పడకుండా అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పిలుపుమేరకు సమాజంలో ప్రతి ఒక్కరూ హెచ్ఐవి వ్యాధి వ్యాప్తి నియంత్రణలో పాలుపంచుకోవాలని, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై వివక్షని రూపుమాపాలని తద్వారా హెచ్ఐవి వ్యాధిని 2030 నాటికి సమాజానికి ఆరోగ్య విపత్తు కాని స్థాయిని అందుకోవాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని అందుకునేలాగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఉచితంగానే వైద్యసేవలు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వాసుపత్రుల్లో హెచ్ఐవి-ఎయిడ్స్ నియంత్రణ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. రోగికి ప్రతినెలా నిర్వహించే మెసిలా పరీక్ష రూ.2800 వరకూ, ఏడాదికి ఒకసారి చేసే వైరల్‌లోడ్ పరీక్ష రూ.6000 వరకూ ఉంటుంది. వీటితోపాటు సిడి 4 పరీక్ష కూడా రోగి జీవించినంతకాలం చేయాలి. అవన్నీ ఉచితంగా ప్రభుత్వమే చేయిస్తోంది.



అవగాహన..అప్రమత్తం ముఖ్యం

ప్రపంచవ్యాప్తంగా చాపకింద నీరులా వ్యాప్తిచెందుతున్న సాంక్రమిక వ్యాధుల్లో హెచ్ఐవి-ఎయిడ్స్ ఒకటి. ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావటంతో వ్యాధి నియంత్రణ సాధ్యమవుతోంది. ఇప్పటికే మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి వచ్చిన తర్వాత జీవన శైలిని మార్చుకుని మంచిగా మందులు వాడితే బయటపడే అవకాశాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి హెచ్ఐవి సోకినప్పుడు అది శరీరంలోని జీవ కణాలపై దాడి చేస్తుంది. దీని కారణంగా ఎయిడ్స్ సోకిన వ్యక్తులు చాలా తొందరగా అనారోగ్యానికి గురౌతారు. జ్వరం, జలుబు, ఏదైనా రోగాలకు గురి కావడం ఎయిడ్స్ సోకిన వ్యక్తుల్లో ఎక్కువగా కనిపిస్తుంటుంది. సోకిన వ్యక్తులు సరైన చికిత్స, సరైన జీవన విధానంతో వ్యాధి సోకిన 15 నుంచి 20 సంవత్సరాల వరకు ఆరోగ్యంగా జీవించొచ్చు.

కేసుల తగ్గింపునకు చర్యలు

హెచ్ఐవి-ఎయిడ్స్ నియంత్రణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషిచేస్తున్నాయి. దీనిలో భాగంగానే ఎయిడ్స్ నియంత్రణా కార్యక్రమాలు అన్ని రాష్ట్రాల్లోనూ అమలవుతున్నాయి. మన రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాప్తిని 2030 నాటికి సున్నా శాతానికి తగ్గించటమే లక్ష్యంగా కృషిచేస్తున్నాం. ఈ ఏడాది ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో భాగంగా 'బ్రేకింగ్ ది సైలెన్స్' నినాదంతో 2030 నాటికి ఆ వ్యాధి అంతమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. 2010-2011లో 0.48 శాతం తగ్గుదల ఉంటే దానిని 2024-25 నాటికి 4.13 శాతానికి పెంచగలిగాం. హెచ్ఐవితో ఉండి ఇంకా బిపి, షుగర్ వంటి సమస్యలతో బాధపడే వారు జీవించినంతకాలం మందులు వాడటం మేలు. హెచ్ఐవి అని తేలిన తర్వాత మొదటి ఆరునెలలపాటు ఎఆర్‌టిసి కేంద్రానికి మొదటి నెల, ఆ తర్వాత ఆరునెలల వరకూ ట్రీట్మెంట్ తీసుకోవాలి. వైరల్ లోడ్, సిడి 4 పరీక్షల ద్వారా వచ్చిన ఫలితాలను బట్టి ఎఆర్‌టి వైద్యాధికారి వైద్య చికిత్సలు అందజేస్తుంటారు. ప్రతినెల ఒకసారి మూడు నెలలపాటు ఇలా వెళ్లాలి. ఫ్లస్ విఇ ఉన్నవారు ఎఆర్‌టిసికు వెళ్తే అక్కడ స్క్రీన్ పిఎల్‌హెచ్ఐవి పరీక్ష చేసి ఆపర్చునిస్టిక్ ఇన్ఫెక్షన్స్ (ఒఎల్ఎస్)లు, టిబి, ఎస్‌టిఐ పరిస్థితిని చెబుతారు. నిమోనియా, ఇంకా కామన్ ఇన్ఫెక్షన్లు ఏమైనా ఉన్నాయా? లేదా ? అనేది కూడా తెలుసుకోవచ్చు. ఎంత త్వరగా వ్యాధి గురించి నిర్ధారణ చేసుకుంటే అంత త్వరగా చికిత్సలు ప్రారంభించి నిరంతరం పర్యవేక్షణలో ఉంచటం ద్వారా వ్యాధి తగ్గటానికి అవకాశాలు ఉంటాయి. రాష్ట్రప్రభుత్వం హెచ్ఐవి-ఎయిడ్స్ రోగుల కోసం ఎఆర్‌టిసి కేంద్రాలు, సిఎస్‌సిల ద్వారా ఆరోగ్య సేవలను అందిస్తుంది. రోగుల్లో వయోవృద్ధులు ఉంటే వారికి పెన్షన్లు కూడా మంజూరుచేస్తుంది. రోగులకు న్యూట్రీషన్ ఫుడ్‌ను కూడా అందజేస్తుంది. వ్యాధి నియంత్రణలో భాగంగా చికిత్సా కేంద్రాల్లో ఉండేలా ఏర్పాట్లు చేసింది. మన రాష్ట్రంలో 35 నుంచి 52 సంవత్సరాల వయస్సు వారిలో 49 కేసులు నమోదవుతున్నాయి. హెచ్ఐవి పాజిటివ్ మహిళ బిడ్డకు జన్మనిస్తే నెగెటివ్‌గా వస్తుంది. ఎందుకంటే ఎఆర్‌టి ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయటం, డాక్టర్లు నిరంతరం వ్యాధినిరోధక చర్యలు చేపట్టడం ద్వారా బిడ్డకు వ్యాధి సోకదు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా ట్రాఫిక్ నియంత్రణలో భాగమైన 100 బారికేడ్లను అందజేశాం. వాటిపై మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి, ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి కోరుతూ నినాదాలు రాయించాం.

1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సభ

సోమవారం ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎపి శాక్స్) ఈ సభను ఏర్పాటుచేసింది.

డాక్టర్ పి.మంజుల
జాయింట్ డైరెక్టర్,
ఎపి స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ
(ఎపి శాక్స్)

డిసెంబర్‌లో సినిమాల జోరు...



రాబోయే పండుగలను దృష్టిలో పెట్టుకుని డిసెంబర్‌లో సినిమాల విడుదలకు వరుసగా రాబోతున్నాయి. క్రిస్మస్ తర్వాత వచ్చే సంక్రాంతికి సినిమాలు ఇప్పటికే క్యూకట్టిన విషయం తెలిసిందే. డిసెంబర్‌లో మొత్తంగా టాలీవుడ్‌లో 20కిపైగా సినిమాలు విడుదలలు ఉన్నాయి. వాటిలో పెద్ద సినిమా ఒక్కటే. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ కథానాయకుడుగా తెరకెక్కిన సినిమా 'అఖండ 2: తాండవం' పెద్ద సినిమా. మిగిలినవన్నీ చిన్న తరహా సినిమాల కోవలోకి వచ్చేవే. ఆ తర్వాత క్రిస్మస్‌కు విశ్వక్‌సేన్ నటించిన 'ఫంకీ', అడవిశేష్ 'డెకాయిట్', ఆది సాయికుమార్ 'శంబాల', రోషన్ 'చాంఫియన్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. సాయి ధరమ్‌తేజ్ 'సంబరాల యేటిగట్టు' సినిమా కూడా ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. దీపావళికి వచ్చిన తెలుసుకదా, కె.ర్యాంప్, డ్యూడ్, మిత్రమండలి, మాస్‌జాతర వంటి సినిమాలు బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టాయి. పాటలతో కె.ర్యాంప్ సోషల్‌మీడియాలో బాగా ట్రెండ్ అయ్యింది. డ్యూడ్ సినిమా కాస్త ఆకట్టుకున్నా అందులో ఓ పాటను తొలగించాలనే డిమాండ్ కూడా పెద్దఎత్తున వచ్చింది. ఏదైనా పెద్ద కథానాయకుల సినిమాలు లేకపోయినా చిన్న కథానాయకుల సినిమాలు ఓ మేరకు ఊరట కల్గించాయి. నవంబర్ మూడోవారంలో విడుదలైన అగ్ర కథానాయిక కీర్తి సురేష్ సినిమాయ 'రివాల్వర్ రీటా' మిశ్రమ స్పందనను అందుకుంది. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. కూడా ఓ మేరకు ఆడుతోంది.

జోరుగా సినిమాల విడుదలలు

డిసెంబర్ 1న రశ్మిక మందన్నా-మైసా, పోసాని కృష్ణమురళి-గాలిశ్రీను (రీరిలీజ్), నిశాల్-యుగం, 2న నందమూరి తారకరత్న-చూడాలని (రీరిలీజ్), 3న బ్రహ్మానందం-గజదొంగ, శ్రీ విష్ణు -మృత్యుంజయ్(రీరిలీజ్), 4న కిరణ్‌తేజ్-పడ్డానండీ ప్రేమలో, సునీల్‌శర్మ-రత్నావలి (రీ రిలీజ్), 5న నందమూరి బాలకృష్ణ-అఖండ 2, వెంకటేష్-ఆటనాదే..వేట..., మనసుగతి, ఉదయ్‌కిరణ్-దిల్ కబడ్డీ (రీ రిలీజ్), 6న దుల్కర్ సల్మాన్-ఆకాశంలో ఒక.., శర్వానంద్-బైకర్, సారా-సుమన్‌శెట్టి-ఓ వర్షం, సాయికిరణ్-లెమన్, 7న సంతోష్ శివన్-రవి వర్మ, 8న అక్షయ్-హరిలో రంగ హరి, 10న మాధవన్-పార్వతీపురం, 11న నైన్త్‌క్లాస్, మహేంద్రగిరి, 12న మ్యాజిక్, చెన్నై లవ్‌స్టోరీ, నా తెలుగోడు, 25న 'దండోరా వంటి సినిమాలు థియేటర్లలో విడుదల కానున్నాయి.

'అఖండ-2కు పోటీయే లేదు..!

బాలకృష్ణ-సంయుక్తమీనన్ జంటగా నటించిన సినిమా 'అఖండ 2 : తాండవం'. బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించారు. ఎం తేజస్విని నందమూరి సమర్పించారు. డిసెంబర్ 5న థియేటర్లలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 3డీలోనూ రిలీజ్ చేయనున్నట్టు చిత్ర యూనిట్ ప్రకటించింది. గతంలో బాలకృష్ణ-బోయిపాటి కలయికలో వచ్చిన అఖండ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా అఖండ 2 రానుంది. ఈ సినిమాపై భారీగానే అంచనాలు ఉన్నాయి. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డిసి), గోవా ప్రభుత్వంతో కలిసి ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ ఆఫ్ గోవా సంయుక్తంగా 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ)లో ఈనెల 20న బాలకృష్ణ సన్మానాన్ని అందుకున్న విషయం తెలిసిందే. భారతీయ సినీ రంగంలో అర్ధ శతాబ్ద కాలం పాటు తన అపూర్వమైన నటనతో, దాదాపు 100కిపైగా చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన బాలయ్య 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని ఇఫీ- 2025 ప్రత్యేకంగా నిర్వహించారు. పద్మభూషణ్, మూడు నంది అవార్డులను బాలకృష్ణ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. హరిహర వీరమల్లు, ఓజీ సినిమాల విడుదల కోసం తన సినిమా విడుదలను ఆపేసిన బాలకృష్ణకు ఈ సారి పోటీ సినిమాలు లేవు. పలు చిన్న సినిమాలు ఉన్నా పెద్దది అఖండ 2 మాత్రమే. ప్రేక్షకులు ఏ విధంగా ఆదరిస్తారనేది ఈనెల ఐదోతేదీన కానీ తెలియదు.

పొంగల్...దంగలే...

క్రిస్మస్ తర్వాత వచ్చే సంక్రాంతిపైనే టాలీవుడ్ దర్శకులు, నిర్మాతలు కేంద్రీకరించారు. పండుగకు సినిమా విడుదలైతే మంచి వసూళ్లు రాబట్టవచ్చునేది ఇండస్ట్రీలోని నిర్మాతల అంచనా. టాలీవుడ్‌కు సంబంధించి ఇదే అతిపెద్ద సీజన్. ఈ సమయంలో సినిమాకు పాజిటివ్ టాక్ బాగుంటే మామూలు రోజుల్లో కంటే ఎక్కువ వసూళ్లు వస్తుంటాయి. యావరేజ్ సినిమా కూడా సూపర్ హిట్ అయ్యే అవకాశాలు ఉండే సీజన్ ఇది. అందుకే స్టార్ హీరోల్లో చాలా మంది తమ సినిమా ఒకటి సంక్రాంతి బరిలో ఉండేలా ప్లాన్ చేసుకుంటారు. ప్రతి సంక్రాంతి మాదిరే ఈ సారి కూడా బాక్సాఫీస్ వద్ద భారీ పోటీ నెలకొంది. ఈ పండక్కి తెలుగులో మొత్తంగా ఆరేడు సినిమాలు బరిలోకి దిగబోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే వచ్చే సంక్రాంతి సీజన్‌పై కొన్ని సినిమాలు కర్చీఫులు వేశాయి. అయితే వాటిల్లో ఏది రిలీజ్ కానుంది. ఏ సినిమా వెనక్కి తగ్గనుంది అనేది డిసెంబర్ మొదటి రెండోవారంలో క్లారిటీ రానుంది. సంక్రాతి బరిలో సినిమాల్లో చిరంజీవి నటించిన మన శంకర వర ప్రసాద్ గారు, ప్రభాస్ నటించిన రాజాసాబ్ సినిమాలు పెద్దహీరోలవి. వీటితోపాటుగా తమిళకథానాయకుడు దళపతి విజయ్ నటించిన జననాయగన్ కూడా పొంగల్ బరిలోనే నిలవనుంది. వీటితో పాటుగా భర్త మహాశయులకు విజ్ఞప్తి, అనగనగా ఒక రాజు, నారీ నారీ నడుమ మురారీ, పరాశక్తి వంటి సినిమాలు విడుదల కానున్నాయి. రాజాసాబ్, జననాయగన్ జనవరి 9న విడుదల కానున్నాయి. మన శివశంకర వరప్రసాద్ గారు సినిమా విడుదల తేదీ ఇంకా ప్రకటించలేదు. సంక్రాంతి మూవీ అని ముందుగానే దర్శకుడు అనిల్ రావిపూడి ప్రకటించారు. 14న 'అనగనగా ఒక రాజు' సినిమా విడుదల కానుంది.



పింఛను కోసం ఎదురుచూపు

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని టిడిపి కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఎన్నికల్లో విజయం సాధించడం కోసం టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేసేస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి పెద్దలు ఇచ్చిన వాగ్దానాలపై కనీసంగానైనా నోరు మెదపడం లేదు. కొత్త పెన్షన్లు మంజూరు చేయడం లేదు. టిడిపి కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఓపెన్ చేయకపోవడంతో కొత్త పెన్షన్లకు దరఖాస్తులకు అవకాశం లేకుండా పోయింది. వేలాది మంది అర్హులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం కానరావడం లేదు.

2023 నుంచి తెరుచుకోని వెబ్‌సైట్

కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అనేకమంది అర్హులు ప్రభుత్వాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచీ ఇబ్బందులు ఉన్నాయి. 2023 నవంబర్ తర్వాత వెబ్‌సైట్ తెరుచుకోని కారణంగా పాట్లు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వితంతువులు, వృద్ధులు, వికలాంగులు ఇలా అర్హులైన వారు పింఛన్ల కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంకా సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. కుటుంబ సభ్యుల ఆదాయం అంతంత మాత్రమే ఉండడంతో వీరి పోషణ కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచే పింఛను సొమ్ము చాలా కీలకంగా మారుతుంది. కూటమి అధికారులకు వచ్చినప్పటికీ కొత్త పెన్షన్ల ఊసెత్తడం లేదు. పైగా ఉన్న పింఛన్లలో ముఖ్యంగా వికలాంగుల పింఛన్లలో కోతలు విధిస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రెండు మూడు నెలల వ్యవధిలోనే కొత్త పెన్షన్లు మంజూరుకు అవకాశం ఉండేది. వితంతు పింఛన్ల విషయంలో భర్త చనిపోయిన తర్వాత డెత్ సర్టిఫికెట్ సచివాలయంలో సమర్పించిన కొద్ది నెలలకే పింఛను మంజూరు చేసేవారు. భర్త చనిపోయి ఏడాది, రెండేళ్లు కావస్తున్నా ఇంకా పింఛను మంజూరు కాక వందలాది సంఖ్యలో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వృద్ధులు కూడా పింఛన్లు మంజూరు కోసం ఆశగా నిరీక్షిస్తున్నారు.కనీసం మందుల ఖర్చుకైనా పింఛను డబ్బులు పనికొస్తాయని ఆశిస్తున్నారు.

మండలానికి వెయ్యి మందికి పైనే..

60 ఏళ్ల నిండిన వారికి సైతం పెన్షన్లు ఉందని పరిస్థితి ఉంది. ప్రతి మండలానికీ వెయ్యిమందికిపైనే వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్ల అర్హులు ఉన్నారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం ఆయా ప్రాంతాలకు వస్తున్న ప్రజాప్రతినిధులను అడుగుతుంటే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లవుతున్నా..

నా భర్త చనిపోయి సుమారు రెండేళ్లవుతోంది. నేటికీ నాకు వితంతు పింఛను మంజూరు కాలేదు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులను అడుగుతుంటే కొత్త పింఛన్లకు నోటిఫికేషన్ ఇవ్వలేదని చెబుతున్నారు. వెంటనే పింఛను ఇప్పించి ఆదుకోవా.

- అడపా భాగ్యలక్ష్మి,
వేములవాడ, కరప మండలం.

రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చాలి

రాష్ట్రాలకు కేంద్రం లేఖ
ముందు మీ మనస్తత్వం మార్చుకోండి
కేంద్రం తీరుపై స్టాలిన్ ఆగ్రహం

న్యూఢిల్లీ : రాజ్ భవన్ పేర్లను లోక్ భవన్‌గా మార్చడాన్ని పరిశీలించాలని రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నవంబర్ 25న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల కార్యాలయాలకు లేఖ రాసింది. "రాజ్ భవన్" పేరు "వలసవాదం" చిహ్నంగా విమర్శించింది. కాబట్టి అన్ని అధికారిక ప్రయోజనాల కోసం గవర్నర్ల కార్యాలయాలు, లెఫ్టినెంట్ గవర్నర్ల కార్యాలయాలను వరుసగా 'లోక్ భవన్' లేదా 'లోక్ నివాస్'గా పేరు పెట్టవచ్చని సూచించింది. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ గవర్నర్, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఈ విధంగా పేర్లను మార్చారు.

ప్రజాస్వామ్యాన్ని గౌరవించండి : స్టాలిన్

గవర్నర్ అధికారిక నివాసమైన రాజ్ భవన్ పేరును 'లోక్ భవన్'గా మార్చాలన్న ప్రతిపాదనను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఈ చర్యకు సిఫార్సు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు ఆలోచనా విధానాన్ని మార్చుకోవడం ముఖ్యమని సూచించారు. ప్రజాస్వామ్య సంస్థల పట్ల గౌరవం లేనప్పుడు రాజ్ భవన్ పేరు మార్పు చర్య అనవసరమని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల అధికారాన్ని గౌరవించడంలోనే నిజమైన జవాబుదారీతనం ఉంటుందని స్టాలిన్ తెలిపారు. ప్రజలచే ఎన్నుకున్న ప్రభుత్వాలను, ప్రజల అభీష్టాన్ని నెరవేర్చే సార్వభౌమ శాసనసభను గౌరవించడం ప్రస్తుతం అవసరమని స్టాలిన్ స్పష్టం చేశారు. ఆ ఆలోచన, ఆ చర్యలో మార్పు లేకపోతే రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చడం అనవసరమని విమర్శించారు, శాసనసభ పాత్రను సమర్థించని వారు గవర్నర్ నివాసం పేరును మార్చడం ద్వారా ఆ విలువను భర్తీ చేయలేరని ఆయన అన్నారు.

స్టాలిన్

ఐపిఎల్‌కు రస్సెల్ వీడ్కోలు

న్యూఢిల్లీ : వెస్టిండీస్ ఆల్ రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఐపిఎల్‌కు తన వీడ్కోలు పలికాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు తరపున 12 సీజన్లు బరిలోకి దిగిన రస్సెల్ తన ఐపిఎల్ కెరీర్‌కు ముగింపు పలికాడు. అయితే అతడు కోల్‌కతా నైట్ రైడర్స్‌కు సపోర్టింగ్ స్టాఫ్, పవర్‌కోచ్‌గా కొనసాగుతానని ప్రకటించాడు. రస్సెల్ ఇప్పటి వరకు 140 ఐపిఎల్ మ్యాచ్‌లు ఆడాడు. 174.2 స్ట్రైక్ రేట్, 28.2 యావరేజ్‌తో 2,651 పరుగులు చేశాడు. '88' అతడి వ్యక్తిగత అత్యధిక స్కోరు. బౌలింగ్‌లో 23.3 యావరేజ్‌తో 123 వికెట్లు తీసుకున్నాడు. ఒకసారి అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

కేంద్రం ఒంటెద్దు పోకడ

- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శ

ప్రజాశక్తి - న్యూఢిల్లీబ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనూ కేంద్రంలోని అధికార బిజెపి ఒంటెద్దు పోకడతోనే వ్యవహరించనున్నట్లు అఖిలపక్ష సమావేశంలో సంకేతాలు ఇచ్చిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఆదివారం పార్లమెంట్ హౌస్‌లో కేంద్ర రక్షణ మంత్రి, బిజెపి అగ్ర నాయకులు రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సమావేశాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అఖిల పక్ష సమావేశం కేవలం లాంఛనప్రాయంగానే కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందని, ప్రతిపక్షాల లేవనెత్తిన అంశాలపై కనీసంగానైనా స్పందించలేదని విమర్శించారు. పైగా ప్రతిపక్షాలతో ఎలాంటి సంప్రదింపులు కూడా జరపకుండా స్వల్పకాలిక చర్చకు ఒక అంశాన్ని జాబితా చేశారనీ, తద్వారా మోడీ ప్రభుత్వం తన ఏకపక్ష ధోరణిని చెప్పకనే చెప్పిందన్నారు. '15 రోజుల ఈ సమావేశాలు పార్లమెంటరీ చరిత్రలో అతి తక్కువ సమయం జరుగుతున్నాయి. మోడీ ప్రభుత్వం 13 బిల్లులను ఆమోదం కోసం జాబితా చేసింది. వీటిలో ఒకటి ఆర్డినెన్స్ స్థానంలో వస్తుంది. రెండు లోక్‌సభ కమిటీ నుంచి వస్తాయి. కాబట్టి పది బిల్లులను సంబంధిత స్టాండింగ్ కమిటీ పరిశీలనకు అవకాశం లేదు' అని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే మోడీ సర్కార్ లక్ష్యం : గౌరవ్ గొగోయ్

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉప నాయకులు గౌరవ్ గొగోయి ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌ను పట్టాలు తప్పించి పార్లమెంటరీ సంప్రదాయాలను సమాధి చేయాలని చూస్తోందన్నారు. అఖిల పక్ష సమావేశంలో రెండు గంటల పాటు ప్రతిపక్షాల డిమాండ్లు విన్నారే కానీ కేంద్ర మంత్రులు నోరు మెదిపింది లేదని ఆయన అన్నారు. ఢిల్లీలో ఎర్రకోట వద్ద ఉగ్రదాడి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వైఫల్యానికి ఉదాహరణ అన్నారు. ఎస్ఐఆర్, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలపైనా చర్చ అత్యంత అవశ్యకమన్నారు.



అఖిలపక్ష సమావేశం సందర్భంగా మాట్లాడుకుంటున్న కేంద్రమంత్రి రాజనాథ్ సింగ్, జాన్ బ్రిట్టాస్ తదితరులు

లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలి : జాన్ బ్రిట్టాస్

లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలని సిపిఎం రాజ్యసభ నేత జాన్ బ్రిట్టాస్ డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటంతో దేశంలోని కార్మికవర్గం సాధించుకున్న హక్కులను కేంద్రం హరించిందన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఉండే కార్మిక కోడ్‌లపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం ఉందన్నారు. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు ఐక్య నిరసనలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇతర చర్యలను పక్కన పెట్టి ఈ ముఖ్యమైన అంశంపై అత్యవసర చర్చకు ప్రభుత్వం సిద్ధం కావాలన్నారు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా ఎస్ఐఆర్ ప్రక్రియను కొనసాగిస్తోందని, రాజకీయ పార్టీలతో ఎటువంటి సంప్రదింపులు లేకుండా ఈ చర్య తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు సమిష్టిగా వ్యతిరేకించిన తరువాత కూడా కమిషన్ పట్టించుకోవడం లేదన్నారు.

పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఢిల్లీలో జరిగిన పేలుళ్ల తీవ్రమైన భద్రతా లోపాలను ప్రతిబింబించాయని, దీనికి కేంద్ర హోంమంత్రిత్వ శాఖదే బాధ్యత అని చెప్పారు. భద్రతా లోపానికి బాధ్యత వహించి, అది ఎలా జరిగిందో వివరించాలని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని అవమానించే ప్రకటనలు చేస్తూనే ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా 'ఆపరేషన్ సిందూర్'పై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. నిరుద్యోగం, మైనారిటీలపై దాడులు వంటి ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాలని బ్రిట్టాస్ డిమాండ్ చేశారు.

ఎస్ఐఆర్‌పై చర్చకు అనుమతించాలి : ఎస్‌పి నేత రాంగోపాల్ యాదవ్

శీతాకాల సమావేశాల్లో ఎస్ఐఆర్‌పై చర్చకు అనుమతించాల్సిందేన సమాజ్‌వాదీ పార్టీ ఎంపి రాంగోపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. ఒకవేళ అందుకు అనుమతించకపోతే పార్లమెంట్ స్థంభింబజేస్తామని హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ ఎస్ఐఆర్, ఉపాధి హామీ వంటి అంశాలను తాము చర్చకు ప్రతిపాదించామని తెలిపారు. ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదని తెలిపారు. డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ ప్రభుత్వం 14 బిల్లులను జాబితా చేసిందని, ప్రతిపక్షాలకు ఉమ్మడి సమస్య ఎస్ఐఆర్ అని అన్నారు. సిపిఐ ఎంపి పి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఢిల్లీ పేలుడు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలను లేవనెత్తినట్లు చెప్పారు. ఎస్ఐఆర్‌లో అక్రమాలు, వాయు కాలుష్యం వంటి అంశాలపై చర్చ చేయాలని డిమాండ్ చేశారు. కాగా... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నది జలాలు, ఖరీఫ్ సీజన్‌కు గాను రాష్ట్ర రైతుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేసినట్లు బిఆర్ఎస్ ఎంపి కెఆర్ సురేశ్ రెడ్డి వెల్లడించారు.

ఎస్ఐఆర్ పై ప్రతిపక్షం ఐక్య గళం

నిత్యావసరాల ధరలు, రైతులకు కనీస మద్దతు ధర కల్పించకపోవడం, గ్రామీణ ఉపాధి పథకం నిర్వీర్యం, గవర్నర్ల వ్యవస్థ, ఎస్ఐఆర్ రూపాల్లో ప్రజాస్వామ్యంపై దాడులు తదితర ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ఐక్యంగా గళం విప్పాయి. 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతోన్న ఎస్ఐఆర్‌పై సభలో చర్చకు పట్టుబట్టాయి. ఎర్ర కోట వద్ద జరిగిన ఉగ్రదాడిపైనా చర్చించాలని డిమాండ్ చేశాయి. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ముక్తసరిగా స్పందించారు. 'ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ సహా అనేక అంశాలు లేవనెత్తాయి. రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటాయి. సభను ఆటంకపరచవద్దు' అని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల సందర్భంగా పార్లమెంట్‌లో చర్చపై బిఎసిలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి కేంద్ర ప్రభుత్వం తరపు సీనియర్ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు కిరణ్ రిజిజు, జెపి నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, ఎస్‌పి ఎంపి రామ్ గోపాల్ యాదవ్, ఆర్‌జెడికి చెందిన మనోజ్ ఝా, డిఎంకె ఎంపి తిరుచ్చి శివ, టిఆర్ బాలు, టిఎంసికి చెందిన డెరెక్ ఓ'బ్రియన్, కళ్యాణ్ బెనర్జీ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, ఎన్‌సిపి ఎంపి ఫౌజియా ఖాన్, ఐయుఎంఎల్ ఎంపి ఈటి మొహమ్మద్ బషీర్, టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, జనసేన ఎంపి బాల శౌరి, వైసిపి ఎంపి మిథున్ రెడ్డి, బిఆర్ఎస్ ఎంపి కెఆర్ సురేశ్ రెడ్డి, కమల్ హాసన్‌తో పాటు మొత్తం 36 పార్టీల నుంచి 50 మంది నేతలు పాల్గొన్నారు.

చెట్లను కౌగిలించుకొని ప్రజా ఉద్యమానికి మద్దతు తెలియజేస్తున్న ప్రముఖ సినీ నటుడు సాయాజీ షిండే

కుంభమేళా కోసం వేలాది చెట్లు నరికివేత

- నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్ యత్నాలు
- సర్వత్రా ఆగ్రహం

ముంబయి : మహారాష్ట్రలోని నాసిక్ నగరంలో కుంభమేళా ఏర్పాట్ల కోసం వేలాది చెట్లు నరికివేయాలని నిర్ణయం తీసుకోవడంపై స్వరత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నాసిక్‌లో వచ్చే ఏడాది అక్టోబర్ 31 నుండి కుంభమేళా ప్రారంభం కానుంది. ఇందుకోసం పంచవటి, తపోవన్ ప్రాంతంలో 1,200 ఎకరాల్లో చెట్లు నరికేసి ఆ ప్రాంతంలో సన్యాసుల కోసం తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దాదాపు రెండు వేల మహా వృక్షాలు నేలకొరిగే ప్రమాదముంది. ఇందుకోసం ఏకంగా నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానం చేయడంతో ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లను రక్షించుకునేందుకు ఆందోళనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివారం ప్రముఖ విలక్షణ నటుడు సాయాజీ షిండే పాల్గొని మద్దతు తెలిపారు. ఒక్క చెట్టును తొలగించినా..ఊరుకునేది లేదని ప్రతిఘటించి తీరుతామని ఆయన హెచ్చరించారు. ప్రజల పోరాటానికి, ఎన్‌సిపి చీఫ్ రాజ్ థాకరే మద్దతు పలికారు. కుంభమేళా పేరుతో చెట్లను నరికివేసి, ఆ భూమిని తమకు ఇష్టమైన పారిశ్రామికవేత్తలకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుందని రాజ్‌థాకరే విమర్శించారు. 'వేరే ప్రాంతంలో కొత్త చెట్లను నాటుతామని ప్రభుత్వం నకిలీ హామీలు ఇస్తుంది. అలా ఎప్పుడూ జరగదు. ప్రభుత్వానికి వేరే చోట ఐదు రెట్లు ఎక్కువ చెట్లను నాటడానికి స్థలం ఉంటే, అక్కడే సాధు గ్రామాన్ని ఎందుకు నిర్మించకూడదు' అని ఆయన ప్రశ్నించారు.

బిజెపిది నకిలీ హిందుత్వం : ఉద్ధవ్ థాకరే

శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే కూడా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. 'ఈ చెట్లను నరికివేయడం హిందుత్వ పేరుతో జరుగుతున్న అవినీతి. బిజెపిది నకిలీ హిందుత్వం. కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకు చెట్లను నరికివేస్తున్నారు' అని ఉద్ధవ్ విమర్శించారు.

సన్యాసుల కోసం చెట్లు నరికేస్తారా? ఇదేం పద్ధతి : సాయాజీ షిండే

సన్యాసుల కోసం ఆశ్రయం కల్పించాలంటే కల్పించండి..ఇందుకోసం మహావృక్షాలను నరికేయడం ఏం పద్ధతి అని ప్రముఖ విలక్షణ నటుడు షియాజీ షిండే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకోసం ఒక్క చెట్టును తొలగించినా..ఊరుకునేది లేదని ప్రతిఘటించి తీరుతామని హెచ్చరించారు. 'సాధువులు రావచ్చు, పోవచ్చు, దాని వల్ల ఒరిగేది తరిగేది ఏమీ ఉండదు. కానీ చెట్లు తొలగించడం మన జీవితాలను, మన భవిష్యత్ తరాలను ప్రభావితం చేస్తుంది. అవనిపై చెట్లు ముఖ్యమైనవి. వాటిని రక్షించడం మన బాధ్యత' షియాజీ షిండే తెలిపారు. చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ప్రజలు కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సులు

- రెండు బస్సులు ఢీ.. 11 మంది మృతి
- 40 మందికి గాయాలు
- మరికొంత మంది పరిస్థితి విషమం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

చెన్నై: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. ఎదురెదురుగా వస్తున్న రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 11 మంది ప్రయాణికులు మరణించారు. మరో 40 మంది గాయపడ్డారు. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్షతగాత్రులను దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు.

స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో కరైకుడి వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు, మదురై వైపు వెళు న్న మరో ప్రభుత్వ బస్సు తిరుపత్తూరు సమీపంలోని రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లోని ప్రయాణికులూ చిక్కుకున్నారు. ప్రమాద ఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే.. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదస్థలి వద్ద మృతులు, క్షతగాత్రుల కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఈ ప్రమాదంలో 11 మంది ప్రయాణికులు మరణించారు. గాయపడిన 40 మందిని శివగంగై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంతమంది ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉండటంతో మతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీస్ అధికారి తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి

తిరుపత్తూరు ప్రమాద ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో 11 మంది మరణించడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు సరైన వైద్యం అందేలా చూడాల్సిందిగా జిల్లా కలెక్టర్‌ను, ఇంఛార్జి మంత్రి కెఆర్ పెరియకరుప్పన్‌ను స్టాలిన్ ఆదేశించారు.

ఛత్తీస్‌గడ్‌లో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

దంతేవాడ : ఛత్తీస్‌గడ్‌లోని దంతేవాడలో ఆదివారం 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 27 మందిపై రూ.65 లక్షల నగదు బహుమతి ఉంది. లొంగిపోయిన వారిలో భీమా అలియాస్ జహాజ్ కల్మ, హుంగి అలియాస్ రోష్ని సోడి తదితరులు ఉన్నారు. జహాజ్ కల్మ కంపెనీ నంబర్2లో సభ్యులు. 2019, 2020ల్లో జరిగిన కాల్పుల ఘటనలో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస విధానం ప్రకారం రూ.50 వేలు సహాయం అందిస్తామని పోలీసులు తెలిపారు. అలాగే, ఛత్తీస్‌గడ్ ప్రభుత్వంచే నైపుణ్యాభివృద్ధికి శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. బస్తర్‌లో ఇప్పటి వరకూ 1,160 మావోయిస్టులు లొంగిపోయారని రేంజ్ ఐజి పి సుందర్‌రాజ్ వెల్లడించారు. వీరిలో 916 మంది పురుషులు, 244 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. గతేడాదిలో ఈ ప్రాంతంలో సుమారు 800 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అలాగే, దంతేవాడ జిల్లాలో గత 20 నెలల్లో 508 మంది మావోయిస్టులు లొంగిపోయారని జిల్లా ఎస్‌పి గౌరవ్ రాయ్ తెలిపారు.

బ్రిటన్‌లో భారత విద్యార్థి దారుణ హత్య

లండన్ : భారత విద్యార్థి ఒకరు బ్రిటన్‌లో దారుణ హత్యకు గురయ్యారు. హర్యానాకు చెందిన 30 ఏళ్ల విజయ్ కుమార్ షెరాన్‌పై వోర్సెస్టర్ నగరంలోని బార్బోర్న్ రోడ్‌లో నవంబర్ 25 తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో తీవ్రంగా దాడి చేశారు. పోలీసులు వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ తరువాత రోజున విజయ్ కుమార్ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఐదుగురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకున్నారు. కాగా, మరోవైపు విజయ్ కుమార్ మృతదేహాన్ని స్వదేశం తీసుకునిరావడానికి అతని కుటుంబం భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. సాయం చేయాలని కోరుతూ విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌కు లేఖ రాసింది.

ఉక్రెయిన్ దాడిని ఖండించిన కజకిస్తాన్

ఆస్థానా: ప్రపంచ చమురులో ఒక్కశాతం కంటే అధికంగా ఉత్పత్తి చేసే కాస్పియన్ పైప్‌లైన్ కన్సార్టియం (సిపిసి)పై ఉక్రెయిన్ దాడిని కజకిస్తాన్ ఖండించింది. నల్లసముద్రం టెర్మినల్‌లోని సిపిసిపై ఉక్రెయిన్ నేవీ డ్రోన్‌లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో నల్లసముద్రం టెర్మినల్‌లోని లంగరు ప్రాంతం గణనీయంగా దెబ్బతిందని, దీంతో అక్కడ కార్యకలాపాలను నిలిపివేసినట్లు సిపిసి ఒక ప్రకటనలో తెలిపింది.

నోవోరోసిస్క్ నౌకాశ్రయం జలాల్లోని అంతర్జాతీయ కాస్పియన్ పైప్‌లైన్ కన్సార్టియం కీలకమైన మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ జరిపిన మరో ఉద్దేశపూర్వక దాడిపై నిరసన తెలుపుతున్నట్లు కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఘటన అంతర్జాతీయ చట్టాల నిబంధనల ద్వారా రక్షించబడుతున్న ప్రత్యేక పౌర సౌకర్యంపై దురాక్రమణ చర్యను సూచిస్తుందని పేర్కొంది.

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

- అన్నాచెల్లెలు సహా నలుగురి సజీవదహనం
- ఒక మహిళ సహా ఇద్దరికి గాయాలు
- ఘటనపై కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభం : పోలీసులు

ఢిల్లీ : ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాద ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నగరంలోని టిగ్రి ఎక్స్ టెన్షన్లోని చెప్పుల దుకాణంలో జరిగిన ఈ ఘటనలో అన్నా, చెల్లెలు సహా నలుగురు సజీవదహనమయ్యారు. ఒక మహిళ సహా ఇద్దరు గాయపడ్డారు. ఢిల్లీ పోలీసులు ఈ విషయాన్ని తెలిపారు. వివరాల్లోకెళ్తే... నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న చెప్పుల దుకాణంలో మంటలు చెలరేగినట్టు సాయంత్రం 6.24 గంటలకు పీసీఆర్ కాల్ వచ్చింది. దీంతో వెంటనే తమతో పాటు అగ్నిమాపక సిబ్బందిని తీసుకుని పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే భవనం మొత్తం మంటలు వ్యాపించాయి. దీంతో మంటలను అదుపుచేసేందుకు సుమారు 5 గంటల సమయం పట్టింది. ప్రమాదంలో మరణించినవారిలో భవన యజమాని జిమ్మీ, ఆయన సోదరి అనితగా గుర్తించామని అధికారులు చెప్పారు. మరో ఇద్దరు మృతులను గుర్తించాల్సి ఉందన్నారు. ఇక గాయపడినవారిలో ఒకరిని మమత (40)గా గుర్తించారు. 25 శాతం కాలిన గాయాలతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు ఆధారాలు సేకరిస్తున్నామని పోలీసు అధికారులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

ఫిలిప్పీన్స్‌లో అవినీతికి వ్యతిరేకంగా నిరసనలు

- అధ్యక్షుడు రాజీనామా చేయాలని వామపక్షాలు డిమాండ్
- మద్దతుగా పాల్గొన్న రోమన్ కేథలిక్ మతాధికారులు

మనీలా : వామపక్షాల నాయకత్వంలో ఫిలిప్పీన్స్‌లో అవినీతికి వ్యతిరేకంగా వేలాది మంది భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆదివారం నాడు దేశ రాజధాని మనీలాలో జరిగిన ఈ ర్యాలీలో ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి కుంభకోణంలో ప్రమేయం ఉన్న శాసన సభ్యులు, ఉన్నతాధికారులపై త్వరగా విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ద్వీప సమూహాల దేశమైన ఫిలిప్పీన్స్‌లో వరదలు, తుపాన్‌లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సర్వసాధారణమైతే వీటివల్ల జరిగే నష్టం కన్నా దానికి మించి వాటి పేరుతో జరిగే అవినీతి ప్రజలకు మరింత నష్టం చేస్తుంది.

అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. వరదలు, తీవ్రమైన తుపాన్‌ల సహాయక చర్యల పేరుతో నాసిరకం, లోపభూయిష్టమైన నియంత్రణ చర్యలు చేపట్టి కోట్ల రూపాయలను శాసన సభ్యులు, అధికారులు దండుకుంటున్నారని, అనేక ప్రాజెక్టులను ప్రకటించి వాటిలో భారీ అవినీతికి పాల్పడుతున్నారని ఆందోళనకారులు విమర్శించారు. దీనికి బాధ్యత వహిస్తూ అధ్యక్షులు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడి దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న ఆందోళనకారులు

భారీగా పోలీసుల మోహరింపు

మనీలా మహానగరంలో ర్యాలీని అడ్డుకోవడానికి దాదాపు 17 వేలమంది పోలీసులను ప్రభుత్వం మోహరించింది. అడుగడుగునా అనేక ఆటంకాలు సృష్టించినా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ప్రజాస్వామ్య దేశమైన ఫిలిప్పీన్స్‌లో ఈ మధ్య కాలంలో దోపిడీ ఆరోపణలపై ఇద్దరు అధ్యక్షులు పూర్తిగా పదవీచ్యుతులయ్యారు. అయితే దేశంలో జరుగుతున్న ఉద్యమాలపై సైన్యం స్పందించింది. 'ఫిలిప్పీన్స్ సాయుధ దళాలు స్థిరత్వానికి స్తంభంగా, ప్రజాస్వామ్యానికి దృఢమైన సంరక్షకుడిగా ఉంటామని పునరుద్ఘాటిస్తున్నాం' అని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న రోమన్ కాథలిక్ చర్చిలు ఆదివారం జరిగిన అవినీతి వ్యతిరేక నిరసనకు మద్దతు తెలిపాయి. చర్చి మతాధికారులు కూడా నిరసనలో పాల్గొన్నారని, చర్చిలకు సంబంధించిన వారు తెల్లటి దుస్తులు ధరించి దాదాపు 5 వేలమంది ప్రదర్శనలో పాల్గొన్నారని పోలీసులు తెలిపారు.

తిరుపతి, నెల్లూరుకు 'దిత్వా' ముప్పు

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. సచివాలయం ఆర్‌టిజిఎస్ నుంచి నెల్లూరు, తిరుపతి, వైఎస్ఆర్ కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో ఆమె ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్‌కు వెంటనే స్పందించాలన్నారు. ప్రమాద ప్రదేశాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో అధికారులను నియమించాలని ఆదేశించారు. రెండు రోజులపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలన్నారు. ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. రోడ్లపై పడిన చెట్టు కొమ్మలు, హోర్డింగ్స్ వంటి అడ్డంకులను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ అంతరాయం చోటుచేసుకుంటే వెంటనే పునరుద్ధరించాలన్నారు. సమీక్షా సమావేశంలో ఆర్‌టిజిఎస్ సెక్రటరీ కాటమనేని భాస్కర్, సిఇఒ ప్రఖర్‌జైన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తం : మంత్రి గొట్టిపాటి రవి

దిత్వా తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ కోస్తా, రాయలసీమ అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్‌శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని ఆదేశించారు.

ఇజ్రాయిల్ సృష్టించిన విధ్వంసంతో గాజాలో మరుభూమిని తలపిస్తున్న ఒక ప్రాంతం

గాజాలో ఆగని ఇజ్రాయిల్ మారణకాండ

- 70 వేల మందికి పైగా మృతి

గాజా : ఇజ్రాయిల్ మారణకాండ కొనసాగుతూనేవుంది. పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకొని గాజా స్ట్రిప్‌లో అది సాగిస్తున్న అమానవీయ దాడుల్లో ఇప్పటి వరకు మరణించినవారి సంఖ్య ఆదివారం నాటికి 7100 దాటింది. క్షతగాత్రుల సంఖ్య 170965కు పెరిగింది. అమెరికా మధ్యవర్తిత్వంతో శాంతి ఒప్పందం అనంతరం కూడా ఇజ్రాయిల్ దాడులు సాగిస్తోంది. ఆదివారం నాటికి గడిచిన 24 గంటల్లో ఇజ్రాయిల్ జరిపిన ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో శాంతి ఒప్పందం తర్వాతి దాడుల్లో మరణాల సంఖ్య 356కు చేరింది. వాస్తవానికి ఈ ఏడాది అక్టోబర్ 10న కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. కానీ ఇజ్రాయిల్ దాడులు మాత్రం కొనసాగుతూనేవున్నాయి.

మరోవైపు గతంలో చేసిన దాడుల వల్ల శిథిలాల కింద చిక్కుకుపోయిన మతదేహాలు బయటకు తీస్తుండడంతో మరణించినవారి సంఖ్య మరింత పెరుగుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 70,100 మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తరువాత నుంచి లెక్కవేస్తే మొత్తం 352 మంది మరణించినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది.

పరిశోధన రంగంలో భారత్ ముందడుగు

- మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : అంతరిక్షం నుంచి వ్యవసాయం వరకూ వివిధ రంగాల పరిశోధనల్లో భారత్ ముందడుగు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆకాశవాణిలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్ సందర్భంగా ఆదివారం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఇటీవలి విజయాలను ఆయన ప్రస్తావించారు. దేశ యువత అంకితభావమే 'వికసిత్ భారత్' శక్తి అని పేర్కొన్నారు. దేశ నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మహే ప్రవేశించడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇస్రో నిర్వహించిన డ్రోన్ పోటీ సందర్భంగా అంగారక గ్రహం మాదిరి పరిస్థితుల్లో డ్రోన్లను ఎగరవేయడానికి జెన్-జెడ్ యువత ప్రయత్నిస్తుండటం చూస్తే ముచ్చటేస్తోందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా తేనెటీగల పెంపకం కార్యక్రమాలు, క్రీడా రంగంలో సాధించిన విజయాలు, 2030లో కామన్వెల్త్ క్రీడల నిర్వహణకు భారత్ బిడ్‌ను గెలుచుకోవడం, దక్షిణాఫ్రికా, భూటాన్ పర్యటనల గురించి కూడా మోడీ ప్రస్తావించారు.

అవినీతి కేసులో క్షమాభిక్ష కోరిన నెతన్యాహు

జెరూసలేం : అవినీతి కేసులో విచారణను ఎదుర్కొంటున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఆ దేశ అధ్యక్షుడిని క్షమాభిక్ష కోరారు. అధ్యక్ష కార్యాలయంలోని న్యాయ విభాగానికి క్షమాపణ కోసం అభ్యర్థనను సమర్పించారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీన్ని 'అసాధారణ అభ్యర్థన'గా అధ్యక్ష కార్యాలయం అభివర్ణించింది. ఇది అనేక చిక్కులతో కూడికుని ఉందని తెలిపింది. నెతన్యాహును క్షమించాలని ఇజ్రాయిల్‌కు అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విజ్ఞప్తి చేసిన కొన్ని రోజుల్లోనే ఈ అభ్యర్థన చేయడం గమనార్హం.

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి

(మొదటిపేజి తరువాయి)

దళిత కుటుంబమని, పెంచలయ్య భార్యతో పాటు ఇద్దరు చదువుకుంటున్న పిల్లలున్నారని వివరించారు. ఆ కుటుంబానికి కనీసం రూ.50 లక్షల సహాయం, ఆరు ఎకరాల భూమి, ఒక ఇల్లు శాంక్షన్ చేయాలని కోరారు. ఆయన భార్య దుర్గకు ఉద్యోగం కల్పించాలని, ఇద్దరు పిల్లల చదువుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు మీ నుండి ప్రకటన వస్తుందని, ఇప్పటికైనా వెంటనే ఆ కుటుంబాన్ని సందర్శించి వారికి భరోసా కల్పిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్కడో, ఇక్కడో గంజాయి నేరస్తులను పట్టుకుంటున్నప్పటికీ కీలక సూత్రధారులు యథాతథంగా ఉన్న ఫలితమే ఈ హత్యని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, మద్యం, మత్తు పదార్థాల అక్రమ అమ్మకాల మాఫియాను అరికట్టేందుకు మరింత స్పష్టమైన, సమగ్రమైన చర్యలు చేపట్టాలని ఈ దారుణ ఘటన హెచ్చరిస్తుందని వివరించారు. ఈ మాఫియా ముఠాలు రాష్ట్రంలో ఎక్కడున్నా అధికార యంత్రాంగంతో అంటకాగి రక్షణ పొందుతున్నారని, ఇలాంటి శక్తులను ప్రోత్సహించేవారు ఏ పార్టీలో ఉన్నా, అధికార యంత్రాంగంలో ఏ స్థానంలో ఉన్నా అలాంటి శక్తులపట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్, మాఫియాను అరికట్టేందుకు త్రికరణశుద్ధితో తగిన చర్యలు చేపట్టాలని, వాటిపై పోరాడే ప్రజలకు బాసటగా ప్రభుత్వం నిలబడాలని కోరారు.

టీమిండియా ఘన విజయం

పోరాడి ఓడిన దక్షిణాఫ్రికా
రాణించిన విరాట్, రోహిత్, కెఎల్ రాహుల్
మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో భారత్

రాంచీ : విరాట్ వీరవిహారం.. రోహిత్ మెరుపులు.. కెఎల్ రాహుల్ అద్భుత ఇన్నింగ్స్.. వెరసి తొలి వన్డేలో టీమిండియా అదరగొట్టింది. ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాంచీలో జరుగుతున్న తొలి వన్డేలో తొలుత దక్షిణాఫ్రికా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా భారీ స్కోరు సాధించింది. టీమిండియా స్టార్ క్రికెటర్, కింగ్ కోహ్లీ (120 బంతుల్లో 135) సూపర్ సెంచరీ సాధించాడు. రోహిత్ శర్మ, కెప్టెన్ కెఎల్ రాహుల్ అర్ధశతకాలు చేశారు. దీంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 349 పరుగులు చేసింది. అనంతరం బాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 332 పరుగులు చేసి ఆలౌట్ అయింది. తొలుత భారత్ ఇన్నింగ్స్‌లో 25 పరుగుల వద్ద జైస్వాల్ (18) ఔట్ కాగా.. వన్ డౌన్ లో వచ్చిన విరాట్ కోహ్లీ .. ఆది నుంచే దూకుడుగా ఆడాడు. రోహిత్, కోహ్లీ ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు పరుగులు రాబట్టడంలో పోటీ పడ్డారు. ఈ క్రమంలో 57 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద రోహిత్ శర్మ ఔట్ అయ్యాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 134 పరుగులు జోడించారు. రోహిత్ ఔటైన తర్వాత కూడా విరాట్ నిలకడగా ఆడి సెంచరీ సాధించాడు. 120 బంతుల్లో 7 సిక్సులు, 11 ఫోర్లతో 135 పరుగులు చేశాడు. కోహ్లీకి వన్డే కెరీర్‌లో ఇది 52వ సెంచరీ. అలాగే అతడు దాదాపు రెండేళ్ల తర్వాత చేసిన సెంచరీ ఇది. విరాట్ ఇంతకు ముందు చివరిసారిగా 15 నవంబర్ 2023లో వన్డే వరల్డ్‌కప్ టోర్నీలో ఆస్ట్రేలియా మీద 117 పరుగులు చేశాడు. చివర్లో కెఎల్ రాహుల్ (60) అర్ధశతకం సాధించాడు.

రవీంద్ర జడేజా (20 బంతుల్లో 32 పరుగులు) వేగంగా పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13), అర్షదీప్ సింగ్ (0) విఫలమయ్యారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రీజులోకి వచ్చీరాగానే ఫోర్‌తో ఖాతా తెరిచాడు. క్రీజులో ఉన్నంత సేపు మంచి రిథమ్‌లోనే కనిపించాడు. కానీ దూకుడుగా ఆడే ప్రయత్నంలో జైస్వాల్ (18) నాంద్రే బర్గర్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రవీంద్ర జడేజా (32) సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఓట్నీల్ బార్ట్‌మన్, నాంద్రే బర్గర్, మార్కో యాన్సెన్, కోర్బిన్ బాష్ తలో రెండు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా దూకుడుగా ఆడే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో రెండు ఓవర్లకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. హర్షిత్ రాణా బౌలింగ్‌లో ఓపెనర్ రికెల్టన్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన డికాక్ కీపర్ కెఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అర్షదీప్ వేసిన ఐదో ఓవర్‌లో మార్క్రమ్(7) మూడో వికెట్‌గా ఔటయ్యాడు. అనంతరం కుల్దీప్ బౌలింగ్‌లో జార్జ్(39) ఎల్‌బిడబ్ల్యూగా ఔటయ్యాడు. అనంతరం హర్షిత్ రాణా వేసిన 24 ఓవర్‌లో బ్రెవిస్ (37) రుతురాజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ తరుణంలో దూకుడుగా ఆడుతూ అర్ధశతకం పూర్తిచేసుకున్న యాన్సన్(70) కుల్దీప్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఈ క్రమంలోనే ఆచితూచి ఆడుతూ పరుగులు వరద పారిస్తున్న మాథ్యూ 72 పరుగుల వద్ద కోహ్లీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. మాథ్యూ, యాన్సన్ వంటి కీలక వికెట్లను కుల్దీప్ పడగొట్టి సౌతాఫ్రికాను కష్టాల్లోకి నెట్టాడు. సుబ్రయెన్ (17)ను కూడా కుల్దీప్ 39వ ఓవర్‌లో ఔట్ చేశాడు. అనంతరం అర్షదీప్ బౌలింగ్‌లో రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి బర్గర్ (17) కూడా పెవిలియన్‌కు చేరాడు. దూకుడుగా ఆడిన బాష్(67) చివరి వికెట్‌గా వెనుదిరిగాడు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం-ప్రజల పక్షం
దినపత్రికలో ఉద్యోగ అవకాశాలు
జర్నలిజం కాలేజీలో శిక్షణ
► సబ్ ఎడిటర్లు
► రిపోర్టర్లు
► వెబ్ జర్నలిస్టులు
తెలుగులో ప్రావీణ్యం ఉండాలి
వర్తమాన, సామాజిక, ఆర్థిక రాజకీయాలపై అవగాహన
జర్నలిజంపై ఆసక్తి కలిగి ఉంటే..
బయోడేటాను మెయిల్ చేయగలరు
చివరి తేదీ 2025 డిసెంబర్ 10
కనీస విద్యార్హత : డిగ్రీ చదివినవారు
సంప్రదించాల్సిన అడ్రస్ : ప్రజాశక్తి భవనం,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా
prajasakti.hr@gmail.com
ఫోన్ : 94940 98968, www.prajasakti.com

श्रम एवं रोजगार मंत्रालय भारत सरकार MINISTRY OF LABOUR & EMPLOYMENT GOVERNMENT OF INDIA

కార్మిక చట్టాలు
సమర్థవంతంగా అమలులోకి వచ్చాయి
"దేశం తన శ్రామిక శక్తి పట్ల గర్వంగా ఉంది. శ్రమేవ జయతే!,,
-ప్రధానమంత్రి, నరేంద్ర మోడీ

మోడీ ప్రభుత్వపు హామీ
భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికులకు
- అందరూ కార్మికులకు కనీస మరియు సకాలంలో వేతనాలు
- ఓవర్ టైం పని అనేది ఇప్పుడు సమ్మతి ఆధారంగా, వేతన రేటుకు రెట్టింపు జీతంతో ఉంటుంది
- వర్తించే ఏకరీతి జాతీయ భద్రతా ప్రమాణాలు
- కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీ
- కార్మికుల సంఖ్య ఆధారంగా క్రెష్ మరియు క్యాంటీన్ ఏర్పాటు
- వలస కార్మికులకు సంబంధిత సంక్షేమ ప్రయోజనాలు పోర్టబుల్ చేయబడ్డాయి

ఆత్మనిర్భర్ భారత్ కోసం కార్మిక సంస్కరణలు
CBC 23101/13/0011/2526

भारत निर्वाचन आयोग Election Commission of India

భారత ఎన్నికల కమిషన్ దేశంలోని 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను నిర్వహిస్తోంది

అర్హత కలిగిన ఏ ఓటరును వదిలిపెట్టకూడదు,
అనర్హులైన ఏ ఓటరును జోడించకూడదు

1- అండమాన్ మరియు నికోబార్ దీవులు
2- ఛత్తీస్‌గఢ్
3- గోవా
4- గుజరాత్
5- కేరళ
6- లక్షద్వీప్
7- మధ్యప్రదేశ్
8-పుదుచ్చేరి
9-రాజస్థాన్
10- తమిళనాడు
11- ఉత్తరప్రదేశ్
12- పశ్చిమ బెంగాల్

ECINet పౌరుల కోసం ఒకే ఏకీకృత మొబైల్ యాప్ ఓటరు సేవలకు సంబంధించిన 40+ యాప్‌లు/ వెబ్‌సైట్‌లను అనుసంధానిస్తుంది

చివరి SIR జాబితాలో మీ పేరును తనిఖీ కోసం ఈ దశలను అనుసరించండి

వెబ్‌సైట్ ద్వారా
- సందర్శించండి voters.eci.gov.in
- "చివరి SIR లో మీ పేరును శోధించండి" ఎంపికను ఎంచుకోండి
- మీ సమాచారాన్ని పూరించండి
  - రాష్ట్రాన్ని ఎంచుకోండి
  - ఓటరు పేరును నమోదు చేయండి
  - కాప్చా పూర్తి తర్వాత, సర్చ్‌పై క్లిక్ చేయండి
- ఖచ్చితమైన శోధన కోసం బంధువు పేరును ఎంచుకోండి; మరియు మరింత ఖచ్చితమైన శోధన కోసం జిల్లా/అసెంబ్లీ నియోజకవర్గం (ఏసి)/భాగాన్ని ఎంచుకోండి

ECINet APP ద్వారా
- ECINet ని డౌన్‌లోడ్ చేసి ఓటరు నమోదు ఫారమ్‌లపై క్లిక్ చేయండి
- "చివరి SIR లో మీ పేరును శోధించండి" ఎంపికను ఎంచుకోండి
- మీ సమాచారాన్ని పూరించండి
  - రాష్ట్రం ఎంచుకోండి
  - ఓటరు పేరును నమోదు చేయండి
  - కాప్చా నింపిన తర్వాత, సర్చ్‌పై క్లిక్ చేయండి
- ఖచ్చితమైన శోధన కోసం బంధువుల పేరును ఎంచుకోండి; మరియు మరింత ఖచ్చితమైన శోధన కోసం జిల్లా/అసెంబ్లీ నియోజకవర్గం (ఏసి)/భాగాన్ని ఎంచుకోండి

మీ గణన ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో పూరించండి

ఈసిఐ వెబ్‌సైట్ https://voters.eci.gov.in/ ని సందర్శించండి
- ఓటిపి ద్వారా రిజిస్టర్డ్ మొబైల్ నెంబరు, EPIC లేదా ఇ-మెయిల్‌తో లాగిన్ అవ్వండి
- సర్వీసెస్ ట్యాబ్ కింద మీ గణన ఫారమ్‌ను పూరించండిపై క్లిక్ చేయండి
- మీ రాష్ట్రాన్ని ఎంచుకోండి, EPIC నెంబర్‌ను పూరించండి మరియు మీ ముందు నింపిన గణన ఫారమ్‌ను తెరవండి
- మీరు భారతదేశం వెలుపల ఉంటే, విదేశీ ఓటర్లపై క్లిక్ చేసి వివరాలను పూరించండి

ECINet APP
- యాప్ స్టోర్‌కు వెళ్లండి
- ECINet APP డౌన్‌లోడ్ చేసుకోండి
- ఓటరు సేవల విభాగానికి వెళ్లి ఓటరు నమోదు ఫారంపై క్లిక్ చేయండి



- ముందుగా నింపిన గణన ఫారంలో మీ సమాచారాన్ని తనిఖీ చేయండి
- మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను నమోదు చేసి ఓటిపి ద్వారా పూర్తి గణన ఫారంను పూరించండి
- గణన ఫారంలో మీ సమాచారాన్ని తనిఖీ చేయండి, చివరి SIR నుండి లింక్ చేయండి, పూర్తి వివరాలను పూరించండి మరియు ఫోటోను అప్‌లోడ్ చేయండి
- ప్రివ్యూలోని అన్ని సమాచారాన్ని తనిఖీ చేసి, సమర్పించు గణన ఫారంపై క్లిక్ చేయండి
- గణన ఫారమ్ విజయవంతంగా సమర్పించినందుకు రసీదుపై ఇ-సైన్ చేసి డౌన్‌లోడ్ చేసుకోండి

ముఖ్యమైన తేదీలు

గణన ఫారం పూర్తిచేయు కాలవ్యవధి	: 4 నవంబర్-11 డిసెంబర్ 2025
ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ	: 16 డిసెంబర్ 2025
క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల వ్యవధి	: 16 డిసెంబర్ 2025-15 జనవరి 2026
నోటీసు ఫేజ్	: 16 డిసెంబర్ 2025-7 ఫిబ్రవరి 2026
తుది ఓటరు జాబితా ప్రచురణ	: 14 ఫిబ్రవరి 2026

ఈసిఐ వెబ్‌సైట్‌ను సందర్శించండి
https://voters.eci.gov.in/

CBC: 52101/13/0012/2526

fb.com/ECI @ecisveep youtube.com/eci Election Commission of India @ecisveep Election Commission of India

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68